Regd. No. HSE/929/2014-2016
Published on 15-09-2015

Sthanika Palana
Date of posting Sep, 2015

RNI No. APTEL/27888/2009
No. R&D/HSE/929/WPP/2014-15






మనకున్నదానితో సంతృప్తి పడటం ఉత్తమమే కానీ...
మనకున్న జ్ఞానం చాలనుకోవడం అజ్ఞానం.

– డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ

తాజా సమాచారం కోసం www.tsipard.gov.in
మరియు YouTube facebook /tsipard
టోల్ ఫ్రీ నెం.: 1800 425 7070



# స్థానిక పాలన

సెప్టెంబర్, 2015
గ్రామీణ వికాస మాసపత్రిక
సంపుటి: 7 సంచిక: 8 పేజీలు: 68 వెల: రూ. 20/-

17-08-2015




StanikaCov_SEP_2015.indd 1
16/09/15 1:14 PM

టిసిపార్డ్
TSIPARD

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 7 సంచిక: 8

సెప్టెంబర్, 2015



*ఎడిటర్*

**అనిత రామచంద్రన్**, ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

*ఎడిటోరియల్ బోర్డు*

**కె. యాదయ్య**

**డా॥ కె. ఆసయ్య**

**ఎ. నాగేశ్వరరావు**

*కాన్సెప్ట్, ప్లానింగ్,*
*ఎడిటింగ్, డిజైనింగ్*

**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్, టిసిపార్డ్**

**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్



*ప్రచురణ*

**టిసిపార్డ్**
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
తెలంగాణ, ఇండియా



ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని, టిసిపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.


# విషయ సూచిక


సంపాదకీయం ....................................................4

అద్భుత విజయాలు సాధించే దిశగా 'గ్రామజ్యోతి' ....................5

గ్రామజ్యోతి కార్యాచరణ కమిటీలు....................................11

గ్రామ పారిశుద్ధ్యం మరియు త్రాగునీరు కమిటీ......................14

ఆరోగ్యం మరియు పోషకాహార కార్యాచరణ కమిటీ....................20

విద్యా కార్యాచరణ కమిటీ...........................................24

సామాజిక భద్రత మరియు పేదరిక నిర్మూలనా కార్యాచరణ కమిటీ.......29

వ్యవసాయ కార్యాచరణ కమిటీ.......................................31

సహజ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ.......................46

ఇందిర జలప్రభ ...................................................48

సమిష్టి కృషితో నీటి సంరక్షణ .....................................50

మౌళిక వసతుల కార్యాచరణ కమిటీ .................................52

దళితవాడల అభివృద్ధి ప్రణాళికలు..................................55

గిరిజన తండాల అభివృద్ధి ప్రణాళికలు ..............................56

గ్రామాల సమగ్రాభివృద్ధే గ్రామజ్యోతి లక్ష్యం.........................57

గ్రామజ్యోతిపై పత్రిక నివేదికలు ....................................61

గ్రామజ్యోతి స్ఫూర్తితో ఆదర్శగ్రామాలు...............................63

బ్రతుకు పోరాటానికి భరోస – వలసల నివారణకై ఉపాధి హామీ పథకం..........65

# ప్రజా చైతన్య దీప్తి – గ్రామజ్యోతి

దేశాభివృద్ధికి అట్టడుగున ఉన్న గ్రామసీమల అభివృద్ధే కీలకం. అందుకుగాను గ్రామ పంచాయితీలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పూనుకుంది. ఇందులో భాగంగా గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా ప్రజలను గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా చేసి, గ్రామ సభలు నిర్వహించి, గ్రామ సమస్యలను గుర్తించి ఆ సమస్యను గ్రామసభలో పరిష్కరించేట్లు చేయడం, ఈ అభివృద్ధిలో సర్పంచ్ మరియు కార్యాచరణ కమిటీల ఆధ్వర్యంలో గ్రామంలో పనిచేసే అధికారులను సమన్వయం చేసి పనులు నిర్వహించేందుకు పురికొల్పడం, గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అమలు పరిచేట్లు అధికారులు పనిచేసి గ్రామాలలోని ప్రజలకు సురక్షిత త్రాగునీటి కల్పన, పారిశుధ్యాన్ని పాటించేట్లు చేయడం, నిరక్షరాస్యతను నిర్మూలించడం, గ్రామంలో ఉన్న బడిఈడు పిల్లలందరిని పాఠశాలకు పంపేవిధంగా చర్యలు గైకొనడం వంటి కార్యక్రమాలతో గ్రామాభివృద్ధికి తోడ్పడడం గ్రామజ్యోతి కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం.

ఈ అభివృద్ధి కార్యక్రమం సర్పంచ్, వార్డు సభ్యులను, కార్యాచరణ కమిటీ సభ్యులను, సంబంధిత అధికారులను బాధ్యులుగా చేసి గ్రామ పురోభివృద్ధికి తోడ్పడేలా చేస్తుంది. రాజ్యాంగంలోని 40వ అధికరణ ప్రకారం గ్రామాలకు చేయూతనందించడం, 73, 74వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న విధంగా 29 అంశాలను గ్రామాలకు బదిలీచేసి పురోభివృద్ధికి నోచుకోని గ్రామసీమలలో వెలుగులు నింపడం, ఇందుకుగాను గ్రామ పంచాయితీలు కంప్యూటరీకరించడం, అన్ని సేవలు అందుబాటులోకి వచ్చేలా చూడడం, పింఛన్లు మొదలుకొని సర్టిఫికెట్లు జారీచేయు ప్రక్రియ అంతా గ్రామ పంచాయితీలోనే కేంద్రీకరించబడి నిరంతర సేవా కేంద్రాలుగా రూపుదిద్దుకోవడానికి గ్రామజ్యోతి ఎంతగానో తోడ్పడుతుంది.

గ్రామ పంచాయితీలకు తలసరి గ్రాంటు, వృత్తిపన్ను, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు అందజేస్తుంది. అదేవిధంగా గ్రామ పంచాయితీలకు కేంద్ర ఆర్థిక సంఘం ఇచ్చే నిధులను విడుదల చేసి గ్రామ పంచాయితీలలో మంచినీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలు ఇతర పథకాల నిర్వహణకు ప్రోత్సాహాన్నిస్తుంది.

ఈ నిధులతో గ్రామాలలో ఆదాయాన్నిచ్చే ఆస్తులను పెంపొందించాలి. ఇందుకు గ్రామ పంచాయితీలు ప్రముఖపాత్ర నిర్వహించాలి. ప్రజలను భాగస్వాములను చేస్తూ గ్రామాల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించటానికి కృషి చేయాలి. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, ప్రజా పంపిణీ మరియు ఇతర సంక్షేమ పథకాలు ప్రజలకు అందేట్లు చూడాలి. గ్రామ సభలు సంవత్సరంలో విధిగా 4 సార్లు జరిపి ఆయా శాఖల అధికారులను భాగస్వాములుగా చేసి మార్పుకు తోడ్పడాలి.

గ్రామ పంచాయితీలే వేదికగా సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో సమిష్టికృషి, సంఘటిత నిర్ణయాలు, పారదర్శకతతో గ్రామసభలు నిర్వహిస్తే అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమవుతాయి.

ఇందుకుగాను గ్రామస్థాయిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధితో కృషి చేస్తే గ్రామాలు ముందడుగు వేస్తాయి.

( అనిత రామచంద్రన్ )




# అద్భుత విజయాలు సాధించే దిశగా 'గ్రామజ్యోతి'

**రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలను శక్తివంతం చేస్తూ పాలనను ప్రజల దగ్గరకు తీసుకుపోయేందుకు 'గ్రామజ్యోతి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.**

**రేషన్ కార్డు దగ్గర నుంచి ఆరోగ్యశ్రీ కార్డు వరకు, వివిధ రకాల ధృవపత్రాల జారీ, ఆసరా ఫించన్ల పంపిణీ, ఉపాధి హామీ కూలీల చెల్లింపులు, ఆస్తిపన్ను చెల్లింపులు, కేజీ టు పీజీ చదువుకు వెళ్ళేందుకు, గ్రామం నుంచి విశ్వ గ్రామానికి అడుగుపెట్టేందుకు ఒక పునాదిగా, ఒక ప్రాతిపదికగా, ఒక కార్యక్షేత్రంగా గ్రామ పంచాయితీ వ్యవస్థ మారాలి. అందుకు ప్రతి రూపంగా 'గ్రామజ్యోతి' పథకం ఒక సాధన కావాలి అనే సదుద్ధేశంతో గ్రామజ్యోతికి శ్రీకారం చుట్టారు.**

గ్రామానికి సంబంధించిన ప్రతి విషయాన్ని గ్రామ పంచాయతీ మాత్రమే నిర్వహించాలి. ప్రజలు అందులో భాగస్వాములైనప్పుడు మాత్రమే గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందగలుగుతుంది. గ్రామాభివృద్ధిలో, నిర్మాణాత్మకమైన కార్యక్రమాల్లో ప్రతి పౌరుడు, ప్రతి పౌరురాలు భాగస్వాములు కావాలి. ఇందుకు గ్రామ పంచాయతీ పెద్దన్న పాత్ర పోషించాలి.

గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థల ద్వారా చాలా నిధులు ఖర్చు చేయబడుచున్నవి. అయినా గ్రామాల్లో ఆశించిన మార్పులు జరగడం లేదు. ప్రణాళికా బద్దంగా నిధులు ఖర్చు కాకపోవడం, ప్రజలు ఈ ప్రణాళికల్లో భాగం కాకపోవడమే ఇందుకు కారణం. గంగదేవిపల్లి, అంకాపూర్, ముల్కనూర్ వంటి గ్రామాలు ఈ లోపాలను అధిగమించి అభివృద్ధి సాధించాయి. గ్రామాల్లో అభివృద్ధికి అపార అవకాశాలున్నాయని ఈ మూడు గ్రామాలు ప్రపంచానికి చాటుతున్నాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థ సంఘటిత శక్తి సహకార వ్యవస్థలు ఈ గ్రామాల్లో పటిష్టంగా ఉండడమే ఇందుకు కారణం.

నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఆశయం బంగారు తెలంగాణ సాధించడం. ఆ ఆశయసిద్ధి కోసం అత్యధిక ప్రజలు నివసిస్తున్న పల్లెలు స్వావలంభన సాధించడానికి. గ్రామీణ వ్యవస్థ బాగుపడడానికి, గ్రామాలు స్వయం సమృద్ధి సాధించడానికి. సంఘటిత శక్తి ద్వారా గ్రామ ప్రజలు, అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు 'గ్రామజ్యోతి' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.

ప్రజల భాగస్వామ్యం పూర్తిస్థాయిలో లేనిదే అభివృద్ధి సాధ్యం కాదని, ప్రభుత్వ పథకాలు విజయవంతంగా అమలు కావని, ప్రజల సంఘటిత శక్తి ద్వారానే సంపూర్ణ సాధికారత సాధ్యమవుతుందని మన ముఖ్యమంత్రి ఆశించి గ్రామజ్యోతి ఆవిష్కరించారు. ఇందులో యావత్ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పోలీసులు, సెలబ్రిటీలు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు, ప్రభుత్వ యంత్రాంగం అంతా భాగస్వాముల్ని చేశారు.

గత నెల 17 నుండి 23 వరకు నిర్వహించిన గ్రామజ్యోతి కార్యక్రమం

ప్రారంభంలోనే అద్భుత విజయాలను సాధించింది. ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు అన్నిచోట్ల అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ. ప్రజలు ప్రభుత్వ పథకాల అమలులో భాగస్వాములయి పారదర్శకతతో, జవాబుదారీ తనంతో ముందుకు సాగిపోయే జన జాతర ఈ గ్రామజ్యోతి.

గ్రామాల సమగ్ర అభివృద్ధి కొరకు సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఆధ్వర్యంలోని కార్యాచరణ,'కమిటీలు' సమస్యలను గుర్తించి పరిష్కారానికి, పకడ్బందిగా ప్రణాళికలు రూపొందిచుకుంటున్నాయి.

గ్రామాల్లో సంపూర్ణ అభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలవాలని, తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సంపూర్ణ సహకారాలతో భాగస్వామ్యంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా చేపట్టిన గ్రామజ్యోతి పథకంతో పల్లెలు వేగంగా ప్రగతి పథంలో ముందుకు పోతున్నాయి. గ్రామ సభల్లో గుర్తించిన సమస్యలను చర్చించిన అంశాల ఆధారంగా నాలుగేళ్ళకు అభివృద్ధి ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి. 'మన ఊరు - మన ప్రణాళిక' కార్యక్రమంతో పల్లె అవసరాలేంటో ప్రభుత్వానికి తెలిసింది.

రాష్ట్రంలోని 8695 గ్రామ పంచాయితీలలో ప్రతి ఒక్క పంచాయితీకి ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న నిధులను ప్రభుత్వం స్పష్టం చేయడంతో అభివృద్ధి పనులను గుర్తించారు. గ్రామజ్యోతితో గ్రామాల దత్తతకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రముఖులతో ముఖ్యంగా పోలీస్ శాఖకు చెందిన అధికారులు ముందుకొచ్చారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1833 పంచాయితీలను దత్తత తీసుకున్నారు. గ్రామాల్లోని గ్రామ సభల్లో రచించిన ప్రణాళికలలో, గ్రామీణ ప్రజల ఆరోగ్యంలో కీలక పాత్ర వహించే పారిశుద్ధ్యం, మురుగునీటి కాలువల నిర్మాణం, నిర్వహణ, మరుగుదొడ్ల నిర్మాణం, ఆరోగ్యం, పోషకాహారం, నీటి సరఫరా, నిర్వహణ, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాలు మొదలైనవి చేర్చడం జరిగింది.

**మొత్తం గ్రామ పంచాయతీలు 8695**

**జిల్లాల వారీగా దత్తత పంచాయితీలు**

| జిల్లా | దత్తత పంచాయితీలు |
|---|---|
| అదిలాబాద్ | 339 |
| మెదక్ | 15 |
| వరంగల్ | 298 |
| నిజామాబాద్ | 264 |
| మహబూబ్ నగర్ | 212 |
| కరీంనగర్ | 462 |
| నల్గొండ | 300 |
| రంగారెడ్డి | 121 |
| ఖమ్మం | 207 |
| **మొత్తం** | **2518** |



నాలుగేళ్ళకు ఈ క్రింది సంస్థల ద్వారా నిధుల విడుదల చేయబడి పంచాయతీలకు అందుబాటులో ఉంటాయి.

- 14వ ఆర్థిక సంఘం
- రాష్ట్ర ఆర్థిక సంఘం
- తలసరి గ్రాంటు
- గ్రామ పంచాయితీ పన్నులు/స్వంత ఆదాయాలు
- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి నిధులు
- ఎస్.సి., ఎస్.టి. ఉప ప్రణాళికా నిధులు
- స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు మొదలగునవి

ప్రతి పంచాయతీలు వాటి విధుల నిర్వహణతో పోటీతత్వం పెంపొందుతాయి. పంచాయితీల పనితీరుకు కొలమానాలతో కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడినవి.




- గ్రామ సభల నిర్వహణ
- పంచాయితీ ఆస్తుల పరిరక్షణ
- పరిశుభ్రత
- మొక్కల పెంపకం
- అంతర్గత రోడ్లు, నిర్మాణం, నిర్వహణ
- ఆట స్థలాలు, పార్కులు, నిర్వహణ
- మార్కెట్ల సక్రమ నిర్వహణ
- కార్యాలయ రికార్డుల నిర్వహణ
- 100% పన్నుల వసూళ్లు ఇతర ఆదాయాలు సమీకరణ
- వనరుల నిధుల సమీకరణ
- అంగన్‌వాడి కేంద్రాల నిర్వహణ
- గర్భిణుల నమోదు
- ఆసుపత్రి ప్రసవాలు
- ఏడేళ్ళలోపు పిల్లలకు టీకాలు
- మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ
- మురికి కాలువలు / ఇంకుడు గుంతలు నిర్మాణము
- బడీఈడు పిల్లలను బడిలో చేర్పించడం
- అర్హులందరికీ ఉపాధి హామీ ద్వారా కల్పించిన పని దినాలు

## అన్ని శాఖలు ఒకే గొడుగు క్రింద

గ్రామజ్యోతి పథకంలో గ్రామాభివృద్ధి ప్రణాళికలు క్షేత్రస్థాయిలో, గ్రామంలో, గ్రామసభలో గ్రామస్థుల సమక్షంలో రూపొందిస్తారు. గ్రామస్థాయిలో పనిచేసే వివిధ శాఖల అధికారులు, గ్రామ సభకు జవాబుదారి ఉండటానికి ప్రభుత్వం కఠిన ఆదేశాలు జారీ చేసినవి. వారి శాఖల ప్రణాళికలు గ్రామసభలోనే ఆమోదించాలి.

నిధులు ప్రజాస్వామ్య పద్దతిలో పాదర్శకంగా ఖర్చు చేసేందుకు, ఉత్తమ ప్రణాళికలు రూపొందించుకోవడానికి గ్రామస్థాయిలో వివిధ కమిటీలు ఏర్పాటు చేయబడినవి. ఈ కమిటీలలో ఆయా అంశాలకు సంబంధించిన నిర్ణేతలు, ఆ అంశాలలో అనుభవజ్ఞులతో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు గ్రామములోని అందరికి ఆమోదయోగ్యమైన వ్యక్తులను స్వయం సహాయక సంఘాల సభ్యులను చేర్చుకుని ఆయా అంశాల పై దృష్టి సారించి, తగు ప్రణాళికలు రూపొందించుకుని నూరుశాతం లక్ష్యాలను సాధించడానికి పని చేస్తారు.

గత నెల 17 నుండి 24 వరకు జరిగిన గ్రామజ్యోతి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ నుండి మొదలుకొని ముఖ్యమంత్రి, రాష్ట్ర మంతులు, యం.ఎల్.ఏ.లు, యం.పి.లు, యం. ఎల్.సి.లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు అదే విధంగా రాష్ట్రస్థాయి అధికారుల నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్.పి.లు జిల్లాస్థాయి అధికారుల డివిజనల్ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, మండల మార్పు మార్గదర్శకులు, అధికారులు, గ్రామ నోడల్ అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఎన్.జి.ఓ.లు, ప్రజలు, సామాజిక కార్యకర్తలు, రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం గ్రామీణ జిల్లాలలో గ్రామస్థాయి ప్రణాళికలలో ఈ క్రింది వాటిని ఇప్పటివరకు గుర్తించడము జరుగుతున్నది.

**దత్తత గ్రామాలు 2518**

**గుర్తించిన శ్మశాన వాటికలు 3581**

**గుర్తించిన డంప్ యార్డులు 4910**

**బహిరంగ మల విసర్జన లేని గ్రామాలు**

## మరుగుదొడ్ల నిర్మాణానికి నిర్దేశించిన లక్ష్యాలు.......

వీటితో పాటు గ్రామాలలో గ్రామ జ్యోతి కార్యక్రమాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, ప్రతి పౌరునికి ఆరోగ్య సేవలను అందించడం, దీర్ఘకాలిక రోగులను గుర్తించి వారిని రిఫరల్ ఆసుపత్రులకు పంపించడం గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, త్రాగునీటి కలుషితం కాకుండా చూడడం, ఆ విధంగా ప్రజలలో అవగాహన పెంచడం, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డ్‌ల (చెత్తవేయుట)కు స్థలాలు గుర్తించడం, గుర్తించిన ప్రదేశాలలో విరివిగా మొక్కలు, హరితహారానికై మొక్కలు నాటడం, గ్రామాలలోని వీధులలో చెత్త, చెదారం, పిచ్చి మొక్కలు శుభ్రం చేయడం, మురుగు నీటి కాల్వలు శుభ్రం చేయడం.



అంతర్గత రోడ్లు, డ్రైన్లు నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ అంతేగాకుండా అనేక గ్రామాలలో "గుడుంబా" నిరోధక కమిటీల ద్వారా, గుడుంబా మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 'గుడుంబా' నిషేధించుకోవడం జరిగింది. తద్వారా గుడుంబా గుప్పిట్లో బంధీగా ఉన్న గ్రామాలకు విముక్తి కల్పిస్తున్నారు.

గ్రామాల్లోని చాలా కుంటుంబాల్లో యువకులు, ముఖ్యంగా కుటుంబ యజమానులు గుడుంబాకు బానిసలై పని పాటలేకుండా, కుటుంబాలను పట్టించుకోకుండా ఆడవాళ్ళే కుటుంబాన్ని పోషిస్తున్న దయనీయ పరిస్థితిని దూరం చేయటానికి ఆ పరిస్థితులు రాకుండా చేయటానికి గుడుంబాను అరికట్టటానికి ముందుకు రావడం జరుగుతుంది. ముఖ్యంగా వరంగల్ జిల్లాలోని అనేక గ్రామాలలో ప్రజలు గ్రామజ్యోతి కార్యక్రమాలలో ముందుకు వచ్చి గుడుంబాను నిషేధించడానికి పూనుకున్నారు.

చాలా గ్రామాలలో Soak Pits (ఇంకుడు గుంతలు) నిర్మించుకుని గ్రామంలో మురుగునీరు ప్రవహించకుండా చేసి గ్రామాన్ని శుభ్రపరుచుకోవడం ద్వారా గ్రామంలో దోమలు లేకుండా చేయగలిగినారు. రహదారులపై నీరు నిలవకుండా, శుభ్రంగా ఉంచడమే కాకుండా, దోమలు లేని గ్రామాలుగా తయారు చేసుకుంటున్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై దృష్టి సారించి, మాతా శిశు మరణాలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించి, ప్రభుత్వ/వైద్య సేవల గురించి వివరించి, ప్రజలను భాగస్వాములను చేయడం జరిగింది. పోషకాహారం, గర్భిణీ స్త్రీల పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు, ఆసుపత్రులలోనే కాన్పులు జరిగేటట్లు చూడడం వంటివి, ఆరోగ్య కమిటీల ద్వారా నిర్వహించడం జరుగుతుంది.

## దళిత వాడల అభివృద్ధి ప్రణాళికలు

దళిత వాడలలో, పౌర సేవల కొరకు, సిమెంటు రోడ్ల నిర్మాణం, మురుగు కాల్వల నిర్మాణం మరియు నిర్వహణ క్రమం తప్పకుండా మురుగు కాల్వలు శుభ్రం చేయడం, మరమ్మత్తులు చేయడం. ఇంకుడు గుంతలు నిర్మించి, మురుగునీరు రహదారులపై ప్రవహించకుండా చూడడం, నీరు నిల్వ లేకుండా చూడడం వంటి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

అదే విధంగా రక్షిత మంచినీరు, ఇంటింటికి నల్లా కనెక్షన్ల ద్వారా ఇవ్వడం, నీటిని క్లోరినేషన్ చేయడం, కలుషితం కాకుండా చూడడం. దళిత వాడల ప్రణాళికలో రూపొందించుకుంటున్నారు. దళిత వాడలలో సామూహిక భవనాలు (కమ్యూనిటీ భవనాలు) నిర్మించి, వాడుకునేటట్లు చూడడం దళిత వాడల ప్రణాళికలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు వాడకంలో అవగాహన కల్పిస్తున్నారు.

శ్మశాన వాటికలకు స్థలాన్ని గుర్తించి, అట్టి స్థలాన్ని స్థానిక తహసిల్దార్ ద్వారా ప్రభుత్వము నుండి కేటాయింపు చేయించుకుని దాని చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసుకొనుటకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అదేవిధంగా శ్మశాన వాటికలకు ఉపయోగపడే విధంగా నీరు, ఇతర సౌకర్యముల ఏర్పాటుకు తగిన ప్రణాళికలు, గ్రామజ్యోతిలో సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామస్థులందరూ కామన్‌గా కుల, మతాలకు అతీతంగా ఒకే శ్మశాన వాటికను వాడుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

అదేవిధంగా దళిత వాడలలో వీధిలైట్ల ఏర్పాటుకు గ్రామజ్యోతి గ్రామసభలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. తక్కువ విద్యుత్తు వినియోగంతో ఎక్కువ వెలుతురు ఇచ్చే బల్బులను వాడే విధంగా గ్రామసభలో ప్రోత్సహించడానికి, ఆ విధంగా దళిత వాడలలో అందరికి అవగాహన కల్పించేటట్లు చర్యలు తీసుకుంటున్నారు.

## తాండా అభివృద్ధి ప్రణాళికలు

తాండా వాడలలో, పౌర సేవల కొరకు, సిమెంటు రోడ్లు నిర్మాణం, మురుగు కాల్వల నిర్మాణం మరియు నిర్వహణ, క్రమం తప్పకుండా మురుగు కాల్వలు శుభ్రం చేయడం, మరమ్మత్తులు చేయడం. ఇంకుడు గుంతలు నిర్మించి, మురుగునీరు రహదారులపై ప్రవహించకుండా చూడడం, నీరు నిల్వ లేకుండా చూడడం చాలా ముఖ్యంగా భావించి, గ్రామజ్యోతి గ్రామసభలలో అవగాహన కల్పిస్తున్నారు.

అదే విధంగా రక్షిత మంచినీరు, ఇంటింటికి నల్లా కనెక్షన్ల ద్వారా నీరు ఇవ్వడం, నీటిని క్లోరినేషన్ చేయడం, కలుషితం కాకుండా చూడడం. తాండా వాడల ప్రణాళికలో రూపొందించుకుంటున్నారు. తాండా వాడలలో సామూహిక భవనాలు (కమ్యూనిటీ భవనాలు) నిర్మించి, వాడుకునేటట్లు చూడడం తాండా వాడల ప్రణాళికలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వాడకంలో అవగాహన కల్పిస్తున్నారు. శ్మశాన వాటికలకు స్థలాన్ని గుర్తించి, అట్టి స్థలాన్ని స్థానిక తహసిల్దార్ ద్వారా ప్రభుత్వం నుండి కేటాయింపు చేయించుకుని దాని చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసుకొనుటకు ప్రణాళికలు సిద్దమవుతున్నాయి.

అదేవిధంగా శ్మశాన వాటికలు ఉపయోగపడే విధంగా నీరు, ఇతర సౌకర్యముల ఏర్పాటుకు తగిన ప్రణాళికలు, గ్రామజ్యోతిలో సిద్ధం చేసుకుంటున్నారు. అదేవిధంగా తాండా వాడలలో వీధిలైట్ల ఏర్పాటుకు గ్రామజ్యోతి గ్రామసభలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. తక్కువ విద్యుత్తు వినియోగంతో ఎక్కువ వెలుతురు ఇచ్చే బల్బులను వాడే విధంగా గ్రామసభలో ప్రోత్సహించాలి. ఆ విధంగా తాండా వాడలలో అందరికి అవగాహన కల్పించేటట్లు చూడాలి.

## పల్లె సమగ్ర సేవా కేంద్రం

పల్లె సమగ్ర సేవా కేంద్రాల ద్వారా వివిధ ధృవపత్రాల జారీ, ఆసరా పించన్ల భట్వాడా, ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లించడం, మీ సేవా కేంద్రాలు నిర్వహించే సేవలు అందించడం, ఆస్థిపన్ను, ఇతర పన్నులు చెల్లించడానికి వీలుగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి పరిచి పల్లె సమగ్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నారు. దీని ద్వారా గ్రామజ్యోతిలో భాగంగా అన్ని ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోనికి తేనున్నారు.

కార్యాచరణ కమిటీల లక్ష్యాలను నిర్దేశించుకొని కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసుకోవడం జరుగుతుంది.

గ్రామ పంచాయితీ నోడల్ అధికారులు, దత్తత గ్రామాలలోని Adoption అధికారులు, సంబంధిత కమిటీలతో సమావేశాలు నిర్వహిస్తూ, పర్యవేక్షిస్తూ సమస్యలను చర్చిస్తూ, పరిష్కారాల ను కనుగొంటూ, వివిధ కార్యాచరణ కమిటీలకు దశా, నిర్దేశం చూపుతున్నారు.

కార్యాచరణ కమిటీలు, సభ్యులు పరస్పర సహకార స్ఫూర్తితో రాష్ట్రంలో అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామాల విజయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నారు.

## గంగదేవిపల్లి

గంగదేవిపల్లి ప్రజల్లో అద్వితీయమైన శక్తి ఉంది. అక్కడ 13 ఏండ్లుగా అత్యంత ప్రజాస్వామికంగా, పారదర్శకంగా పరిపాలన చేసుకోవడం వల్ల ఆశించిన ఫలితాలొచ్చాయి. ప్రజాస్వామిక ప్రపంచం ముందు ఆ గ్రామం మకుటాయమానమై నిలిచింది. గంగదేవిపల్లి నుండి అందరూ నేర్చుకోవలసిన మొదటిపాఠం ప్రజాస్వామికంగా ఎదగడం. రెండోపాఠం లంచగొండితనానికి దూరంగా ప్రతి పనీ రాజకీయాల కోసం కాక ప్రజల కోసమే చేయటం. ప్రజలు గొప్పవారని, సంఘం గొప్పదని, సంఘటిత శక్తి గొప్పదని వారు నిరూపించారు.

ప్రధానంగా గంగదేవిపల్లి ప్రజలందరూ పాలనలో భాగస్వాము లయ్యారు. అక్కడ పెత్తనం కన్నా ప్రజల్లో బాధ్యతాభావం పెరిగింది. అందుకే ప్రతి ఒక్కరూ ఈ గ్రామం సమస్యలు మావి అని భావించారు. ప్రజల జీవన ప్రమాణాన్ని బలహీన పరిచే మద్యపానాన్ని పూర్తిగా నిషేధించటం ఈ గ్రామం తొలి విజయం. సహకార జీవనశైలిని పెంపొందించి పెట్టుబడిదారీ సమాజం బోధిస్తున్న పోటీతత్వం లేకుండా ఉమ్మడిగా వారు ఈ విజయాన్ని సొంతం చేసుకోగలిగారు. మొత్తం 23 కమిటీల ద్వారా అక్కడ పరిపాలన కొనసాగుతున్నది.

ప్రజలు వందశాతం పన్నులు చెల్లిస్తున్నారు. ఈ ఉమ్మడితత్వమే ప్రజల జీవన ప్రమాణం పెంపొందేలా జాగ్రత్తలు తీసుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆ గ్రామాన్ని నమూనాగా తీసుకోవడం హర్షణీయం. 13 ఏండ్లుగా ఈ గ్రామం నుండి ఒక్క నేరపూరిత కేసూ నమోదు కాలేదంటే మద్యపానం లేకుంటే గ్రామాలు ఎంతో సజీవంగా, ప్రశాంతంగా ఉంటాయో, ఈ గ్రామం ద్వారా అర్థం చేసుకోవాలి. గంగదేవిపల్లి ఉమ్మడి కృషి, ఉమ్మడి ఆలోచనల నుండి అభివృద్ధి చెందింది. గ్రామజ్యోతి కార్యాచరణ కమిటీలు గంగదేవిపల్లి కమిటీల ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నవి.

## అంకాపూర్

ఏడు వేల జనాభా కలిగిన అంకాపూర్‌లో ప్రతి రైతు ఓ వ్యవసాయ శాస్త్రవేత్త. ఇరిగేషన్ ఇంజనీరు, మార్కెట్టు విశ్లేషకుడు, విత్తనోత్పత్తిలో దేశంలోనే మొదటిస్థానంలో ఉన్న పంజాబ్ రాష్ట్ర రైతులు సైతం ఇక్కడికి వచ్చి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారంటే అంకాపూర్ గొప్పదనం అర్థం చేసుకోవచ్చు. కష్టించి పనిచేయడం, పరస్పర సహకారం, సమిష్టికృషి, ఐకమత్యం వీరి విజయ రహస్యం. వీరిని అదర్శంగా తీసుకుని ప్రతి గ్రామం అభివృద్ధి చెందటానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి.

## ముల్కనూరు

సహకార వ్యవస్థలో ఆదర్శంగా నిలిచిన ముల్కనూరు అప్పులు, అధిక వడ్డీ రేట్లు, నీటి పారుదల సౌకర్యము లేకపోవడం, పూర్తిగా వర్షాధారిత వ్యవసాయం అధిక వ్యయ ప్రయాసలతో పండించిన పంటలకు గిట్టుబాటు లేని సందర్భాలలో ఆ పరిస్థితుల ను అధిగమించడానికి సహకార సంఘం 1956 సంవత్సరంలో స్థాపించుకోవడం జరిగింది. ఈ సహకార సంఘం ద్వారా సభ్యులకు సకాలంలో తక్కువ వడ్డీరేట్లపై ఋణం, ఎరువులు, క్రిమి సంహారక మందులు, వ్యవసాయ పనిముట్లు, అధిక దిగుబడి నిచ్చే పంట విత్తనాలు సరఫరా చేయడంతో పాటు సభ్యుల నుండి వ్యవసాయ ఉత్పత్తులను ఖరీదు చేస్తుంది.

ఈ విధంగా ములకనూరు సహకార సంఘం, పంట రుణాలు, మధ్యకాలిక అప్పులు, దీర్ఘకాలిక అప్పులు ఇవ్వడంతో పాటు ఉత్పాదన సేవలు, వ్యవసాయ విస్తరణ సేవలు, మార్కెటింగ్ సేవలు, సంక్షేమ సేవలు, భీమా సేవలు మరియు వినిమయ సేవలతో దేశంలోనే ఈ సహకార సంఘము ఆదర్శంగా, విజయవంతంగా, రైతుల భాగస్వామ్యంతో నడుస్తుంది.

గ్రామజ్యోతితో గ్రామ పంచాయతీలను క్రియాశీలం చేసి, ప్రజలకు జవాబుదారీగా మార్చబోతుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలోని సకల జనుల సమిష్టి నిర్ణయాలతో పూర్తి పారదర్శకంగా ప్రజాసమస్యలను పరిష్కరించడానికి, సంక్షేమ ఫలాలను అందించడానికి 'గ్రామజ్యోతి' వేదిక కానుంది.

విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పారిశుద్ధ్యం, సాంఘిక భద్రత, పేదరిక నిర్మూలన, మౌళిక వసతుల కల్పనలో గ్రామాల్లోని ప్రభుత్వ శాఖలన్నింటిని సమన్వయం చేసి సమగ్ర సమీకృత అభివృద్ధి సాధించా లన్నది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం. రాబోయే నాలుగేళ్లలో వివిధ శాఖల ద్వారా గ్రామాభివృద్ధికి 25 వేలకోట్ల రూపాయలను తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయబోతుంది. ప్రజలే పాలకులనే ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ సమిష్టి నిర్ణయాధికారంతో గ్రామసభలోనే అభివృద్ధి ప్రాధాన్యాలను రూపొందిస్తారు.

గ్రామజ్యోతి వేదికగా రైతుల కష్టాలు దూరం చేయబోతున్నారు. ఏ కాలానికి ఏ పంటలు వేయాలో వ్యవసాయాధికారులతో ఎప్పటికప్పుడు సూచనలు ఇప్పిస్తారు. కల్తీలేని విత్తనాలు, ఎరువులు అందించి అన్నదాత ఆగం కాకుండా చర్యలు తీసుకుంటారు. ప్రసవంతో పునర్జన్మ పొందే ఆడబిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు అయ్యేలా ఆసుపత్రులు, అంగన్‌వాడీల పనితీరును గ్రామజ్యోతితో మెరుగుపరుస్తారు. తాగునీరు, పారిశుధ్యం, వందశాతం అక్షరాస్యత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన గ్రామజ్యోతితో ప్రభుత్వం సాధించబోయే విజయాలు.

అధికార వికేంద్రీకరణ, సమిష్టి నిర్ణయాలు, పారదర్శకత, జవాబుదారీతనం, సాధికారత, ప్రోత్సాహకాలు, ప్రాధాన్యాల నిర్ణయంతో ప్రణాళికలు, ప్రజాస్వామ్య భాగస్వామ్యం, సమ్మిళిత, సమీకృత అభివృద్ధి ఇవే గ్రామజ్యోతితో ప్రజలు పొందే బహుమతులు.

దేశ అభివృద్ధి పల్లెనుంచే ప్రారంభమవ్వాలి. గ్రామస్వరాజ్యం వర్ధిల్లినప్పుడే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి వైపు పయనిస్తుంది. గ్రామం ఒక యూనిట్‌గా అభివృద్ధి నమూనాను ప్రవేశపెడితే విజయం తప్పకుండా వరిస్తుందనేది అక్షరసత్యం. తెలంగాణ ప్రభుత్వం పల్లెబాగు కోసం ప్రవేశపెట్టిన 'మిషన్ కాకతీయ', 'వాటర్‌గ్రిడ్', 'గ్రామజ్యోతి', 'గుడుంబా నియంత్రణ', 'వంద శాతం ఇంటి పన్నులు చెల్లించడం', 'కళ్యాణలక్ష్మి', 'విత్తనోత్పత్తి' వంటి కార్యక్రమాలన్నీ గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగపడేవే.

ఇవన్నీ విజయవంతం కావాలంటే ప్రతి పల్లె కదలాలి. ప్రగతిని ఆహ్వానించాలి. ఇదంతా ఒక్కరోజులో కాకపోవచ్చు. కానీ అసాధ్యమేమి కాదు. ప్రగతి బాట పయనించిన గంగదేవిపల్లె, ముల్కనూరు, అంకాపూర్ గ్రామాలే దీనికి మంచి ఉదాహరణ.

ఎక్కడ గ్రామ ప్రజలు, అభ్యుదయ భావాలతో స్థానిక వనరుల వినియోగంతో, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో, ప్రజలు పరస్పర, అవగాహన, ఐక్యత, నాయకత్వం, పారదర్శకతతో ముందుకు వచ్చి, గ్రామాల అభివృద్ధికి పాటుపడుతారో, అక్కడ సుస్థిర అభివృద్ధి సాధ్యపడుతుంది.

గ్రామాలలో అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే పాలించే పంచాయతీ ప్రభుత్వాలు పారదర్శకంగా ఉండాలి. ప్రజాస్వామ్యం అనే సౌధాపికి, స్థానిక ప్రభుత్వాలు పునాదులు. ఒక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే అందులోని వ్యక్తులు పూనుకోవాలి. అభివృద్ధి సంస్థాగతంగా జరిగితేనే సత్ఫలితాలిస్తుంది. అంటే పల్లె నుంచే ప్రగతి ప్రారంభమవ్వాలి. పల్లెలు అభివృద్ధి మెట్లెక్కితేనే రాష్ట్రమైనా, దేశమైనా పురోగమిస్తుంది. వ్యక్తులు, సమాజం సమిష్టిగా శ్రమిస్తే మనం కలలు కంటున్న 'బంగారు తెలంగాణ సాధ్యమే'.

**– కె. యాదయ్య**

*సంయుక్త సంచాలకులు (పరిపాలన), టి.సిపార్డ్*

# గ్రామజ్యోతి కార్యాచరణ కమిటీలు




**ప్రజాస్వామ్య పాలనలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం. ప్రజల భాగస్వామ్యం లేకపోతే ఆ పరిపాలన ప్రజాస్వామ్యం అనిపించుకోదు. అది ఏకస్వామ్య పాలన లేదా రాజరికపు పాలన అని అంటారు. భారత రాజ్యాంగం తయారు చేసే సమయంలోనే ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలు ఏర్పరుచుకున్న ప్రజా ప్రభుత్వం అని చెప్పబడింది. అందుకొరకు స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీల పరిపాలనలో ప్రజలు ఎంత ఎక్కువ సంఖ్యలో పాలుపంచుకుంటే అంత మంచి ఫలితాలు వస్తాయి.**

దీనికి ఉదాహరణగా మన రాష్ట్రంలో గల వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగిదేవిపల్లి, నిజామాబాదు జిల్లాలోని అంకాపూర్ గ్రామాలలో జరిగిన అభివృద్ధి పరిపాలనలో ప్రజల భాగస్వామ్యానికి ప్రత్యక్ష నిదర్శనం. 'ప్రభుత్వం మాది' అని ప్రజలు అనుకున్నపుడు పరిపాలన భాగస్వామ్య పద్ధతిలో జరుగుతుంది. అంటే ప్రజా పరిపాలనకు అవసరమైన ప్రణాళిక తయారీలో గానీ, దానిని ఆమోదించి మరియు అమలు చేయడంలో గాని ఆ తరువాత దానిని మూల్యాంకనం చేయడంలో గాని ప్రజల భాగస్వామ్యం విరివిగా ఉంటే సత్ఫలితాలు వస్తాయని మనకు తెలుసు.

ప్రణాళికలు మరియు ఆర్థిక విధానాలు ప్రజల పూర్తి భాగస్వామ్యంతో తయారు కాబడి వారి నిర్ణయాలను గ్రామ, మండల, జిల్లా ప్రణాళికలో అంతర్భాగం చేసినప్పుడే, దేశ, రాష్ట్ర ఆర్థిక విధానాలు ప్రజల నిర్ణయాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ విధంగా చేయనట్లైతే సమాజంలో ఏదో ఒక వర్గానికి మాత్రమే లబ్ది చేకూరుతుంది. ఇంతవరకు రాజకీయ ప్రాబల్యం ఉన్నవారికే అన్నిట్లో లబ్ధి చేకూరింది. ఆ విధానం మార్చాలని అందరూ కోరుకున్నారు. కాబట్టి ప్రణాళిక రూపకల్పనలో అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా మారింది.

ప్రణాళికలలో తమ పాత్రపై ప్రజలు ఏమని భావిస్తున్నారనేది అత్యంత మౌలిక సమస్య. ప్రజలు ఏం మాట్లాడకుండా, క్రియా రహితంగా, ప్రభుత్వ యంత్రాంగం ఇచ్చిన పథకాలను అందుకునే 'లబ్ధిదారులు' అనే సాధారణ అభిప్రాయాన్ని మార్చి, తమకు కావలసిన పథకాలను నిర్ణయించుకొని అవి తాము పొందుట 'తమ హక్కు'గా, తమ సమస్యలకు పరిష్కారాలను సూచించి వాటిని 'డిమాండ్' చేసే వ్యక్తులుగా వారిలో చైతన్యాన్ని పెంపొందించడం చాలా అవసరం. ప్రజల ఆలోచనా దృక్పథంలో ఇలాంటి మార్పు వస్తే వారు గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీలో తామూ భాగస్వాములనే చొరవతో ముందుకు వచ్చి బాధ్యతలు స్వీకరిస్తారు.

స్త్రీ, పురుష వయోభేదాలు, ఆర్థిక, సామాజిక స్థితిగతులతో నిమిత్తం లేకుండా మొత్తం పల్లె ప్రజలందరూ ముఖ్యంగా బలహీనవర్గాల వారు పాల్గొని, వారి అభిప్రాయాలు వెల్లడించి, పరిష్కారాలను సూచించే విధంగా ప్రణాళికా కసరత్తు సాగాలి. స్థానిక ప్రణాళికల నిర్వహణ, యాజమాన్యం తమదేనన్న భావన ప్రజలలో బలంగా ఏర్పడినపుడు వాటి అమలులో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

ప్రణాళికలో అప్పటివరకు అమలు చేస్తున్న కేంద్రీకృత వైఖరిని పూర్తిగా మార్చి వేయడానికి, పరిపాలనలో, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వాలు 1993వ సంవత్సరంలో 73 మరియు 74 రాజ్యాంగ సవరణలకు శ్రీకారం చుట్టాయి. ఈ సవరణల ద్వారా నిధులు, విధులు, అధికారాలను బదలాయించడంతో పాటు ప్రజలు అధికంగా పాల్గొనే విధంగా గ్రామసభకు మరిన్ని అధికారాలను ఇవ్వడంతో పాటు గ్రామ అవసరాలు, ప్రజల సమస్యలు, గ్రామాభివృద్ధికి అవసరమైన భాగస్వామ్య సమీకృత ప్రణాళికలు అన్ని నిర్ణయాలు గ్రామసభలోనే తీసుకోవాలని నొక్కి చెప్పటం జరిగింది.

ఇందులో భాగంగా మన రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పటిష్టమైన కమిటీలను ఏర్పరచి అభివృద్ధి ప్రణాళికా రచనకు పునాదులు వేయడం జరిగింది. ఇందుకు సంబంధించిన అధికారాలను కూడా బదలాయించడం జరిగింది. అంతేగాక సమాచార, కమ్యూనికేషన్ సాంకేతిక నైపుణ్యంలో వచ్చిన వినూత్న మార్పులు మనం దీర్ఘకాలంగా నిర్దేశించుకుంటున్న ప్రజా భాగస్వామ్యంతో ప్రణాళికలు అనే లక్ష్యాన్ని దేశ వ్యాప్తంగా, సమర్ధవంతంగా అమలు చేయడానికి వీలు కల్పించాయి. అందులో అత్యంత ముఖ్యమైన భాగమే గ్రామపంచాయతీ స్థాయిలో ప్రణాళికలు తయారు చేయడం.

గ్రామపంచాయతీలకు సాధికారతను కల్పించే దిశగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం 'గ్రామజ్యోతి' కార్యక్రమాన్ని ప్రకటించింది. స్వయం సహాయక సంఘాల, శ్రమశక్తి సంఘాల, యువజన సంఘాల, సామాజిక సంఘాల, స్వచ్ఛంద సేవా సంస్థల, విశ్రాంత ఉద్యోగుల, వివిధ రంగాలలో అపార అనుభవంగల వ్యక్తుల రూపంలో చాలా విలువైన మానవవనరులు ప్రతి గ్రామపంచాయతీలో మనకు లభ్యమవుతాయి. స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీలు అభివృద్ధి బాటలో పయనించాలంటే అలాంటి మానవవనరుల సేవలను ఆహ్వానించడం తప్పని సరి.

స్థానిక ప్రభుత్వాలకు తోడుగా పరిపాలనలో పాలుపంచుకోవటానికి, ప్రజలు ఎక్కువ సంఖ్యలో భాగస్వాములు కావడానికి కార్యాచరణ కమిటీలు కూడా ఏర్పాటు చేయాలని తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 1994 లోని సెక్షను 40 అవకాశం కల్పించింది. అందుకే తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఇంతకు ముందు అమలులో ఉన్న కార్యాచరణ కమిటీల ఉత్తర్వుల ను ఏ ఒక్క పంచాయతీలో కూడా అమలు చేయడంలేదు అని గ్రహించి ప్రజలు ఎక్కువ సంఖ్యలో గ్రామ స్వరాజ్య పాలనలో పాలుపంచుకొనటానికి వీలుగా నూతనంగా ఏడు కార్యాచరణ కమిటీల ను ప్రతి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయాలని జి.వో.నెం. 63 పంచాయతీరాజ్ శాఖ తేది 14-08-2015 ద్వారా ఆదేశాలు జారీ చేశారు. అవి:

* పారిశుద్ధ్యం మరియు త్రాగు నీరు
* ఆరోగ్యం మరియు పోషకాహారం
* విద్య
* సాంఘిక భద్రత మరియు పేదరికాన్ని తగ్గించడం
* సహజ వనరుల యజమాన్యం
* వ్యవసాయం
* మౌళిక వసతుల కల్పన

పైన చెప్పబడిన కార్యాచరణ కమిటీలు దిగువ పేర్కొన్న వారితో కూడి ఉంటుంది.

- కార్యాచరణ కమిటీ అధ్యక్షులు (సర్పంచ్ లేక ఉప సర్పంచ్ లేక ఎస్.సి. ఎస్.టి మహిళా సభ్యురాలు)
- గ్రామపంచాయతీ వార్డు సభ్యులలో ఒకరు లేక ఇద్దరు వార్డుల సంఖ్యను అనుసరించి సభ్యులుగా ఉంటారు.
- స్వయం సహాయక సంఘాల నాయకులు సభ్యులుగా ఉంటారు.
- సామాజిక కుల సంఘాల లేక స్వచ్ఛంద సేవా సంఘం ప్రతినిధి సభ్యులుగా ఉంటారు.
- కమిటీకి అప్పగించిన శాఖలలో అనుభవం ఉన్న విశ్రాంత ఉద్యోగి సభ్యులుగా ఉంటారు.





❑ గ్రామపంచాయతీ లేక మండల స్థాయి శాఖల బాధ్యులు కార్యాచరణ కమిటీ సభ్య సమావేశకర్తగా అనగా మెంబరు కన్వీనరుగా ఉంటారు.

పైన సూచించిన సభ్యుల నియామకాలను ప్రాధాన్యతలను బట్టి మార్చటానికి ప్రభుత్వానికి అధికారం కలదు. ప్రభుత్వ అధికారుల ను వారి ఉద్యోగం పేరున తీసుకోవాలిగాని వారి సొంత పేరున నమోదు చేయకూడదు. కార్యాచరణ కమిటీల సభ్యుల పదవీ కాలం గ్రామపంచాయతీ సభ్యులు కానివారు కూడా గ్రామపంచాయతీ సభ్యుల పదవీ కాలంతో పాటు కొనసాగుతారు. అనగా గ్రామపంచాయతీ సభ్యుల పదవీ కాలం ముగిసినచో సదరు సభ్యులతో పాటు, కార్యాచరణ కమిటీలో ఇతర సభ్యుల పదవీ కాలం కూడా ముగిసిపోతుంది.

ప్రతి కార్యాచరణ కమిటీ తమకు కేటాయించిన రంగాల (శాఖ)కు సంబంధించిన పథకాలను లేక పనులను సమర్ధవంతంగా అమలు చేయటానికి కావలసిన ప్రణాళిక తయారు చేయాలి. ప్రతి కార్యాచరణ కమిటీ నిర్ణీత కాలవ్యవధిలో ఎలాంటి అభివృద్ధి ఫలాలు రావాలి అని భావిస్తున్నారో వాటి నిర్దేశాలను స్పష్టంగా నిర్ణయించుకోవాలి.

కార్యాచరణ కమిటీలు అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసి కార్యక్రమంలో ఈ క్రింది పద్ధతులను పాటించాలి.

- ✲ తమ కార్యాచరణ కమిటీకి సంబంధించిన గణాంకాలను, పూర్తి వివరాలను వివిధ రీతులలో తీసుకొనుటయే గాక, సంబంధిత కార్యక్రమాలను అమలు చేసే ప్రభుత్వ శాఖల అధికారుల నుండి కూడా కావలసిన సమాచార వివరాలను సేకరించాలి.
- ✲ ఆ శాఖలో అందించే సేవలను ప్రస్తుతం ఉన్న సేవల పరిస్థితులను సమీక్షించాలి.
- ✲ కమిటీ సభ్యులంతా కలసి గ్రామంలో తిరగడం ద్వారా పూర్తిగా గ్రామాన్ని పరిశీలించాలి.
- ✲ గ్రామంలో ఉన్న పరిస్థితులను విశ్లేషించాలి.
- ✲ సమస్యలకు కారణాలు తెలుసుకోవాలి.
- ✲ సమస్యలకు పరిష్కార మార్గాలను గుర్తించాలి.
- ✲ సమస్యల పరిష్కార దిశగా ప్రణాళిక కసరత్తు సాగాలి.
- ✲ నిర్ణయాలను తీసుకోవడంలో భాగస్వామ్య పద్ధతులను పాటించాలి. అంటే వీలైనంత ఎక్కువ మందిని సంప్రదించాలి.
- ✲ సమాజంలోని ప్రజల అవసరాలను అంచనా (మదింపు) వేయాలి.
- ✲ అన్నిరకాల వనరుల లభ్యతను కూడా లెక్కలు వేయాలి.
- ✲ తమ కమిటీకి సంబంధించిన శాఖ లేక రంగం కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి దానికి కావలసిన వనరులను కేటాయించాలి. ఆ కమిటీ అందించబోయే ఫలితాలను కూడా గ్రామసభలో చర్చించి ఆమోదించాలి.
- ✲ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారుచేయటంలో ప్రతి కార్యాచరణ కమిటీల విధులు, బాధ్యతలు ఈ విధంగా ఉన్నాయి.
- ✲ తమ కార్యాచరణ కమిటీ ద్వారా ప్రణాళికలో చేర్చబడిన పథకాన్ని గాని, పనులను గాని అమలు జరిగే సమయంలో వాటిని పర్యవేక్షించాలి.
- ✲ పథకం అమలు జరిగే సమయంలో వచ్చే ఆటంకాలను ముందుగానే ఊహించి వాటిని రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆటంకాలు ఎదురైనప్పుడు వాటిని ప్రజలతో చర్చించి తగిన పరిష్కార మార్గాన్ని కనుక్కోవాలి.

– ***శంకరయ్య***, సిడిపిఓ, టి.సిపార్డ్




# గ్రామ పారిశుద్ధ్యం మరియు త్రాగునీరు కమిటి

**రాజ్యాంగబద్ధంగా గ్రామపంచాయితీలకు సంక్రమించిన అతి కీలకమైన బాధ్యతలలో త్రాగునీరు, పారిశుద్ధ్య వ్యవస్థల సక్రమ నిర్వహణ ఒకటి. ఇటీవల గ్రామాల సర్వతోముఖాభివృద్ధి కోసం, తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామజ్యోతి కార్యక్రమం క్రింద తయారు చేసే గ్రామాభివృద్ధి ప్రణాళికలో ప్రాధాన్యతనివ్వవలసిన 8 రంగాలలో ఈ రెండు అతి ముఖ్యమైనవి. త్రాగునీరు, పారిశుద్ధ్య రంగంలో గ్రామపంచాయితీలు తమ బాధ్యతల సక్రమ నిర్వహణకు వెసులుబాటు కల్పించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి తప్పనిసరిగా సర్పంచ్ అధ్యక్షతన గ్రామ నీరు, పారిశుద్ధ్య కమిటీలను ఏర్పరుచుకోవాలి (జి.ఓ.ఎం.ఎస్. 64, తేదీ 14-8-2015).**

గ్రామ త్రాగునీరు, పారిశుద్ధ్య కమిటీ ముఖ్యమైన బాధ్యతలు ఇలా ఉంటాయి. ఈ బాధ్యతల నిర్వహణ కోసం తమ పంచాయితీకి సంబంధించిన గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్యం ఇంజనీర్ల సహాయ సహకారాలను వాడుకోవాలి.

**పారిశుద్ధ్యం మరియు త్రాగునీరు కమిటి క్రింది వారితో కూడి ఉంటుంది**

- సర్పంచుగారు ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉంటారు.
- ఒకరు లేక ఇద్దరు లేక ముగ్గురు పంచాయతీ వార్డు (సభ్యుల సంఖ్యను బట్టి) సభ్యులుగా ఉంటారు.
- స్వయం సహాయక సంఘాల నాయకులలో ఒకరు సభ్యులు
- స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధి ఒకరు సభ్యులుగా ఉంటారు.
- గ్రామంలోని ఒక విశ్రాంత అధికారి ఒకరు సభ్యులుగా ఉంటారు.
- పంచాయతీ స్థాయి లేక మండలస్థాయి అధికారి కన్వీనర్‌గా వ్యవహరించాలి..

## త్రాగునీరు

- గ్రామ త్రాగునీటి ప్రణాళికను తయారు చేయటం (దీని కోసం ముందుగా ప్రస్తుత త్రాగునీటి లభ్యతా వివరాలు, గ్రామానికి కావలసిన పరిమాణంలో త్రాగునీటి అవసరాలను, నీటి బడ్జెట్ సర్వే, గ్రామ నడకల ద్వారా బేరీజు వేయటం, పరిస్థితికి అనువైన

| క్రమ సంఖ్య | కార్యక్రమం | ఆశించు ఫలితం లేక పరిణామం |
| --- | --- | --- |
| 1 | బహిరంగ మల విసర్జన నిర్మూలణ కార్యక్రమ ప్రణాళిక – మరుగు దొడ్లు లేని కుటుంబాలను సర్వే చేసి గుర్తించాలి | ప్రతి ఇంటికి మరుగు దొడ్డి కలిగి ఉండుట వలన ఆరోగ్య పరిరక్షణ గ్రామము గా తయారు అవుతుంది. |
| 2 | ఘన మరియు ద్రవ వ్యర్థాల యాజమాన్యము – చెత్త వేయు ప్రదేశాన్ని గుర్తించాలి, సామాజిక విరాలాల ద్వారా చెత్తను తరలించే పనిని చేపట్టాలి. | చెత్త చెదారం లేని గ్రామంగా మారుతుంది. పరిసరాలు పరిశుభ్రంగా మారతాయి. |
| 3 | దోమల నియంత్రణ– నీరు నిలువ ఉన్న ప్రదేశాలను మరియు మురుగు కాలువలను గుర్తించాలి. | మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధులు అరికట్టగలగుట |
| 4 | రోగాలు రాకుండా ముందస్తు చర్యగా త్రాగునీటి సరఫరా వనరులను శుభ్రం చేయుట మరియు బ్లీచింగు పౌడరు కలుపుట | కలరా, వాంతులు, విరేచనాలు, పచ్చకామెర్లు రాకుండా చూడగలుగుట. |
| 5 | ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా త్రాగు నీరు సరఫరాను మరియు నీటి చార్జీలు వసూలు చేయటానికి సహకరించుట | ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా నీటి సరఫరాను అందించుట. కోరినప్పుడు కూడా నీటి సరఫరా. నీటి కోసం దూర ప్రయాణాలను తగ్గించగలుగుట |
| 6 | కుళాయి వద్ద మరియు పైపులలో లీకేజీలను అరికట్టుట | అమూల్యమైన నీటిని ఆదా చేయుట |

తరుణోపాయాలను ఆర్.డబ్ల్యు.ఎస్. ఇంజనీర్ల సహకారంతో (గ్రామ సభలో చర్చించటం జరగాలి).



- పూర్తికాని సురక్షిత నీటి సరఫరా పథకాలను ఆర్.డబ్ల్యు.ఎస్. ఇంజనీర్లను సంప్రదించి పూర్తయేటట్లు చూడటం.
- పూర్తయిన సింగిల్ విలేజ్ పథకాలను సంయుక్త తనిఖీ తర్వాత స్వాధీన పరచుకొని వాటి నిర్వహణకు ఉపక్రమించటం.
- తమ స్వాధీనంలోకి వచ్చిన త్రాగునీటి సరఫరా వ్యవస్థల వాడకం, నిర్వహణలకు (ఓ ఎమ్) ఆర్.డబ్ల్యు.ఎస్. ఇంజనీర్ల సలహా మేరకు ప్రణాళికను తయారు చేయాలి.
  * త్రాగునీటి పథకం సక్రమ నిర్వహణ కోసం అవసరమైన మేరకు శిక్షితులైన పంప్ ఆపరేటర్ ఇత్యాది సిబ్బందిని నియమించుకోవటం లేదా ఈ పనులను కాంట్రాక్ట్ ద్వారా బయటి వారికి అప్పగించడం
  * త్రాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వహణ పనులను పర్యవేక్షించడం

– అవసరమైనప్పుడు తగిన దిద్దుబాటు చర్యలు జరిగేటట్లు చూడటం

* త్రాగునీటి నాణ్యతపై నిరంతర నిఘా ఉంచటం (శానిటరీ సర్వేను జరపటం, ఫీల్డ్ టెస్టింగ్ కిట్లను వాడటం, నీటి నాణ్యతా పరీక్షా కేంద్రాలతో సమన్వయం/ సంప్రదింపులు తగు మోతాదులో రోజువారీ క్లోరినేషన్ మొదలైన అంశాలపై నిఘా).

* నిర్వహణకు కావలసిన తరచూ అవసరమయ్యే వస్తులను కనీస పరిమాణంలో స్టాకు ఉంచటం (నట్లు, బోల్టులు, వాషర్లు, కప్లర్లు బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ క్లోరిన్, ఎలక్ట్రికల్ సామాగ్రి ఇత్యాదులు.

* ఓ ఎమ్ బడ్జెటును తయారు చేయటం (వివిధ వర్గాల వారు చెల్లించాల్సిన నీటి చార్జీల రేట్లను నిర్ణయించటం, వినియోగదార్ల నుండి గ్రహించే డిపాజిట్లను నిర్ణయించటంలతో సహా)

* త్రాగు నీటి సరఫరా వ్యవస్థ ఆర్థికస్థితిపై సమీక్ష పర్యవేక్షణ (నీటి చార్జీల వసూలుకు అనువైన పద్ధతులను నిర్ణయించటం, నెలవారీ వసూళ్ళ సామర్థ్యాన్ని పరిశీలించడం, బకాయిలపై నిఘా వగైరా.

* త్రాగునీటి వృధాను అరికట్టే చర్యలు (పబ్లిక్ కుళాయిల వద్ద లీకేజిలు, పైపు లీకేజీలుపై నిఘా ఉంచి తక్షణ దిద్దుబాటు చర్యలు తీసుకోవటం, ప్రజలలో కూడా నీటి వృధాపై అవగాహన పెంపొందించటం)

* త్రాగునీరు కలుషితం కాకుండా నిరంతర నిఘా (శానిటరీ సర్వే జరపటం దాని ఫలితాలను గురించి దిద్దుబాటు చర్యలు చేపట్టటం, త్రాగునీటి పైపులైన్ల వద్ద కలుషిత వాతావరణం లేకుండా చూడటం పబ్లిక్ కొళాయిలు, హ్యాండ్ పంపుల వద్ద ప్లాట్‌ఫారములు అమర్చడం, ప్రజలలో త్రాగునీరు కలుషితమయ్యే విధాలపై అవగాహన పెంపొందించటం (గృహాల్లో సక్రమ పద్ధతులలో త్రాగునీటి నిల్వ, వాడకంతో సహా).

* జల సంరక్షణా పద్ధతులపై గ్రామస్తులలో అవగాహన పెంచి వాటర్ హార్వెస్టింగు వ్యవస్థలు పెరిగేటట్లు ప్రోత్సహించటం.

## పారిశుద్ధ్యం

గ్రామ పారిశుద్ధ్యం విషయంలో గ్రామ నీటి పారిశుద్ధ్య కమిటీ ముఖ్యంగా ఈ క్రింది బాధ్యతలు నిర్వర్తించాలి.

**బహిరంగ మల విసర్జన నిర్మూలన:**

సాధారణంగా మన గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదల కార్యక్రమాల్లో అత్యధిక ప్రాధాన్యత సంతరించుకోవలసిన అంశమిది. ఎందుకంటే గ్రామీణ ప్రజల ఆరోగ్యం, పరోక్షంగా వారి జీవనోపాధి, స్త్రీలు, బాలికల మర్యాద, రక్షణలతో ముడివడిన అంశం. కనుక కమిటీ వారు ఈ క్రింది విధంగా కార్యాచరణకు ఉపక్రమించాలి.

దీనికి ఒక పద్ధతి ప్రకారం ప్రణాళికను తయారు చేసుకోవాలి. మొదటగా బహిరంగ మల విసర్జన నిర్మూలన నిర్వచనాన్ని బట్టి పోవాలి.

“బహిరంగ మల విసర్జన నిర్మూలన అంటే మలంలోని క్రిములు మానవ శరీర వ్యవస్థలోనికి చేరుకునే మార్గం లేకుండా చేయటమే. దీని రుజువులు గ్రామ పరిధిలో ఎక్కడా మలం కనబడకుండా ఉండి ప్రతి ఒక్కరూ మల విసర్జనకు క్షేమదాయక సాంకేతిక పద్ధతులను వాడటమే”.

క్షేమదాయక సాంకేతిక పద్ధతిలో కట్టిన మరుగుదొడ్లలో, భూమిగాని భూగర్భజలాలుగాని, ఉపరితల జలాలుగాని కలుషితం కాకుండా ఉండాలి. ఈగలు, జంతువులకు మలం అందుబాటులో లేకుండా ఉండాలి. మలం తొలగింపులో ప్రత్యక్ష మానవ ప్రయత్నం ఉండకూడదు. అసహ్యకరమైన పరిస్థితి, దుర్వాసన ఉండకూడదు.

### ఈ ప్రణాళికలోని దశలు

- గ్రామంలోని సమస్య తీవ్రతను బేరీజు వేయటం (సర్వే, సమాచార సేకరణ, గ్రామనడకల ద్వారా)
- మార్గాంతరాలను గుర్తించటం (అవసరమైన కొత్త మరుగుదొడ్ల సంఖ్య, బిపిఎల్/ ఎపిఎల్ వివరాలు వాడకంలోకి తేవల సిన మరుగుదొడ్ల సంఖ్య, సామూహిక మరుగుదొడ్లు, ప్రజల అవగాహన పెంపొందేందుకు దృక్పథాలను మార్చేందుకు అవసరమైన చర్యలు, ప్రజా భాగస్వామ్యంతో సాంఘిక ఒత్తిడిని కలిగించటం వగైరా)
- ఆర్థిక వెసులుబాటును కలిగించటం ప్రభుత్వ పథకాల క్రింద లభ్యమయ్యే ప్రోత్సాహకాలను గురించి అవగాహన కలిగించటం, వివిధ పథకాలను సమన్వయం చేయటం
- **అమలు, పర్యవేక్షణ:** మరుగుదొడ్ల నిర్మాణం పూర్తమయ్యేలా చూడటం, మరుగుదొడ్ల వాడకంపై నిఘా, పరిస్థితిని తరచూ మదింపు చేయటం.
- బహిరంగ మల విసర్జన ద్వారా కలిగే చెడు ఫలితాలను గురించి గ్రామస్తులలో వివిధ పద్ధతుల ద్వారా అవగాహన పెంచాలి, గ్రామసభలలో, వార్డు స్థాయి సమావేశాలలో, గ్రామసంఘాల సమావేశాలలో, వీధి సమావేశాలలో, అందుబాటులో ఉన్న ప్రసార సాధనాలైన పోస్టర్స్, ఫిల్మ్‌లు, పాంప్లెట్స్, దప్పువేయడం, స్థానిక కేబుల్ టీ.వి, మైక్‌లతో ప్రచారం చేయడం ద్వారా, అవగాహన పెంచాలి.

- మొదటి ప్రాధాన్యతగా, మరుగుదొడ్లు లేని కుటుంబాలకు మరుగుదొడ్డి నిర్మాణం కొరకు స్వచ్ఛ భారత్ మిషన్ నుండి లభించే ఆర్థిక సహాయం గురించి వివరించాలి. అందుబాటులో ఉన్న తేలికపాటి సాంకేతిక పద్ధతులను గురించి వివరించాలి.
- మరుగుదొడ్ల వాడకానికై చిన్నపాటి మరమ్మత్తులు అవసరమైన కుటుంబాల వారికి సులువైన సాంకేతిక పద్ధతులు మరియు మరుదొడ్డి లోపాన్ని సరిచేయడానికి కావలసిన మార్గదర్శకాలను అందించడం ద్వారా వారి మరుగుదోడ్డి అందుబాటులోనికి తెప్పించాలి.
- కొంత వరకు మరుగుదొడ్డి సౌకర్యం ఉపయోగించుకొనే వారిని మరియు మరుగుదొడ్డి సౌకర్యం పూర్తిగా వాడని వారిని మరుగుదొడ్డి వాడేలా ప్రోత్సహించాలి.
- ఏ కుటుంబం అయితే తమ వ్యక్తిగత మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో వాడుతున్నారో మరియు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తున్నారో వారిని గుర్తించి, అభినందించాలి
- అలాగే, కొత్తగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొన్న వారిని మరియు ఉపయోగంలేని మరుగుదొడ్లను వాడంకంలోకి తెచ్చి వాడుతున్న కుటుంబాలను ఇతరులకు ఉదాహరణలుగా చూపాలి.
- గ్రామ ప్రజల పారిశుద్ధ్య అలవాట్లలో మార్పు తీసుకొచ్చేంత వరకు వారితో పాటు పడాలి.
- బహిరంగ మల విసర్జన నిర్మూలించడం పైన ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి
- బహిరంగ మల విసర్జన సత్వర నివారణ కొరకు గ్రామ ప్రజలందరినీ సమీకరించి సమిష్టిగా కృషి చేసే విధంగా వారిని సన్నద్ధం చేయాలి.
- పంచాయతీ స్థాయి అధికారుల సహకారం పొందాలి.

**ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ:**

సర్వే, గ్రామనడక, సమాచార సేకరణల ఆధారణంగా గ్రామసభలో చర్చించిన పిదప తమ గ్రామానికి అనువైన సాంకేతిక పద్ధతులతో కూడిన వ్యర్థ పదార్థాల నిర్వహణా వ్యవస్థను నిర్ణయించాలి.

ఈ సర్వేలో ప్రధానంగా క్రింది అంశాలను పరిగణలోనికి తీసుకోవాలి.

- గ్రామ జనాభా, కుటుంబాల సంఖ్య, గ్రామ పటం, షాపులు/ పెళ్ళి ఫంక్షన్ హాళ్ళు/ బజార్లు/ ఇళ్ళు/ పశువుల కొట్టాలు/ పాకలు/ సంస్థలు మరియు ఇతరముల వివరాలతో ఎంత వ్యర్థం (ఘన, ద్రవ) వస్తుంది, ప్రస్తుతం వ్యర్థ పదార్థాలను ఎలా నిర్వహిస్తున్నారు.
- దంపుయార్డు మరియు కంపోస్టు గుంతల కొరకు గ్రామపంచాయితీ పరిధిలో ఖాళీ స్థలాల లభ్యత వివరాలు
- ఎన్‌జిఓలు, గ్రామ సంఘాలు మరియు ఎస్‌హెచ్‌జి సంఘాలు వివరాలు, వారి సేవలను ఉపయోగించుకొవచ్చు.

**గ్రామస్థాయిలో ఘన వ్యర్థాల నిర్వహణలో దశలు**

| | | |
|---|---|---|
| కుళ్ళే మరియు కుళ్ళని వ్యర్థాలను ఇంటి వద్దనే వేరు చేయడం | ఇంటింటి చెత్త కుటుంబాల డబ్బాలలో చెత్త జమ చేయడం | దంపు యార్డుకు తరలించడం |
| ఎంచుకున్న సాంకేతిక పద్ధతి ద్వారా నిర్వహణ | | |

గ్రామ పంచాయితీలు ఎమ్‌జిఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం క్రింద లేదా స్వచ్ఛ భారత్ మిషన్ పథకం క్రింద వ్యర్థ పదార్థాల నిర్వహణకు నిధులు సమకూర్చుకోనే అవకాశం ఉంది.

ఈ విషయంలో ప్రజలలో నిర్వహించే అవగాహనా కార్యక్రమాలలో నీరు, పారిశుద్ధ్య కమిటీ వారు ఈ క్రింది అంశాలను నొక్కి వక్కాణించాలి.

- సాధ్యమైనంత వరకు తమ అవసరాలను తగ్గించుకొని అవసరాల మేరకే వస్తువులను కొనటం/ వాడటం.
- వీలైనంతవరకు వస్తువులను తిరిగి ఉపయోగించడం.
- రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా అనువైన వస్తువులను తిరిగి ఉపయోగించటం.
- సాధ్యమైనంత కుళ్ళని వ్యర్థ పదార్థాలను కనిష్ట స్థాయికి తగ్గించటం ఈనాటి పర్యావరణ పరిస్థితిలో ఇది చాలా అవసరం.
- ఎక్కడంటే అక్కడ చెత్తను, చెత్త పదార్థాలను పారవేయకుండా ఉండటం
- తడిచెత్త, పొడిచెత్తలను విడదీయటం గురించి అవగాహన

ఘన, వ్యర్థ పదార్థాలను వాటి స్వభావాన్ని బట్టి కుళ్ళే మరియు కుళ్ళని వ్యర్థ పదార్థాలుగా విభజించవచ్చు.

వ్యర్థ పదార్థాల నిర్వహణకు తగిన సాంకేతిక పద్ధతులను ఎంచుకోనేటప్పుడు గ్రామ పంచాయితీ కమిటీ క్రింది అంశాలను పరిగణలోనికి తీసుకోవాలి.

- ❖ గ్రామపంచాయితీలో ప్రస్తుతం ఏ రకమైన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి?
- ❖ ఎంత పరిమాణంలో ఉత్పత్తి అవుతుంది.
- ❖ సాంకేతిక పద్ధతి అనుకూలం?
- ❖ ఖర్చు ఎంత అవుతుంది? ఏ మేరకు ప్రజల నుంచి ఛార్జీలు వసూలు చేయవచ్చు?
- ❖ కావలసిన నైపుణ్యం కలిగిన సిబ్బంది, భూమి లభ్యత మరియు అమలు మరియు నిర్వహణ అవసరాలు మొదలైనవి వంటి అంశాలను పరిగణలోనికి తీసుకోవాలి.

**ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ:**

1 ఇంకుడు గుంతలపై ప్రజలలో అవగాహన పెంచి ప్రతి ఇంటిలో/ సంస్థలో ఇంకుడు గుంతలు నిర్వహించుకోనేందుకు ప్రోత్సహించాలి.

2 గృహస్థాయి వ్యర్థ నీటితో తగిన స్థలమున్న ప్రతి ఇంట్లో పెరటి తోట (కిచెన్ గార్డెన్)ను ఏర్పాటు చేసికొని కూరగాయలు/ పండ్ల పెంపకాన్ని ప్రోత్సాహించాలి.

| | | | |
|---|---|---|---|
| ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు | ఇంటి నుండి గ్రే నీటిని డ్రైనేజి వ్యవస్థ ద్వారా నీటి కొలనుకు రవాణా చేయడం | గ్రే నీరు నీటి కొలనులో సహజంగా శుద్ధి చేయబడుతుంది | శుభ్రపడిన నీరును పంటలకు పారించడం |

**దోమల నివారణ:**

- ❖ దోమలు వృద్ధి చెందేందుకు అవకాశముండే నీటి నిల్వ ప్రదేశాల గురించి మురికి గుంటల గురించి, వాటిని నిలవరించాల్సిన అవసరం గురించి ప్రజలలో చైతన్యం కలిగించటం.
- ❖ పాడుబడ్డ భవనాలు, చతికిలబడ్డ భవన వ్యర్థాలు, వాడకంలో లేని పాత బావులు ఇత్యాదులను గుర్తించి నిలవరించటం.
- ❖ గంబూశియా జాతి చేపల పెంపకం.
- ❖ బేటెక్స్ లాంటి క్రిమిసంహారక రసాయనాలను వాడటం.
- ❖ ఇళ్ళలో, సంస్థలలో, పబ్లిక్ కొళాయిలు, హ్యాండ్ పంపులు, నీటి రిజర్వాయర్లు వగైరాల వద్ద సోక్‌పిట్లు నిర్మించటం.

**వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రత:**

- ❖ ప్రజలలో, పాఠశాలల్లో అంగన్‌వాడీలలో వ్యక్తిగత పరిశుభ్రతా అలవాట్ల గురించి అవగాహనను పెంపొందించటం
- ❖ సంస్థలు, వాణిజ్య కేంద్రాలు, మార్కెట్లు, సంతలు ఇత్యాది వాటిలో కూడా పరిశుభ్రత పాటించేట్లు చేయటం,
- ❖ సామూహిక పరిశుభ్రతను పెంపొందించే అవసరం దృష్ట్యా గ్రామ పంచాయితీ పరిశీలనార్థం జరిమానాల ప్రతిపాదనలు సమర్పించటం.

## గ్రామజ్యోతి కార్యక్రమంలో పారిశుద్ధ్యంపై

### సర్పంచ్ సందేశం (నమూనా)

***గ్రామసభ సభ్యులారా సోదర, సోదరీమణులారా***

***ముందుగా మీ అందరికీ నా శుభాకాంక్షలు.***

మనమందరం ఎంతో ఉత్సాహంగా స్వచ్ఛ భారత్ స్వచ్ఛ తెలంగాణా కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నాం. అందరం కలిసి మెలసి స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం.

అందుకే గ్రామజ్యోతి కార్యక్రమంలో ఒక ముఖ్య ఘట్టంగా స్వచ్ఛ తెలంగాణా కోసం కలలు కందాం. ఆ కలలను సాకారం చేసుకునేందుకు శ్రమిద్దాం.

పారిశుద్ధ్యం / పరిశుభ్రత మనకు కొత్తేమి కాదు. ప్రపంచంలో ఎక్కడా వాటి ప్రస్తావనే లేక మునుపే మన నాగరికతలో పారిశుద్ధ్యం ఒక భాగమై ఉండింది. వేల సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు మరుగుదొడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను చక్కగా నిర్వహించారు. సింధు నాగరికతలో ఈ విషయాలు రుజువయ్యాయి. మళ్లీ ఆ దిశలో ముందుకు సాగుదాం. మన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.

***మిత్రులారా!***

ఇప్పుడున్న పరిస్థితులలో మన గ్రామాలలో పారిశుద్ధ్యపరంగా ఉన్న సమస్యలలో అతి ముఖ్యమైన సమస్య బహిరంగ మల విసర్జన ఈ సమస్య నుండి బయటపడాలంటే ప్రతి ఇంటా ఒక మరుగుదొడ్డి అందుబాటులో ఉండి, అది వాడకంలోనికి రావాలి.

అయితే-

మరుగుదొడ్డి ఉండి, వాటిని పూర్తిగా వాడుతున్న కుటుంబాలు మీ అందరికీ తెలుసు. వారిని మనస్ఫూర్తిగా మనమందరం అభినందిద్దాం.

మరుగుదొడ్లు ఉండీ, అడపాదడపా వాడుకొనే కుటుంబాలు కొన్ని ఉంటే అసలు వాడని కుటుంబాలు మరికొన్ని ఉన్నాయన్న మాట మనందరికీ తెలుసు.

మరికొందరికి అసలు మరుగుదొడ్లే లేవు. వారందరు బయటకు పోవడం మామూలైపోయింది.

వెరశి మన గ్రామంలో బహిరంగంగా మల, మూత్రాదులను విసర్జించే వారే ఎక్కువున్నారు.

దీనివలన –మలంలో కోట్ల సంఖ్యలో ఉన్న బాక్టీరియా, వైరస్, సూక్ష్మక్రిములు, వీటి గుడ్లు –బహిరంగంగా వదిలివేయబడుతున్నాయి.

అలా వదిలి వేయబడిన హానికారక క్రిములు గాలి ద్వారా, నీటి ద్వారా, పశుపక్ష్యాదుల, కీటకాల ద్వారా, పొలాల ద్వారా, మనచేతులు, కాళ్ళ ద్వారా, మోటారు వాహనాల ద్వారా మన ఇళ్ళలోకి, మన ఆహారంలోకి, మన పానీయాలలోనికి ప్రవేశిస్తున్నాయి.

వీటిని భుజించడం, త్రాగడం ద్వారా రకరకాలు రోగాలు సంక్రమిస్తున్నాయి. ముఖ్యంగా డయేరియా, టైఫాయిడ్, జాండీస్ లాంటి వ్యాధులబారిన పడుతున్నాం.

ఫలితంగా శారీరక వైకల్యం, వైద్య ఖర్చులు, పని కోల్పోవడం ఆదాయం తగ్గడం, పిల్లలు బడికి పోకపోవడం వంటివి మనం చూస్తున్నాం. ముఖ్యంగాపాలిచ్చే తల్లులు, గర్భంతో ఉన్న తల్లుల తమ అనారోగ్యం కారణంగా తమ పిల్లల పై ప్రభావం చూపుతున్నారు.

ఇదంతా జరగకుండా ఉండాలంటే మనమందరం –

మల, మూత్రాదులను బహిరంగంగా వదిలి వేయకూడదు.

మరుగుదొడ్లను తప్పని సరిగా వాడాలి.

దీంతో పాటు మలవిసర్జన తదుపరి చేతులు సబ్బుతో కడుక్కోవడం తప్పనిసరిగా అలవరచుకోవాలి.

అందుకై మనమందరం కలిసి ఒక ప్రతిజ్ఞ తీసుకుందాం.

మరుగుదొడ్లు ఉన్న కుటుంబాల నుండి (పిల్లలతో సహా) ఒక్కరు కూడా, ఈ రోజు నుండి బయటకు వెళ్ళవద్దు. మరుగుదొడ్లు లేని మన ప్రక్కనే ఉన్న కుటుంబాల వారిని మన మరుగుదొడ్లను వాడుకునేందుకు ఆహ్వానిద్దాం.

చిన్నపాటి మరమ్మత్తులు ఉంటే, వెంటనే ఎవరికి వారుగా వాటిని పరిష్కరించుకొని, అట్టి మరుగుదొడ్లను వాడకంలోనికి తెచ్చుకుందాం. మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి, అర్హులైన వారికి వెంటనే మరుగుదొడ్లు మంజూరు చేయిద్దాం.

మంజూరైన మరుగుదొడ్లు త్వరగా నిర్మించుకొనేందుకు కావలసిన మేస్త్రీలను, ప్లంబర్లను, వస్తు సామాగ్రిని అందుబాటులోనికి తెచ్చుకుందాం.

అర్హత లేని కుటుంబాలు తక్షణం స్వంతంగా మరుగుదొడ్లు కట్టుకోవలసిదేనని తేల్చిచెప్దాం.

మరుగుదొడ్లు నిర్మించుకొని, అవి వాడకంలోకి వచ్చేవరకు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుందాం అంటే, కందకాలు తవ్వుకుందాం. మలాన్ని మట్టితో కప్పేద్దాం. ఇందుకు మనందరం మనసా, వాచా కర్మణా మాటకు కట్టుబడి ఉందాం.

అలాగే మన గ్రామంలో ఉన్న అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీలలో మరుగుదొడ్లు వాడేందుకు వీలుగా ఆయా శాఖాధికారులతో మాట్లాడదాం. యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసేలా చూద్దాం. ఎందుకంటే, చిన్నారులే, రేపటి భావి భారత పౌరులు – వారు ఆరోగ్యంగా ఆహ్లాదంగా ఉంటేనే వారు ఉన్నతిలోకి వస్తారు. మంచిగా చదువుకుంటారు, ఆడుకుంటారు, ఆరోగ్యంగా ఉంటారు.

ఇకపోతే, మరో ముఖ్యమైన అంశం –

మనం ముందుగా చెత్తను తగ్గిద్దాం. ఎలా అంటారా, ప్లాస్టిక్ సంచులు మానేద్దాం, గుడ్డ సంచులు వాడదాం, ఎంత నీరు అవసరమో అంతే వాడుదాం.

వచ్చే చెత్తను మన ఇంట్లో మనమే రెండు సంచుల్లో వేర్వేరుగా వేసుకుందాం, కుళ్ళే చెత్తను ఎరువు గుంతలో వేద్దాం. కుళ్ళని చెత్తను పాతసామాన్ల వానికి అమ్మేద్దాం.

లేకుంటే స్నానాల గది వంటగది నీటిని (కాల్వ ఉంటే, కాల్వలోనికి) ఇంకుడుగుంతలు ఏర్పరచి అందులోనికి మళ్ళిద్దాం. లేదంటే పెరటి తోటకు మళ్ళిద్దాం. గ్రామ స్థాయిలో ఉత్పన్నమయ్యే చెత్తను ఊరికి దూరంగా మళ్ళిద్దాం. దాని నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందిద్దాం.

చివరిగా మన ఒళ్ళు, ఇల్లు శుభ్రంగా పెట్టుకుందాం, త్రాగేనీరు, తినేతిండి , పశువుల పాక, పెరడు, వీధులను శుభ్రంగా ఉంచుకుందాం.

ఇవన్నీ మనమందరం కలిసికట్టుగా చేద్దాం. ఇందుకు ఇంటింటికీ తిరుగుదాం. వ్యర్థ పదార్థాల యాజమాన్య ప్రణాళికతో కూడిన గ్రామ పారిశుద్ధ్య ప్రణాళికను రూపొందించికొని మనమందరం అది కార్యరూపం దాల్చేలా చూద్దాం.

దీని కోసం ప్రతి శనివారం (మీ వీలును బట్టి ఎంపిక చేసుకోండి) మధ్యాహ్నం 3 నుండి 5 గంటల మధ్య గ్రామ పంచాయితీ కార్యాలయం దగ్గర సమావేశమవుదాం. అందరం ఒక నిర్ణయానికి వద్దాం. స్వచ్ఛ గ్రామం – మన లక్ష్యం. అందరం కలిసి గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకుందాం.

***– ఎ. నాగేశ్వర రావు,***

*సెంటర్ హెడ్ సి.డబ్ల్యూ.యస్., టి–సిపార్డ్*

# ఆరోగ్యం మరియు పోషకాహార కార్యాచరణ కమిటి

### ఆరోగ్యము - పోషణయొక్క ప్రాముఖ్యత

మన రోజువారి కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించుకోవటానికి వ్యాధుల బారి నుండి రక్షించుకోవటానికి మరియు శారీరక, మానసిక పెరుగుదలకు పోషకాహారం ప్రముఖ పాత్ర వహిస్తుంది. ముఖ్యంగా దీర్ఘకాల అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు, పోషకాహార లోపానికి గురైయినప్పుడు ఎటువంటి పోషకాహారం తీసుకోవాలో అందరికీ తెలిసి వుండటం చాలా అవసరం. కాని మనలో చాలా మందికి దీని గురించి సరియైన అవగాహన లేదు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు పోషకాహారం విషయంలో సరియైన శ్రద్ధ వహించకపోతే వారికి పుట్టే బిడ్డలు తక్కువ బరువుతో పుట్టడం వల్ల తరచూ అనారోగ్యాలకు, పోషణ లోపానికి గురయ్యే అవకాశం వుంది. అలాగే బాలింతలకు కూడా పోషకాహారం చాలా అవసరం.

### *ఈ కార్యాచరణ కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశ్యం:*

1 ఆసుపత్రులలో 100 శాతం ప్రసవాలు జరిగేలా చూచుట.

2. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి 100 శాతం చికిత్స అందించుట

3. పిల్లలకు ఆరోగ్య పరిరక్షణ

4. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుట



**ఆరోగ్యము మరియు పోషకాహార కమిటీ**

**క్రింది వారితో కూడి ఉంటుంది**

- ⋆ సర్పంచుగారు ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉంటారు.
- ⋆ ఒకరు లేక ఇద్దరు లేక ముగ్గురు పంచాయతీ వార్డు (సభ్యుల సంఖ్యను బట్టి) సభ్యులుగా ఉంటారు.
- ⋆ స్వయం సహాయక సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు
- ⋆ స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధి లేక కుల సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ⋆ ఆరోగ్యం మరియు ఆహార విషయంలో నిష్ణాతులైన వారు ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ⋆ పంచాయతీ స్థాయి ఆశా వర్కరు లేక ఏ.ఎన్.ఎమ్. సభ్య సమావేశకర్తగా ఉంటారు.

5. ఆరోగ్య కార్యకర్త సేవలను వినియోగించుట

6. గ్రామంలోని జనన మరణాలను నమోదు చేయుట

7. గ్రామంలో బాల్య వివాహాలను నిరోధించుట

8. దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స చేయుటకు పెద్ద ఆసుపత్రులకు తరలించుట

9. గ్రామంలో మద్యపాన నిషేధం అమలు చేయుట.

### *ఈ కార్యచరణ కమిటీ ఉద్దేశ్యాలు నెరవేర్చుటకు ఈ క్రింది చర్యలు గైకొనవలెను*

**ఆసుపత్రులలో ప్రసవాలు జరుగుటకు ఈ క్రింది చర్యలు గైకొనవలెను :**

1. ఆశా వర్కరులు గ్రామాల వారిగా గర్భిణీ స్త్రీల జాబితా రిజిష్టరును వ్రాయవలెను.

2. గర్భిణీ స్త్రీలందరిని ఎ.ఎన్.యం ద్వారా ఆరోగ్య పరిరక్షణ, ఫోలిక్ యాసిడ్ మరియు ఐరన్ బిళ్లల సరఫరా చేయునట్లు చూడాలి.

3. వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

4. ప్రతి మాసం గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్ష చేయించాలి.

5. గర్భిణీ స్త్రీలందరికి ఆసుపత్రి ప్రసూతి కార్డును ఇవ్వాలి.

6. ప్రమాదపు పరిస్థితి గల గర్భిణీ స్త్రీలను గుర్తించి వారికొరకై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

7. అందరు గర్భిణీలకు పోషక ఆహార పదార్థాలు అందేట్లు చూడాలి.

8. అందరు గర్భిణీలకు ఆరోగ్యలక్ష్మి పథకాన్ని వర్తించేట్లు చూడాలి.

9. అందరు గర్భిణీలు గర్భం దాల్చిన సమయంలో అధిక బరువులు మోయకుండా మరియు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా అవగాహన కలిగింపచేయాలి.

10. గ్రామంలో కుటుంబ నియంత్రణకు అర్హత కలిగిన జంటలను నమోదు చేయవలెను.

**బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి చికిత్స అందించటానికి ఈ క్రింది చర్యలు గైకొనవలెను :**

1. గర్భవతులకు పౌష్టికాహారం అందచేయుట.

2. 2.5 కేజీల కంటే తక్కువ బరువు గల శిశువులను దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించాలి.

3. అంగన్‌వాడీ ద్వారా పౌష్టికాహారం ప్రతిరోజు పిల్లలకు అందేట్లు చూడాలి.

4. పిల్లలకు పోషకాహారం అంగన్‌వాడీలు రోజు ఇచ్చేట్లు చర్యలు గైకొనాలి.

5. ఆరోగ్య పరిరక్షణలో ఆడ మగ పిల్లల బేధాభిప్రాయాలు ఉండకుండా చూడాలి.

* ఈ కమిటీ ఆశా వర్కరు మరియు ఏ.ఎన్.ఎమ్ ల పని తీరును చాలా క్షుణ్ణంగా పర్యవేక్షించాలి. ఏదేని పెద్ద అనారోగ్యానికి గురైన వారికి పెద్ద ఆసుపత్రులలో చికిత్స చేయించుకోటానికి ఆరోగ్యశ్రీ పథకం ఉపయోగించేట్లు సహకరించాలి.

* తల్లుల, పిల్లల మరియు పెద్దల ఆరోగ్య స్థితిగతులను ఆశా వర్కరు





మరియు ఏ.ఎన్.ఎమ్ లు నివేదికను నిరంతరం ఈ కార్యాచరణ కమిటీకి మరియు గ్రామపంచాయతీకి అందజేయాలి.

* తల్లుల, పిల్లల ఆరోగ్యం మరియు సాధారణ ఆరోగ్యం అలాగే ఆరోగ్య సేవలను ప్రజలకు అందించుట అను మూడు ముఖ్య విషయాలపై ఈ కమిటీ దృష్టి సారించాలి.

* గ్రామంలోని గర్భిణీలకు 100 శాతం ఆసుపత్రులలో ప్రసవాల ను జరిపించటానికి చేయవలసిన కార్యక్రమం.

* గ్రామంలోని గర్భవతులందరినీ ఆశా వర్కర్ల ద్వారా నమోదు చేయించాలి.

* రిజిస్టర్ అయిన గర్భవతులందరికీ ప్రతి నెలా ఎ.ఎన్.ఎమ్. ద్వారా ఆరోగ్య పరీక్షలు చేయించాలి.

**సరియైన పోషణ ఆరోగ్యానికి పునాది**

* **పోషకాల లోపం వలన వచ్చే రుగ్మతలు:**

  - సక్రమమైన కంటి చూపుకి విటమిన్–ఎ అవసరం.
  - రేచీకటి, కళ్ళలో మార్పులు విటమిన్–ఎ లోపంవల్ల కలుగుతాయి.
  - తీవ్రమైన విటమిన్–ఎ లోపాల్ని సరియైన సమయంలో తగుచర్య తీసుకోకపోతే చిన్నపిల్లల్లో గ్రుడ్డితనానికి దారి తీస్తుంది.

* పోషకాల లోపంవల్ల వచ్చే రుగ్మతల బారిన పడకుండా ఈ క్రింది చర్యలు చేపట్టాలి

  - రోజూ తీసుకునే ఆహారంలో అందుబాటులో వుండే తక్కువ ఖర్చు అయ్యే ఆకుకూరలను తప్పకుండా తీసుకోవాలి.

| క్రమ సంఖ్య | కార్యక్రమం | ఆశించే ఫలితం లేక పరిణామం |
|---|---|---|
| 1 | ప్రసవాలు 100 శాతం ఆసుపత్రులలో జరుగేట్లు చూడటం | ప్రసూతి మరణాలను తగ్గించగలగడం |
| 2 | 100 శాతం పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించటం | శిశు మరణాలను తగ్గించ గలగడం |
| 3 | 104, 108 సేవలను వినియోగించటం | దీర్ఘ కాలిక రోగాలకు సరైన సమయంలో వైద్య సేవలు అందుతాయి. |
| 4 | వివిధ రకాల అనారోగ్యానికి గురైన వారిని 100% గుర్తించి వారికి రోగనివారణ గావించటానికి చర్యలు తీసుకొని, తదనంతర పరిణామాలను పర్యవేక్షించుట | గ్రామాస్థాయిలో 104 సేవల ద్వారా ఆరోగ్య సేవలను పొందగలగుట. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకము ద్వార వైద్య సేవలను పొందటానికి పెద్ద ఆసుపత్రులకు తరలించగలగడం. |
| 5 | అంగన్‌వాడీల పర్యవేక్షణ అందించగలగడం | తల్లులకు మరియు పిల్లలకు పౌష్ఠికాహారం |

- వీలైనంతగా, ఆయా కాలాల్లో లభించే కూరగాయలను ఆహారంలో రోజూ తీసుకోవాలి.
- తాజాగా ఉండే పచ్చి కూరగాయలను తీసుకోవాలి.
- కుటుంబానికి అవసరమైన కూరగాయలను ఇంటి వద్దే పెరటితోటలో పెంచండి.
- బాగా శుభ్రపరచి, మెత్తగా వండిన ఆకుకూరలను చిన్నపిల్లలకు (6 నెలల నుండి) ఇవ్వవచ్చు.

**※ గర్భవతుల ఆరోగ్యము పై ప్రత్యేక దృష్టి-**

- గర్భవతుల ఆరోగ్య పరిరక్షణ, ఫోలిక్ యాసిడ్ మరియు ఐరన్ బిళ్లల సరఫరా
- అనారోగ్య గర్భవతులను గుర్తించుట
- ఆసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించుట
- ప్రసూతి మరణాలను మరియు ప్రసవానంతరం 42 రోజులలో జరిగే మరణాలను నమోదు చేయుట

**పిల్లల ఆరోగ్యం కోసం చేయవలసిన కార్యక్రమాలు**

- పౌష్ఠికాహార లోపం వలన 2.5 కిలోల కన్న తక్కువ బరువుతో జన్మించిన పిల్లలను గర్తించుట.
- పౌష్ఠికాహార లోపం గల పిల్లల ఆరోగ్యపై ప్రత్యేక దృష్టి, అంగన్ వాడీల పనితీరుపై సమీక్ష.



- సరియైన సమయంలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుట
- పిల్లల జనన మరణాలను నమోదు చేయించుట
- బాల్య వివాహాలను నిరోధించుట
- మాతా శిశు సంరక్షణ కార్డుల జారీ చేయుట
- కోరింత దగ్గు రాకుండా టీకాలు వేయించుట

**గ్రామంలో 100 శాతం రోగనిరోధశక్తికి చేయవలసిన కార్యక్రమం**

- 0-5 సంవత్సరాల శిశువులకు 100 శాతం టీకాలు వేయించుట.
- ప్రతి శిశువుకు ఆరోగ్య సంరక్షణ కార్డులు జారీచేయునట్టు చూచుట.
- ఆశావర్కర్ మరియు ఎ.ఎన్.ఎమ్.లు గ్రామంలో రోగనిరోధక శక్తి గురించి అవగాహన కల్పించేట్ల చేయుట.
- ఎ.ఎన్.ఎమ్. వద్ద కొత్త టీకా మందులు సరిపడేట్లు ఉండేలా చూచుట.
- గడువు ముగిసిన మందులను వాడకుండా నిరోధించుట.
- రోగ నిరోధక టీకాలు వేసిన వారి జాబితా రిజిష్టరు నిర్వహించుట.

**గ్రామస్థులకు 104 మరియు 108 సేవలను 100 శాతం వినియోగపడేలా చేయుటకు -**

- గ్రామంలో 104 వాహనం వచ్చు తేదీ మరియు సమయం ప్రకటించుట.
- గ్రామంలో గల దీర్ఘకాల వ్యాధిగ్రస్తులను గుర్తించుట.
- 104 వాహనంలో టి.బి., రక్తపోటు మరియు చక్కెర వ్యాధులకు పరీక్షలు చేయించుట.
- 104 వాహనం వెంట డాక్టర్ వచ్చేలా ఏర్పాట్లు చేయాలి.

- 104 వాహనం సేవల ద్వారా అవసరమైన మందుల పంపిణీ చేయించుట.
- ప్రసూతి సమయంలో గర్భవతులకు 108 సేవలను వినియోగపడేలా చూచుట.
- ప్రసవానంతరం తల్లి పిల్లను గ్రామంలో చేర్చేలా చూచుట.
- గ్రామంలో గల దీర్ఘకాల రోగులను అవసరమైతే పెద్ద హాస్పటల్‌కు తరలించు ఏర్పాట్లు చేయుట.

**100 శాతం జనన మరణాలను నమోదు చేయవలసిన కార్యక్రమం**

- గ్రామంలో ప్రతి జనన మరణాలు నమోదుచేయునట్లు చూచుట.
- గ్రామపంచాయతీ నుండి జనన మరణ ధృవీకరణ పత్రాలను అవసరమైన వారికి ఇప్పించుట.
- జనన మరణ రిజిష్టర్లలో తేదీలను చెరుపకుండా చూచుట.

**మాతాశిశు ఆరోగ్యానికి హాని కలుగకుండా బాల్య వివాహాలను నిరోధించుట**

- బాల్యవివాహాలను నిరోధించుటకు ఆడపిల్లలకు అవగాహన కొరకు పాఠశాలకు పంపించుట.

**సమతుల ఆహారంలో తీసుకోవలసిన ఆహార పదార్థాలు**

| పోషకాలు | ఆహార పదార్థాలు |
|---|---|
| పిండి పదార్థాలు | గింజధాన్యాలు, చిరుధాన్యాలు దుంపలు, చక్కెర పదార్థాలు |
| మాంసకృత్తులు | పప్పులు, పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, చేప, సోయాబీన్స్ పుట్టగొడుగులు |
| క్రొవ్వు పదార్థాలు | వంట నూనెలు, నెయ్యి, వెన్న, నూనె గింజలు |
| విటమిన్లు | గింజ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గ్రుడ్లు, వెన్న, మాంసం, పప్పు ధాన్యాలు |
| ఖనిజలవణాలు | చిరు ధాన్యాలు, పాలు, గ్రుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు, ఎండబెట్టిన పండ్లు, చేపలు, మాంసం, గ్రుడ్లు, పాలు |



- బాల్యవివాహాలకు తలపడు దంపతులపై కఠిన చర్యలకు పోలీసులకు ఫిర్యాదు చేయుట.

**సంతోషకర కుటుంబాల కోసం మద్యపాన నిషేధం అమలుపరచుటకు**

- గుడుంబా తయారీ చేసే స్థావరాలను గుర్తించి వాటిని అరికట్టుట.
- గుడుంబా మరియు నాటుసారా వలన కలుగు చెడు గురించి అవగాహన కల్పించుట.
- గ్రామస్థుల సహకారంతో గ్రామంలో సంపూర్ణ మద్యనిషేధం సాధించుట.
- నాటుసారా మరియు గుడుంబా తయారుచేసే కుటుంబాల జీవనోపాధికి ఇతర విధాల జీవనోపాధులను కల్పించుట.

## ※ *సాధారణ ఆరోగ్యం*

- దీర్ఘ కాలిక రోగాలు- అనగా మధుమేహం, అధిక రక్తపోటు, క్షయ, గుండె సంబంధ వ్యాధులు, కుష్టు, మూర్ఛరోగం, పక్షవాతం, ఎయిడ్స్, ఉబ్బసం, ఫ్లోరోసిస్, బోధకాలు, క్యాన్సర్ వంటి రోగాల బారిన పడిన వారికి మంచి ఆరోగ్య సేవలందించడానికి పెద్ద ఆసుపత్రులకు పంపుటకు మరియు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సదుపాయం అందించటానికి చర్యలు తీసుకోవాలి.

1. గ్రామపంచాయతీలో 104 సేవలను చేకూర్చడం
2. అత్యవసర సేవలు అనగా 108 సేవలను వారు ప్రతిస్పందించు తీరును సమీక్షించుట
3. గుడుంబా తయారీని మరియు వినియోగమును గుర్తించి దానిని నిరోధించుట

ఆరోగ్య సేవలను అందించటానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరియు జిల్లా ఆసుపత్రులకు రోగులను పంపించటానికి గ్రామపంచాయతీ క్రియాశీల పాత్ర వహించాలి.

***- ఎస్. శంకరయ్య,, సిడిపిఏ, టి.సిపార్డ్***

# విద్యా కార్యాచరణ కమిటి

**అభివృద్ధి సాధించడానికి ముందుగా కావలసినవి నాణ్యమైన మానవ వనరులు. దానికి కావలసినది విద్య. అంటే గ్రామపంచాయతీలోని బడీడు పిల్లలను 100% బడిలో చేర్పించటానికి, అలాగే బడి మానేసిన వారిని గుర్తించి వారు బడికి వెళ్లేలా కృషిచేయాలి. ఆ బాధ్యతను విద్యా కార్యాచరణ కమిటీ తీసుకోవాలి. పదవ తరగతి లో ఉత్తీర్ణులయ్యే వారు మంచి గ్రేడులను పొందేలా చూడాలి. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వారందరు వయోజన విద్యా పథకం ద్వారా చదువు నేర్చుకోటానికి బాధ్యత వహించాలి. గ్రామపంచాయతీని సంపూర్ణ అక్షరాస్యత, విద్యావంతులు గల పంచాయతీగా మార్చటానికి గ్రామపంచాయతీ ఆలోచించి ఆచరించబోయే విధానాలను విద్యా ప్రణాళికలో చేర్చాలి.**

**విద్యా కార్యాచరణ కమిటీ క్రింది వారితో కూడి ఉంటుంది.**

- ★ సర్పంచుగారు ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉంటారు.
- ★ ఒకరు లేక ఇద్దరు లేక ముగ్గురు పంచాయతీ వార్డు (సభ్యుల సంఖ్యను బట్టి) సభ్యులుగా ఉంటారు.
- ★ స్వయం సహాయక సంఘాల నాయకులలో ఒకరు సభ్యులు
- ★ స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధి లేక కుల సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ★ విద్యా విషయములో నిష్ణాతులైన వారు అనగా విశ్రాంత ఉపాధ్యాయులు ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ★ పంచాయతీలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సభ్య సమావేశకర్తగా ఉంటారు.

## విద్య అంటే ఏమిటి? విద్యకు ఉన్న ప్రాముఖ్యత ఏమిటి?

విద్య వ్యక్తిని పరిపూర్ణుడుగా చేస్తుంది. క్రీ॥పూ॥ 283 సంవత్సరాలకు పూర్వమే కౌటిల్యుడు అనే తత్వవేత్త విద్య యొక్క ఆవశ్యకత గురించి చాలా చక్కగా అభివర్ణించాడు. **"విద్య ప్రజలను తమను తాము అర్థంచేసుకొనే సంపన్నులుగా చేస్తుంది"** అని చెప్పారు. అంతేకాక విద్యను ఒక వ్యక్తిపై పెట్టే పెటుఎబడిగా కూడా ఆయన అభివర్ణించాడు. ప్రస్తుతం ఉన్న విద్యా విధానానికి ఇది అద్దం పడుతుంది. ఒకప్పుడు పోస్టుగ్రాడ్యుయేషన్ అయ్యేవరకు చేసే ఖర్చు కంటే ఇప్పుడు ఎల్.కె.జీ. చదువుకు చెల్లించే రుసుం ఎక్కువగా ఉండడం గమనించదగ్గ విషయం.

విద్య అంటే భాగా చదవడం మంచి మార్కులు సాధించడం మాత్రమే కాదు. ఒక విధంగా చెప్పాలంటే విద్య అనగా మనకు తెలియని విషయాలను కనిపెట్టడం మరియు మనిషి తెలివితేటలను పెంచుకోవడం అని కూడా చెప్పవచ్చును.

విద్యావంతుడు మాత్రమే మంచి చెడులు లేదా తప్పు ఒప్పుల మధ్య తేడాలను బాగా గుర్తించగలుగుతాడు. ముఖ్యంగా చెప్పాలంటే ఒక వ్యక్తికి విద్య వలన వచ్చిన గుర్తింపు మరియు గౌరవం ఇంకా దేనివలన కూడా లభించదు. అందుకే ప్రతి పౌరునికి విద్యనందించడం ఆ సమాజం యొక్క కనీస బాధ్యత.



## విద్యతో అభివృద్ధి సాధ్యమవుతుందా?

అభివృద్ధి విస్తృతమైనది. భౌతిక వసతుల కల్పన అభివృద్ధిలో ఆర్థికాభివృద్ధి ఒక భాగం మాత్రమే. సామాజిక, మానవ వనరుల అభివృద్ధి దీనికి తోడైతేనే అభివృద్ధి పరిపూర్ణమవుతుంది. ఉదాహరణకు వ్యక్తిగత మరుగుదొడ్లు కట్టించడం, భౌతిక వనరుల అభివృద్ధి వాటిని సక్రమంగా వినియోగించుకోవడం సామాజిక/మానవ వనరుల ఆర్థిక అభివృద్ధికి అక్షరాస్యత కీలకం.

ఐక్యరాజ్య సమితి సేకరించిన గణాంకాలను పరిశీలిస్తే అక్షరాస్యత వివిధ అంశాలను ఎలా ప్రభావితం చేస్తున్నదో అర్థమవుతుంది. అక్షరాస్యులు ఎక్కువగా ఉన్న దేశాలలో శిశుమరణాలు, పోషకాహార లోపం తక్కువ. సగటు ఆయుర్ధాయం, ప్రజల సగటు ఆదాయం, బిడ్డలను బడికి

| క్రమ సంఖ్య | కార్యక్రమము | ఆశించు ఫలితం లేక పరిణామం |
|---|---|---|
| 1 | 6 నుండి 14 సం.ల వయసు గల పిల్లలు 100% బడిలో చేరేలా మరియు వారు పాఠశాలలో ఉండేల చూడడం | సార్వత్రిక ప్రాథమిక విద్యను సాదించడం. |
| 2 | 3 నుండి 5 సంవత్సర పిల్లలు పూర్వ ప్రాథమిక విద్య లేక నర్సరిలో 100% చేరేలా చూడడం. | విద్యను పొందాలనే ఉత్సాహము పిల్లలో పెంపొందించ గలగ డం |
| 3 | కనీస స్థాయి విద్యా ప్రమాణాలను మదింపు చేయడం ద్వార ; విద్యార్థులు పొందిన గ్రేడుల ఆధారంగా విద్యా ప్రమాణాల పర్యవేక్షణ | కనీస స్థాయిలో నేర్చుకొనడం ద్వార మంచి గ్రేడులు రావడం.తద్వార పిల్లలలో విద్యపై ఆశక్తి పెంచగలగడం. |
| 4 | మధ్యాహ్న భోజన పథకము పర్యవేక్షణ | ఆరోగ్యము మంచి ఆహారము అందించడం ద్వార పిల్లలను బడిలో ఉండేలా చేయగలగడం. |
| 5 | వయోజన విద్యను మెరుగు పర్చుట – గ్రామములో చదువురాని వయోజనులందరిని గర్తించి అక్షరాస్యత కార్యక్రమము చేపట్టుట | వివేకము కలిగిన మంచి పౌరులు గల గ్రామముగా రూపొందదము |
| 6 | పాఠశాల భవనాలలో అంగన్‌వాడి భవనాలలో సమగ్రమైన మౌళిక వసతుల కల్పన అనగా మరుగుదొడ్లు మరియు త్రాగునీరు సదుపాయాలు ఉండేలా చూడడం. | పాఠశాలలు మరియు అంగన్ వాడీలు సంపూర్ణ వసతులను కలిగి యుండుట. |

పంపడం ఈ దేశాల్లో ఎక్కువ. పంట దిగుబడి, కుటుంబ పరిమితి ఇలా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను కూడా అక్షరాస్యత ప్రభావితం చేస్తున్నది. అందుకే అభివృద్ధిని కోరుకొనే ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలి.

## గ్రామస్థాయిలో అక్షరాస్యతా ప్రాధాన్యత

గ్రామస్థాయిలో అధిక అక్షరాస్యతను సాధించిన గ్రామాలకు, సాధించని గ్రామాల ప్రజల జీవననాణ్యతలలో స్పష్టమైన తేడా ఈ క్రింద పట్టికలో తెలుస్తుంది.

| అంశం | అక్షరాస్యత ఎక్కువ వున్న గ్రామాలు | అక్షరాస్యత తక్కువ వున్న గ్రామాలు |
|---|---|---|
| జననరేటు (వెయ్యి జనాభాకు) | 18 | 22 |
| శిశుమరణాల రేటు | 24 | 60 |
| గర్భస్థ మాతృమరణాల రేటు | 136 | 220 |
| బడి పిల్లల నమోదు | 98% | 85% |
| బడికొనసాగింపు (విద్యాతరగతి వరకు) | 80% | 60% |



* తమ వృత్తి, జీవన పరిస్థితులకు అవసరమైనంత వరకు నిష్పత్తులు, వడ్డీ మొదలైన వాటిలో పరిజ్ఞానం కలిగి ఉండడం.

*విద్య వలన కలిగే ప్రయోజనాలు ఏవైనా ఉన్నాయా?*

*"విద్య అంటే పాత్రలను నింపడమే కాదు అదొక ప్రకాశవంతమైన జ్వాల"*

*- సోక్రటీస్*

* **వ్యక్తిగత ప్రయోజనాలు :** అక్షరాస్యతను సాధించిన వ్యక్తులు ఆత్మవిశ్వాసం కలిగి ఉంటారు. తమ తమ వృత్తి వ్యాపకాల్లో నైపుణ్యతను పెంచుకోగలిగి సాధికారతను సాధించగలుగుతారు, ఆధునిక విజ్ఞాన పరిణామాలను ఆకళింపు చేసుకోగలుగుతారు. కుటుంబం-ఆరోగ్యం వంటి ప్రధాన అంశాల పట్ల అవగాహన పెరిగి, జాగరూకత వహించగలుగుతారు. స్త్రీ - పురుషులు యిరువురూ అక్షరాస్యులైతే వారి మధ్య నున్న అంతరాలు తగ్గించబడి నైతిక సమానత్వం సాధ్యమవుతుంది.

* **సాంస్కృతిక ప్రయోజనాలు :** 'అక్షరాస్యత' మనుషుల మధ్య నైతిక విలువలను పెంపొందింపజేస్తుంది. మంచి - చెడులను భేరీజు వేసుకోగల ఆత్మవిమర్శకు అక్షరాస్యత అంకురార్పణ చేస్తుంది. ఫలితంగా వ్యక్తుల ప్రవర్తనా తీరులోనే 'మార్పునకు' అవకాశం కలుగుతుంది. వ్యక్తి చైతన్యం పెరిగి భిన్న సమూహాల మధ్యనున్న విభేదాలు-అపోహలు తగ్గడానికి, 'సామాజిక సమానత్వం' దిశగా సాగి సామాజిక మార్పుకు దోహదపడుతుంది.

* **సామాజిక ప్రయోజనాలు :** అక్షరాస్యతా ప్రభావంతో వ్యక్తుల వ్యక్తిగత జీవన స్థాయి మెరుగుపడి, అంతిమంగా సామాజికస్థాయి విలువలు పెరుగుతాయి. వ్యక్తుల్లో ఆరోగ్యం - పర్యావరణం వంటి సామాజిక అంశాలపట్ల అవగాహన పెరిగి జీవన ప్రమాణాలు పెరిగే వీలుంటుంది. సామాజిక అభివృద్ధికి కొలబద్ధలైన అంశాలలో ప్రగతి సాధ్యమవుతుంది.

**అక్షర జ్ఞానం, సంఖ్య పరిజ్ఞానంతో స్వశక్తి అంటే -**

*చదవడం*

* అభ్యాసకులు తమకు ఆసక్తిగల విషయాలకు సంబంధించిన ఒక పేరాను, నివిషానికి 30 పదాలు చొప్పున చదవడం.
* సరళమైన భాషలో ఉన్న చిన్న పేరా నిమిషానికి 35 పదాలు తమలో తాము చదువుకోవడం.
* రహదారి, ట్రాఫిక్ గుర్తులను, పోస్టర్లను, చిన్న చిన్న సందేశాలను, నూతన అభ్యాసకులకు ఉద్దేశించబడిన వార్తా పత్రికలను చదివి అర్థం చేసుకోగలగడం.
* నివాస స్థలంలో / పనిచేసే వద్ద సాధారణ భాషలో వ్రాసిన సమాచారాన్ని చదివే సామర్థ్యం కలిగి ఉండడం.

*రాయడం*

* నిమిషానికి 7 పదాల చొప్పున అవగాహన చేసుకొని, చూసి రాయడం
* డిక్టేషన్ చెబితే నిమిానికి 5 పదాల వేగంతో రాయగలగడం
* వరస క్రమంలో పదాల మధ్య ఖాళీ ఇస్తూ రాయగలగడం.
* చిన్న ఉత్తరాలు, దరఖాస్తులు, ఫారాలు సొంతంగా రాయడం.

*సంఖ్యా పరిజ్ఞానం*

* 1 నుండి 100 వరకు గల అంకెలు చదవడంతో పాటు రాయగలగడం.
* మూడు స్థానాల వరకు గల సంఖ్యలతో చిన్న చిన్న కూడికలు, తీసివేతలు, రెండు అంకెల గుణకార, భాగహారాలు చేయగలగడం.
* తూనికలు, కొలతలు, ద్రవ్యమానం, దూరమానం, క్షేత్రమానం, కాలమానం వంటి వాటిలో పరిజ్ఞానం



**విద్యా కమిటీ లక్ష్యాలు :**



* 3 నుండి 6 సంవత్సరాల వయసు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించుట.
* బడి ఈడు పిల్లలను 100% పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించుట.
* పాఠశాలలోని పిల్లలకు 75 శాతం పైగా మార్కులు సాధించేట్లు కృషి చేయడం.
* మధ్యాహ్న భోజన పథకం 100 శాతం పిల్లలకు అందేటట్లు చూచుట.
* అంగన్‌వాడీ కేంద్రం సమర్థవంతంగా పనిచేసేలా చూడడం.
* గ్రామంలోని 100 శాతం వయోజనులకు అక్షర జ్ఞానం కల్గించడం.
* పాఠశాలల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం.
* పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం.

**పై లక్ష్యాలను సాధించుటకు చేయవలసిన కార్యక్రమాలు**

**✳ 3 నుండి 6 సంవత్సరాల వయసు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించుట.**

- గ్రామంలో 6 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలను అంగన్‌వాడీ స్కూల్‌లో చేర్పించి, వారికి పౌష్టికాహారం అందేలా చూడడం.
- అంగన్‌వాడీలో ఆటలతో విద్యను నేర్పించడం.
- అంగన్‌వాడీ కార్యక్రమాలను పర్యవేక్షించడం.



- గ్రామంలోని వారందరిని తమ పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించేలా చైతన్యవంతులను చేయడం.

**✳ బడి ఈడు పిల్లలను 100% పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించుట.**

- గ్రామంలోని బడిఈడు పిల్లలను గుర్తించడం.
- 6 నుంచి 14 సంవత్సరాల వయసున్న పిల్లలందరినీ బడిలో చేర్పించేలా చూడడం.
- బాలకార్మికులను గుర్తించి వారిని తగిన తరగతిలో చేర్పించేలా చూడడం మరియు వారిని బడి మానివేయకుండా చూడడం.
- మధ్యాహ్న భోజన పథకంలో మంచి ఆహారాన్ని అందించేలా చూడడం.
- పాఠశాలలకు ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడడం.
- విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయడం.
- విద్యార్థులందరూ సక్రమంగా పాఠశాలకు హాజరయ్యేలా చూడడం.
- గ్రామంలో అనాథ బాలలను గుర్తించి వారిని ప్రభుత్వ వసతి గృహాలలో చేర్పించడం.

**✳పాఠశాలలోని పిల్లలకు 75 శాతం పైగా మార్కులు సాధించేటట్లు కృషి చేయడం.**

- విద్యార్థుల హాజరు 100 శాతం నమోదయ్యేలా చూడడం.
- విద్యలో వెనుకబడిన వారిని గుర్తించి వారికి మెరుగైన విద్య అందేలా చూడడం.



- వారి తరగతుల నియమాల గురించి చదవడం వ్రాయడంపై అవగాహన కల్పించడం.
- పిల్లలకు విద్యలో మెళకువలు చెప్పేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం.
- పిల్లలకు సరైన సమయంలో పాఠ్యపుస్తకాలు అందేలా చూడడం.

✳ **మధ్యాహ్న భోజన పథకం 100 శాతం పిల్లలకు అందేటట్లు చూచుట.**

- పిల్లలు పాఠశాలకు 100 శాతం హాజరయ్యేలా చూడడం.
- మధ్యాహ్న భోజనంలో మంచి ఆహారాన్ని అందించేలా చూడడం.
- పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారాన్ని వేడివేడిగా వడ్డించేలా చూడడం.
- మధ్యాహ్న భోజన పథకంలో వంట చేసే వారికి సరైన టైమ్‌లో చెల్లింపులు జరిగేలా చూడడం.
- మధ్యహ్న భోజనానికి అవసరమైన సరుకులను ఎప్పటికప్పుడు అంచనా వేసి అందుబాటులో ఉండేలా చూడడం.

✳ **అంగన్‌వాడీ కేంద్రం సమర్థవంతంగా పనిచేసేలా చూడడం.**

- గ్రామంలోని 6 సంవత్సరాలల లోపు పిల్లలందరూ అంగన్ వాడీ పాఠశాలలో నమోదయ్యేలా చూడడం.
- నమోదైన పిల్లలకు పౌష్టికాహారం అందేలా చేయడం.
- ఆట పాటలతో విద్యను అందించే విధంగా చూడడం.
- గ్రామస్తులందరూ తమ పిల్లలను అంగన్‌వాడీలో చేర్చేలా అవగాహన కల్పించడం.
- గర్భవతులకు ఆరోగ్యలక్ష్మి పథకం సక్రమంగా అమలయ్యేలా చూడడం.
- అంగన్‌వాడీ పాఠశాలలో హాజరు రిజిష్టరు సక్రమంగా నిర్వహించేలా ఆకస్మిక తనిఖీలు జరపడం.
- అంగన్‌వాడీలో గల సరుకులను వృధా చేయకుండా స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించడం.

✳ **గ్రామంలోని 100 శాతం వయోజనులకు అక్షర జ్ఞానం కల్గించడం.**

- గ్రామంలో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి వారిని సాక్షరభారత్ సెంటర్‌లకు పంపేలా చూడడం.
- సాక్షరభారత్ కో-ఆర్డినేటర్‌లు సక్రమంగా తరగతులను నిర్వహించేలా చూడడం.
- సాక్షరభారత్ కేంద్రాలు నిర్వహించడానికి సరైన స్థలం మరియు సమయం నిర్ణయించడం.
- నిరక్షరాస్యులైన వయోజనులందరూ 6 నెలలలోగా అక్షరాస్యులుగా మారేలా చూడడం.

✳ **పాఠశాలల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం**

- బాలికల పాఠశాలలకు ప్రహరీ గోడ ఉండేలా చూడడం.
- ప్రహరీ గోడ నిర్మాణానికి కావలసిన నిధులను సమీకరణ చేయడం.
- రెవెన్యూ వారి సహాయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి కావలసిన స్థలమును గుర్తించడం.

✳ **పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం**

- గ్రామంలోని పాఠశాలల అన్నిటికీ మరుగుదొడ్లు ఉండేలా చూడడం, మరియు అవి సక్రమంగా నిర్వహించబడేలా చూడడం.
- మరుగుదొడ్లకు నీటిసదుపాయం ఉండేలా చూడడం.
- మరుగుదొడ్ల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం.
- మరుగుదొడ్లకు తలుపులు ఉండేలా చూడడం.
- పిల్లలందరూ మరుగుదొడ్లు మంచి పరిస్థితులలో వాడేలా అవగాహన కల్పించడం.
- మరుగుదొడ్లు లేని పాఠశాలలకు నీటి సరఫరా మరియు విద్యా శాఖలతో సంప్రదించి పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించేలా చూడడం.

*– ఎస్. శంకరయ్య, సిడిపిఎ, టి.సిపార్డ్*



# సామాజిక భద్రత మరియు పేదరిక నిర్మూలనా కార్యాచరణ కమిటి

**సామాజిక భద్రత మరియు పేదరిక నిర్మూలనా కమిటీ క్రిందివారితో కూడి ఉంటుంది**

- ★ షెడ్యూలుకులాల లేక షెడ్యూలు తెగల మహిళా వార్డు సభ్యురాలు ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉంటారు.
- ★ ఒకరు లేక ఇద్దరు లేక ముగ్గురు పంచాయతీ వార్డు (సభ్యుల సంఖ్యను బట్టి) సభ్యులుగా ఉంటారు.
- ★ స్వయం సహాయక సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ★ స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధి లేక కుల సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ★ సామాజిక భద్రత మరియు పేదరిక నిర్మూలనా విషయములో నిష్ణాతులైన వారు ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ★ పంచాయతీ కార్యదర్శి సభ్య సమావేశ కర్తగా ఉంటారు.

❊ ఈ కమిటీలో ఇంతకు ముందు సూచించబడిన సభ్యులతో పాటు షెడ్యూలు కులాలకు లేక షెడ్యూలు తెగలకు చెందిన మహిళా వార్డు సభ్యురాలు అధ్యక్షులుగా ఉంటారు.

❊ బాలికల, బడుగు బలహీన వర్గాల, సామాజికముగా వెనుకబడిన తరగతుల, పేదవారల సంక్షేమము కొరకు తగిన ప్రతిపాదనలు ప్రణాళికల రచనలో తప్పని సరిగా చేర్చాలి. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమపథకాలన్నియు ప్రణాళికలో చేర్చాలి. కుటుంబ సంక్షేమ పథకాలైన భీమా, పింఛను, ఇళ్లు మొదలయినవి ప్రణాళికలో చేర్చుటకు తగిన చర్యలు తీసుకోవాలి. షెడ్యూల్డు కులాల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా కేటాయించిన (SCP) నిధులు మరియు షెడ్యూలు తెగల ఉప ప్రణాళిక (TSP) నిధులు కూడా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో చేర్చాలి.

**ఈ కమిటీ యొక్క ముఖ్య లక్ష్యాలు :**

1. గ్రామంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన
2. గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలన
3. గ్రామంలో యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
4. గ్రామంలో అనాధల సంక్షేమం
5. గ్రామంలో వృద్ధుల సంక్షేమం
6. గ్రామంలో నిరుపేదలను గుర్తించుట

❊ **గ్రామంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు చేయవలసిన పనులు**

- గ్రామంలో ఎవరేని బాలలను పనిలో పెట్టుకున్న వారిని గుర్తించి వారికి బాలకార్మిక నిర్మూలన వ్యవస్థ గురించి అవగాహన కల్పించడం.
- గ్రామంలో బాలలను పనిలో పెట్టుకున్న వారిని గుర్తించి

| క్రమ సంఖ్య | కార్యక్రమము | ఆశించు ఫలితం లేక పరిణామం |
| --- | --- | --- |
| 1 | గ్రామ సభలో నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయుట | అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే వర్తించుట |
| 2 | SCSP మరియు TSP ప్రణాళిక అమలుచేయుట -SCSP మరియు (TSP) పథకాలలో అవసరం ఉన్న అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయుట | గ్రామపంచాయతీలో యోగ్యమైన వారు మెరుగైన సేవలు పొందగలుగుట. |
| 3 | యువతకు సామర్థ్య పెంపుదల – సామర్థ్య పెంపుదల అవసరమైన యువతను గుర్తించుట. | అర్థవంతమైన ఉద్యోగముల పొందుటకు మంచి అవకాశములను కల్పించ గలుగుట |
| 4 | సామాజిక భద్రత పథకాల అమలులో లొసుగులను అరికట్టుట | నిజమైన అర్హత గల లబ్ధిదారులు పథకాల ఫలితాలను పొందేలా చేయగలగడం. |

తగిన చర్య కొరకు మండల రెవెన్యూ అధికారికి నివేదిక పంపించడం.

### ✳ గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలన కొరకు చేయవలసిన పనులు

- గ్రామంలోని బాలికలందరినీ పాఠశాలకు పంపించేలా చూడడం.
- గ్రామంలోని వారందరికీ 18 సం॥లలోపు బాలికలను వివాహం చేసుకొనకూడదని అవగాహన కల్పించడం.
- బాల్య వివాహాలను ప్రోత్సహించేవారిని గుర్తించి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం.
- గ్రామంలో బాల్య వివాహాలను చేసుకోబోమని ప్రతిజ్ఞ చేయించడం.

### ✳ గ్రామంలో యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- గ్రామంలోని యువతను గుర్తించి వారి అవసరాలు వారి లక్ష్యాలను అంచనావేయాలి.
- యువతకు ఏ రకమైన శిక్షణా అవసరం అన్నది గుర్తించాలి.
- గ్రామీణాభివృద్ధి సంస్థ తెలంగాణ శిక్షణ నైపుణ్య సంఘం మరియు ఇ.జి.ఎమ్.ఎమ్. (ఉద్యోగాలు మరియు వాణిజ్య సంస్థ) యొక్క సహాయం తీసుకోవాలి.
- నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ ఇచ్చే సంస్థలను గుర్తించాలి.
- శిక్షణా సంస్థలో హాజరు శాతం పెంచుటకు మరియు ఉద్యోగాలను సాధించేలా చూడాలి.



మరియు బ్యాంకు రుణాల కోసం తగిన శిక్షణా నైపుణ్యాన్ని పొందేలా చర్యలు తీసుకోవాలి.

### ✳ గ్రామంలో అనాథల సంక్షేమం

- గ్రామంలో 18 సంవత్సలలోపు అనాథలను గుర్తించాలి.
- గ్రామంలోని అనాథ శిశువులను శిశు విహార్‌కు పంపించటానికి తాహసిల్దార్‌తో సంప్రదించాలి.
- గ్రామంలో అనాథ పిల్లల సంక్షేమంకోసం వారిని దత్తత తీసుకొనుట కోసం మరియు వారికి తగిన విద్యా బుద్ధులు నేర్పించుట కోసం తగిన సహాయ సహకారాలు అందించుట కొరకు ప్రజలకు అవగాహన పెంపొందించుటకు ప్రయత్నించాలి.
- మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ వారితో నిరంతరం సమన్వయం ఏర్పరచుకోవాలి.

### ✳ గ్రామంలో వృద్ధుల సంక్షేమం

- గ్రామంలోని తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు గల 65 సం॥లు దాటిన వారిని గుర్తించాలి.
- గ్రామంలోని అర్హులైన వృద్ధులందరూ ఆశరా ఫించన్‌లు పొందేలా చూడాలి.
- గ్రామ పంచాయతీ ద్వారా వృద్ధాశ్రమం నెలకొల్పి నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలి.
- గ్రామంలో వృద్ధాశ్రమం నడుపుటకు అవసరమైతే విరాళాల సేకరణ కోసం ప్రయత్నించాలి.
- గ్రామంలోని వృద్ధులందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించుటకు వైద్య శాఖ వారితో సంప్రదించాలి.

### ✳ గ్రామంలో నిరుపేదలను గుర్తించుట

- గ్రామంలోని జీవనోపాధి లేని నిరుపేదలను గుర్తించాలి.
- గ్రామంలోని నిరుపేదలందరికి గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి లభించేలా కృషి చేయాలి.
- గ్రామంలోని నిరుపేదలందరికీ ఆహార భద్రత కార్డులు అందేలా చూడాలి.

*– ఎస్. శంకరయ్య, సిడిపిఎ, టి.సిపార్డ్*



# వ్యవసాయ కార్యాచరణ కమిటి

**వ్యవసాయ కార్యాచరణ కమిటీ క్రిందివారితో కూడి ఉంటుంది**

- ఉప సర్పంచ్ గారు ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉంటారు.
- ఒకరు లేక ఇద్దరు లేక ముగ్గురు పంచాయతీ వార్డు (సభ్యుల సంఖ్యను బట్టి) సభ్యులుగా ఉంటారు.
- స్వయం సహాయక సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధి లేక కుల సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- వ్యవసాయ శాఖ విషయములో నిష్ణాతులైన విశ్రాంత అధికారి ఒకరు సభ్యులుగా ఉంటారు.
- పంచాయతీ వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ అధికారి సభ్య సమావేశ కర్తగా ఉంటారు.

- ఈ కమిటీకి ఇంతకు ముందు సూచించిన సభ్యులతో పాటు ఉపసర్పంచు అధ్యక్షులుగా ఉంటారు.
- గ్రామీణ ప్రాంతాలలో చాలా మంది జీవనోపాధికి వ్యవసాయంప్రాథమిక ఆదాయ వనరులు మరియు ఉత్పత్తి రంగానికి చాలా దగ్గర సంబంధం కలిగి ఉంది.
- రసాయన రహిత పంటల యాజమాన్య పద్ధతి (NPM) ఉపయోగించటం ద్వారా తక్కువ వ్యయంతో వ్యవసాయోత్పత్తుల ను పెంచే విధానాలపై దృష్టి పెట్టాలి.
- విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, పరపతి (అప్పు) సౌకర్యము మరియు దిగుబడిని అమ్మటానికి కావలసిన ఏర్పాట్లను వ్యవసాయ ప్రణాళికలో చేర్చాలి.
  - రాయితీలపై విత్తనాల పంపిణీ
  - భూసార కార్డుల నిర్వహణ
  - సాంప్రదాయ అద్దెల కేంద్రము మరియు వ్యవసాయ యాంత్రీకరణ
  - వ్యవసాయ ఋణమ్ వడ్డీరేటు ఎప్పకప్పుడు మారు రేటుతో అప్పును, పావలా వడ్డీ పథకాన్ని మరియు ఋణ మాఫీ పథకాలను సాధించుట.

## సేంద్రీయ వ్యవసాయం

### సేంద్రియ వ్యవసాయము ఎందుకు?

భారతదేశంలో 70 శాతం జనాభా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. చాలా కాలం వరకు వ్యవసాయం సేంద్రియ పద్ధతిలోనే జరిగింది. కానిమారుతున్న కాలానికి అనుగుణంగా మరియు పెరిగే జనాభాకు తగినంత ఆహారం అందించడానికి. పంటల దిగుబడి పెంచడానికి,తద్వారా నికర ఆదాయం పెంచుకోవడానికి ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం ఎక్కువయింది.

ఈ ప్రక్రియలో భాగంగా సమతుల్యత పాటించక పోవడం వలన నేల ఆరోగ్యం, పంటల దిగుబడులు తగ్గిపోవడం జరిగింది. విచక్షణా రహితంగా ఎరువులు, సస్యరక్షణ మందులు వాడటం ఫలితంగా, పండించిన పంటలు కలుషితం కావడం, మిత్ర పురుగులు నశించడం, పర్యావరణానికి హాని, మనుష్యుల ఆరోగ్యం దెబ్బతినడం జరుతున్నది.

ఈ మధ్యకాలంలో, మనుషుల ఆహారం, అభిరుచుల్లో మార్పులు వచ్చాయి. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం పై అవగాహన పెరగడంతో, ఖర్చుతో కూడుకున్నదైనా ఫరవాలేదుకాని పురుగు మందులు, మందుల అవశేషాలు లేని మంచి ఆహారం వుండాలనే స్పృహ బాగా పెరిగింది.

ఇలాంటి పరిస్థితులలో వ్యవసాయ శాఖ శిక్షణా కార్యమాలను నిర్వహించి సేంద్రియ వ్యవసాయము గురించి అవగాహన కలుగ చేయుటకు కృషి చేయుచున్నారు.

## సేంద్రియ వ్యవసాయము అంటే ఏమిటి ?

సహజ సిద్ధమైన సేంద్రియ పదార్థాలు అనగా ఎండిన ఆకులు, కలుపుమొక్కలు, వ్యవసాయ వ్యర్థపదార్థాలు మొదళ్ళు, పంట నూర్పిడి తర్వాత వచ్చే పొట్టు,పేడ, మొదలైన పదార్థాలను ఉపయోగించి తయారుచేసిన సేంద్రీయ ఎరువుతో సక్రమ యాజమాన్య పద్ధతులతో పంటలనుపండించే విధానాన్ని సేంద్రియ వ్యవసాయం అని చెప్పవచ్చు.

ప్రకృతి ధర్మాలకు అనుగుణంగా సహజ వనరులతో సంప్రదాయ పద్ధతులతో వ్యవసాయం చేయడమే దీని లక్ష్యం.

## సేంద్రియ ఎరువులు ఎలా తయారౌతాయి.

ఎండిన ఆకులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాలైన మొదళ్ళు, పంట దుబ్బులు పంట నూర్పిడి తర్వాత వచ్చే పొట్టు, తాలు, చెరకు ఆకులు కుళ్ళిన కూరగాయలు పండ్లు,వర్షాకాలంలో లభించే కలుపు మొక్కలు, పండ్లతోటలలో లభించే వ్యర్థ పదార్థాలు ఉపయోగించి మట్టి, పేడతో కలిపి కుళ్ళ పెట్టడం ద్వారా తయారవుతాయి.

## సేంద్రియ వ్యవసాయంవల్ల ఎలాంటి లాభాలు పొందవచ్చు

- నేల గుల్లబారుతుంది,మురుగునీటి సౌకర్యం పెరుగుతుంది,నేలలో తేమ, గాలి అనుకూలత ఏర్పడుతుంది. నీరు పట్టి వుంచుకొనే శక్తి పెరుగుతుంది. వేర్లు బాగా చొచ్చుకొని పోవుటకు సౌకర్యం కలిగిస్తుంది.
- మొక్కకు పోషకాలు బాగా అందుబాటులోకి వస్తాయి. నేలకు వాటిని పట్టి పెట్టుకొనే గుణం అధికమవుతుమది.
- సురక్షితాహారం లభిస్తుంది. ఆహారంలోకి విషపదార్థాలు ప్రవేశించే అవకాశం వుండదు.
- సహజ వనరులు ఇప్పటికిప్పుడు ఉపయోగపుటయేగాక
- దీర్ఘకాల ప్రయోజనాల కొరకు రాబోయే తరాలవారికి కూడ అందుబాటులో వుంటాయి.
- ఖరీదైన పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు.



- నేల పునరుద్ధరణ జరుగుతుంది. భౌతికలక్షణాలు వృద్ధిచెందుతాయి.
- పంట నాణ్యతగా వుంటుంది. ఉత్పత్తులు మంచి రంగు, రుచి, వాసన, నిల్వవుండే గుణం కలిగి వుంటాయి.
- అంతర పంటలు వేసుకోవడం వల్ల రైతు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం వుండదు. చీడపీడల ఉధృతి తగ్గుతుంది.
- నేల,నీరు, వ్యవసాయ ఎరువుల వినియోగం పెరగడం వల్ల మొక్కలకు అవసరమైన ముఖ్య సూక్ష్మపోషకాలు తగు మోదాదుల్లో లభ్యమవుతాయి.
- చీడపీడల తాకిడి తక్కువగా వుంటుంది. వచ్చినవి కూడ ప్రకృతిపరంగా సహజంగానే సమసిపోతాయి.
- నేలలో తగినంత సేంద్రియ పదార్థం వుంటే పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. నేటి పరిస్థితులలో దీనిని సర్వరోగ నివారి ణిగా పేర్కొనవచ్చు.
- పరిసరాల మిత్రత్వానికి, కాలుష్యనివారణకు దోహదపడుతుంది.

ప్రధానంగా కంపోస్టు ఎరువులైన వానపాముల ఎరువు, నాడప్ కంపోస్టు ఎరువు మొదలగు వాటిని నేలకు అందించాలి. వర్షాధారిత పంటభూముల్లో సేంద్రియ పదార్థం ఎంత ఎక్కువ వేస్తే అంత మంచిది.

పైన తెలిపిన విషయాలన్నీ దృష్టిలో వుంచుకోని వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి గ్రామ పంచాయితీకి వర్మికంపోస్టు,నాడెప్ కంపోస్టు తయారీ యూనిట్లను 50 శాతం సబ్సిడీపై స్థాపించవచ్చు. అదేవిధంగా

| సంఖ్య | కార్యక్రమము | ఆశించు ఫలితం లేక పరిణామం |
|---|---|---|
| 1 | ఉత్పత్తి విధానాలను మెరుగు పర్చుట | ఉత్పత్తి వ్యయం తగ్గించగలగడం. |
| 2 | జాతీయ తెగులు యాజమాన్యం పద్దతి పాటించుట | భూసారమును రక్షించుట. కల్తీలేని ఆహారం |
| 3 | ఎరువులు విత్తనాల సరఫరా, పరపతి పర్యవేక్షణ | అగచాట్లను తగ్గించుట |
| 4 | నూర్పిల్ల తరువాత సంబందాల నిర్వహణ | దిగుబడికి సరైన ధరలు పొందగలుగుట |

10 గ్రామ పంచాయితీలకు కలిపి ఒక వర్మిహాచరీ కూడా సబ్సిడీపై రైతులకు అందజేయడం జరుగుతున్నది.

ఇవేకాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో 'కంపోస్టుపిట్'లు కూడా రైతుల పొలాల్లోకాని ఇంటి దగ్గరలో కాని, రైతులకు ఎలాంటి ఖర్చులేకుండా ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

ఈ సేంద్రియ వ్యవసాయంను చేయుటకు ఎలాంటి పద్ధతులు ఉన్నాయి.

1. పచ్చిరొట్ట ఎరువుల వాడుక.
2. కంపోస్టు/వర్మి /నాడప్ కంపోస్టు ఎరువుల వాడుక.
3. పురుగు మందులు లేకుండా పంటల సాగు
4. జీవన ఎరువుల వాడుక

## 1. పచ్చి రొట్ట పైర్లవాడకము:

పొలంలో నేలకు సారం అందించే పప్పు ధాన్యాల పంటలు పెంచి నేలలో కలపడాన్నే పచ్చిరొట్ల పైర్ల పెంపక పద్ధతి

*దీనిలో రెండు పద్ధతులున్నాయి:*

- పచ్చిరొట్టపైర్లను పొలంలో చల్లి, అవి పెరిగిన తర్వాత ఆదే పొలంలో అక్కడికక్కడే భూమిలోకి కలియదున్ని, తర్వాత పంట వేసుకోవడం, కుళ్ళడానికి సరిపోయే రోజులు ముందుగా కల యదున్ని, తర్వాత పంట వేయాలి.

ఉదా : జనుము,జీలుగా,పిల్లిపెసర,ఉలవ,అలసంద,పెసర మొ॥.

- పచ్చిరొట్ట చెట్ల ఆకులు, బయటి నుండి సేకరించి, పొలంలో చేరి ్చ కలియదున్ని, కుళ్లనిచ్చి, తర్వాత పంట వేసుకోవడం. ఉదా: కానుగ, వేప, జిల్లెడు,నేలతంగేడు, గ్లైరిసిడియా మొదలైనవి.

*ఎప్పుడు వేయాలి?*

- ఖరీఫ్‌పంటలకు ముందు వేసవిలో (మే, జూన్) తొలకరి వర్షాలు పడిన వెంటనే దున్ని ఎకరాకు 12-15 కిలోల విత్తనం చల్లాలి. జనుము ఎకరాకు 20 కిలోల విత్తనం సరిపోతుంది.
- దీర్ఘకలిక పంటలు, పండ్లతోటలలో వరుసల మధ్య పచ్చిరొట్టపైర్లు వేసి, పెరిగిన తర్వాత భూమిలోనికి దున్నవచ్చు.



*పచ్చిరొట్టపైర్లకు ఉండవలసిన లక్షణాలు ఏమిటంటే:*

- చాలా త్వరగా పెరిగి, మెత్తని ఆకులు, పచ్చి కాండం కలిగి ఉండాలి.
- మృదువుగా ఉండి తొందరగా కుళ్ళే స్వభావం కలిగి వుండాలి.
- ఇవి అన్ని రకాల నేలలకు,శీతోష్ణ స్థితికి, నీటి ఎద్దడికి తట్టుకునేటట్టుగా ఉండాలి.

## 2. కంపోస్టు ఎరువు:

కంపోస్టు ఎరువు నేలకు తల్లిపాలు అంతటి శ్రేష్టమైనది. ప్రతి పంటకు పుష్కలంగా కంపోస్టు ఎరువు తర్వాతనే రసాయనిక ఎరువులు వాడాలి. వివిధ రకాల కలుపు మొక్కలు, పంట దుబ్బులు, తాలు, చెఱకు ఆకులు, వేరుశెనగ పొట్టు మొదలగునవి కంపోస్టు తయారికి ఉపయోగపడుతాయి.

*కంపోస్టు ఎరువుల రకాలు :*

1.సాధారణ కంపోస్టు
2.నాడెపు కంపోస్టు
3.వర్మి కంపోస్టు

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ కూలీలలకు కంపోస్టు పిట్టు మరియు నాడెప్ కంపోస్టు తొట్టి కట్టిఇస్తారు. దీనికి గాను సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్/ఇంజనీరింగా కన్సల్‌టెంట్ వారిని సంప్రదించవలెను.

## 3.పురుగు మందులు లేకుండా పంటలసాగు (సాంప్రదాయ పద్ధతులు)

మొక్కల, వృక్షాల నుండి లభించే క్రిమిసంహారక గుణాలు వుండే వివిధ పదార్థాలతో క్రిమికిటకాలను నివారణకు వాడవచ్చు.అటువంటి పదార్థాలను జీవ క్రిమికీటక నాశనులు (బయోపెస్టిసైడ్స్) అంటారు.

### 1.విత్తనశుద్ధి ( పశువుల మూత్రంతో )

*కావలసిన పదార్థాలు :*

**పశువుల మూత్రం** : 2 లీటర్లు (వీలైనంత వరకూ గేదె మూత్రం తీసుకున్నటైతే శిలీంధ్రాల నుంచి వచ్చే తెగుళ్ళను అడ్డుకుంటుంది.

పశువుల పేడ : 1 కిలో పుట్ట మట్టి : 1 కిలో

పైన చెప్పినవన్నీ కూడా విత్తన శుద్ధి చేయాలనుకున్న విత్తనాలతో బాగా కలిపి నీడలో నేలపై 1 గంట వరకూ నానబెట్టవలెను.

***సూచనలు*** : ఈ పద్ధతి విత్తనరేటు 30-60 కేజీలు ఉన్న పంటకు అనుకూలమైనది ఉదా : వేరుశేనగ

## 2. విత్తన శుద్ధి( మొలక శాతం వృద్ధికి ):

పంటకు ఉపయోగించదలుచుకున్న విత్తనాలను విత్తుటకు ముందు నానబెట్టడం వలన మొలక శాతం వృద్ధిచెందుతుంది. ఎంతసేపు నానబెట్టడం అనేది విత్తన కవచంపై ఆధారపడి ఉంటుంది. ఈ విత్తనాలను కంపోస్టు మిశ్రమంలో లేదా పశువుల మూత్రంలో నానబెట్టుట వలన తెగుళ్ళ నివారణ కూడా పనిచేస్తుంది.

## 3. విత్తన శుద్ధి (ఇతర పద్ధతులు):

ఏ రకం విత్తనాలైనా విత్తడానికి సిద్ధం చేసుకున్న తరువాత ఆవుపాలు నీళ్ళ 1:9 నిష్పత్తిలో కలిపి,విత్తనాలపై జల్లి,నీడలో ఆరనిచ్చి విత్తుకోవాలి. లేదా ఆవు మూత్రాన్ని సేకరించి 100 కిలోల విత్తనాలకు ఒకటి లేదా రెండు లీటర్లు కలిపి,నీడలో బాగా ఆరనిచ్చి విత్తుకోవాలి. లేదా విత్తనాలపై నీళ్ళు జల్లి, దానిపై పిడకల బూడిద చల్లి, నీడలో బాగా ఆరనచ్చి విత్తుకోవాలి.

4. బూడిదను పంటలపై చల్లి కూడా కొన్ని రకాల హానికారక పురుగులను నివారించవచ్చు.బూడిదను పండ్ల మొక్కలపై చల్లుట వలన మొక్కలకు పోషక పదార్థాలు (పోటాష్) లభించి,పండ్లకు మంచి పోషణ లభిస్తుంది.దీనిని ఉపయోగించడం వలన పంటలు ఆరోగ్యంగా కనిపిస్తాయి. ఒక ఎకరం పంటకు సుమారు 5 కిలోల పిడకల బూడిద అవసరమవుతుంది

## 5. వేప కషాయం

పండిరాలిన వేపపళ్ళను మే, జూన్ నెలలో సేకరించి నీడలో ఆరబెట్టాలి.ఒక ఎకరానికి 8-10 కిలోల పళ్ళను నీటి లో నానబెట్టి తొక్కను వేరుచేయాలి.మెత్తగా రుబ్బాలి.

మెత్తటి ముద్దను ఒక పల్చటి మూటలో వదులుగా కట్టి... 10 లీటర్ల నీటిలో 4గంటల పాటు నానబెట్టాలి..

మూటను 15-20 నిమిషాల పాటు పిండుతూ ద్రావణం తీయాలి ఈ ద్రావణానికి.. 100 గ్రాముల సర్ఫ్ లేదా సబ్బుపొడి కలపాలి. సర్ఫ్ లేదా సబ్బు ఎమల్సీఫయిర్‌గా పనిచేస్తుంది.ద్రావణం తేలికగా చేనుపై పరుచుకోవటానికి ఉపయోగపడుతుంది. తరువాత పల్చటి గుడ్డతో వడబోయాలి. ఇలా 10 లీటర్ల వేప కషాయం తయారవుతుంది. ఒక స్ప్రేయరుకు ఒక లీటరు వేప కషాయం కలిపి పిచికారి చేయాలి.

*వేప కషాయం ఉపయోగాలు*

- ఈ కషాయాన్ని అన్ని పంటలపైన, అన్ని పురుగులపైన ఉపయోగించవచ్చు.
- వేపలో అజాడిర్టిన్ అన్ రసాయనం పురుగుల మీద ప్రభావం చూపుతుంది.
- ఇది ఆకులలో కంటే గింజలలో ఎక్కువ శాతం ఉంటుంది.
- వేప కాయలు పోగు చేసిన ఆరు నెలలోపల వాడాలి, లేకపోతే అజాడిరిక్టిన్ శాతం తగ్గి పురుగుల మీద ప్రభావం తగ్గుతుంది.

*ఇది రెండు రకాలుగా పనిచేస్తుంది*

ఎ. ఆహారాన్ని పురుగు ముట్టకుండా, తినకుండా చేస్తుంది.

బి. పిచికారి చేసిన పంటను పురుగు తిన్న తరువాత దాని ఎదుగుదలలో మార్పులపైన ప్రభావం చూపి పురుగును చంపుతుంది.

ఆకులు,పువ్వు,మొగ్గలపై పెట్టిన గుడ్లను ఈ కషాయం పగలకుండా చేసి గుడ్ల దశను చంపుతుంది. కంది మొగ్గ దశలో పిచికారి చేస్తే శనగపచ్చ పురుగు గుడ్ల దశను చంపుతుంది.వరి నారుమడిలలో,నారు నాటిన తరువాత 15 రోజులకు పిచికారి చేస్తే కాండం తొలిచే పురుగు గుడ్ల దశను చంపుతుంది.

ఈ కషాయం అప్పుడే పగిలిన లార్వాలపైన,కొంచెం పెద్ద లార్వాలపైన బాగా పనిచేస్తుంది.

పురుగుల ఉధృత్తిని ముందే తెలుసుకొని ఆ పంట మీద ఈ కషాయం పిచికారి చేస్తే పురుగు సంతతి చాలా వరకు తగ్గుతుంది.

మిత్ర పురుగులకు,పర్యావరణానికి హానికరం కాదు.

## 6. వేపనూనె:

సాధారణంగా వేపనూనె మార్కెట్లో దొరుకుతుంది. స్వచ్ఛమైన వేపనూనెను చీడపీడల నివారణకు వినియోగించవచ్చును.

వేపనూనె లీటరు నీటికి 5 మి.లీ.చొప్పున 100 లీటర్ల ద్రావణాన్ని తయారు చేసుకోవాలి.

వేపనూనె నీటిలో కరగదు.అందువల్ల 100 గ్రాముల సబ్బు పొడిని నీటిలో కలిపిన ద్రావణాన్ని వేపనూనె ద్రావణంలో కలపాలి. అలా కలపడం వల్ల పిచికారి చేసినప్పుడు వేపనూనె ద్రావణం ఆకులకు అంటుకొని వ్యాప్తి చెందుతుంది.

***నివారింపబడు పురుగులు:***

రసంపీల్చే పురుగులు,తొలిదశలో కాయతొలిచే పురుగులం,ఆకుముడత

## 7.వేపపిండి:

వేపగింజల నుండి నూనె తీయగా మిగిలిన పిప్పినే వేపపిండి లేదా చెక్క అంటారు.

వేప పిండిలో 5.2 శాతం నుండి 5.6 శాతం వరకు నత్రజని,1.1 శాతం భాస్వరం,1.1 శాతం పొటాష్ ఉంటాయి.

వేపపిండిని ఎకరానికి 1-2 క్వింటాళ్ళ వరకు వేయవచ్చు.

భూమిలో కీడు చేసే పురుగుల నిర్మూలనకు వేపపిండి బాగా పనిచేస్తుంది.

దుక్కి దున్నే సమయంలో సాళ్ళలో వేయవచ్చు.

నారుమడిలో విత్తులు జల్లేముందు పిండివేస్తే కూడా మంచిది.

నివారింపబడు పురుగులు: వేరు పురుగులు, నులిపురుగులు.

***వేపగింజల సేకరణలో జాగ్రత్తలు:***

బాగుగా పండి చెట్లు నుంచి పండిన పండ్లను మాత్రమే సేకరించాలి.

మే, జూన్, నెలలు పండ్లు చెట్ల నుండి సేకరించడానికి సరైన సమయం.

సేకరించిన పండ్లను బాగుగా శుభ్రంచేసి (రాళ్ళు, పుల్లముక్కలు, చెట్ల ఎండుపుల్లలు,ఇతర ఎండిన ఆకులు మొ॥) నీడలో ఆరబెట్టాలి.

నీడలో ఆరబెట్టిన పండ్ల నుండి ఎప్పటికప్పుడు గింజలను వేరుచేసుకోవాలి.(దానికోసం పండ్లను నీళ్ళ తొట్టిలో వేసి రాత్రంతా నానబెట్టి మర్నాడు పండ్లనుండి గింజలను వేరుచేయాలి.)

***8.వావిలాకు కషాయం.***

వావిలాకులో సహజంగా ఉండే ఎన్నో రకాల అల్కలాయిడ్‌ల వలన ఇది పురుగుల నియంత్రణలో మరియు తెగుళ్ళ నియంత్రణలో ఉపయోగపడుతుంది.

వావిలాకు కషాయాన్ని పంటలలో వచ్చు రసంపీల్చు పురుగుల పైన,చిన్న దశలలో ఉన్న లద్దెపురుగు,శనగపచ్చపురుగు,ఆకును కొరికే పురుగులపై వాడవచ్చు.

**కావలసిన పదార్ధాలు:**

1.వావిలాకు-5 కిలోలు  2.సబ్బుపొడి-100 గ్రా

**తయారు చేసే విధానం :**

5 కిలోల వావిలాకులను తీసుకొని దానిని 10 లీటర్ల నీటిలో అరగంట సేపు బాగా ఉడకబెట్టాలి.

ఒక కర్రతో ఉడుకుతున్న ద్రావణాన్ని మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి.

కషాయాన్ని బాగా చల్లార్చి,పలుచని గుడ్డతో వడపోయాలి.

కషాయాన్ని 100 గ్రాముల సబ్బుపొడిని కలపాలి.

ఈ ద్రావణాన్ని 100 లీటర్ల నీటిని చేర్చి ఒక ఎకరాకు సాయంత్రం వేళ పంటపై పిచికారి చేయాలి.

**జాగ్రత్తలు:**

వావిలాకు కషాయం తయారు చేసేటప్పుడు ముక్కుకు గుడ్డ కట్టుకోవాలి.

పంట కాలంలో పంట దశను మరియు పురుగు ఉధృతి బట్టి 2-3 సార్లు పిచికారి చేసుకోవచ్చు తయారు చేసిన ద్రావణాన్ని నిల్వ ఉంచరాదు.

**సూచన :**

పై విధంగానే సీతాఫలం ఆకుతో కూడా కషాయం తయారు చేయవచ్చును. ఈ కషాయం కూడా పైన సూచించిన పురుగులపై బాగా పనిచేస్తుంది.

**10. 5 శాతం కానుగ పప్పు ద్రావణం :**

కానుగలో ఉన్న కరంజినన్ అనే మూల పదార్థం మరియు ఇతర అల్కలాయిడ్స్ పురుగులను మరియు మచ్చ తెగుళ్ళ నివారణలో బాగా ఉపయోగపడుతుంది.

కానుగ పప్పు కషాయాన్ని పొగాకు లద్దె పురుగు, శనగ పచ్చపురుగు, దాసరి పురుగు, ఆకు ముడత పురుగు, రసం పీల్చే పురుగుల నివారణలో ఉపయోగించవచ్చు.

**కావలిసిన పదార్ధాలు :**

1.కానుగపప్పు-5 కిలోలు  2.సబ్బుపొడి-100 గ్రా.

**తయారు చేయు పద్ధతి :**

కానుగ గింజల నుండి వేరుచేసిన శుభ్రమైన పప్పును 5 కిలోలు తీసుకొని ఒక గంటసేపు నీటిలో నానబెట్టాలి.

నానబెట్టిన పప్పును మెత్తగా రుబ్బి పిండి చేయాలి.

రుబ్బిన కానుగ పిండిని ఒక మూటలో కట్టి 10-12 గంటలు నీటిలో నానబెట్టాలి

మూటను నీటిలో ముంచి పట్టుకొని 15-20 నిముషాల పాటు కషాయాన్ని పిండాలి.

మధ్య మధ్యలో నీటిలో ముంచుతూ కషాయాన్ని సేకరించాలి.

ఈ ద్రావణాన్ని పలుచని గుడ్డతో వడబోసి 100 గ్రాముల సబ్బుపొడి కలపాలి.

ఈ విధంగా తయారైన కానుగ కషాయాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పొలంలో సాయంత్రం వేళల్లో పంటపై పిచికారి చేసుకోవాలి.

**సూచన :**

పంట దశను బట్టి,పురుగుల ఉధృతిని బట్టి పంటకాలంలో 2-3 సార్లు పిచికారి చేసుకొనవచ్చును.

సబ్బు పొడి బదులు కుంకుడుకాయ మరియు శీకాకాయలను (500 గ్రా) కూడా ఉపయోగించవచ్చును.

ద్రావణం తయారుచేసిన వెంటనే పంటపై పిచికారి చేసుకోవాలి. నిల్వ ఉంచరాదు.

ఈ ద్రావణాన్ని అన్ని పంటలలోను ఉపయోగించవచ్చు.

### *11. ఆవుపేడ - మూత్రం ద్రావణం:*

పేడ 5 కిలోలు,ఆవుమూత్రం 5 లీటర్ల. 5 లీటర్ల నీటిని ఒక కుండ లేదా తొట్టిలో తీసుకుని వాటిని కలపాలి. దానిపై మూత బిగించాలి. 3-4 రోజుల పాటు మురగబెట్టాలి, రోజుకు ఒకసారి మూతను తీసి మిశ్రమాన్ని కలియబెట్టాలి.

మూతపెట్టి వుంచటం వల్ల ద్రావణంలో వేడి పెరిగి మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయి. అందువల్ల మిశ్రమాన్ని ప్రతిరోజు కలియ పెట్లాలి. 4 రోజుల తరువాత కుండను బయటకు తీసి..... మురిగిన ఆమిశ్రమానికి 20 లీటర్ల నీటిని కలపాలి. ఆ ద్రావణాన్ని వడబోయాలి. 250 గ్రాముల సున్నం కలపాలి, మురిగిన పేడ,మూత్రంలో అమోనియా వల్ల ఆమ్ల శాతం ఎక్కువ వుంటుంది. దీని విరుగుడుకు సున్నం కలపాలి. అప్పుడు చేనుకు నష్టం జరుగదు. ప్రతి లీటరు ద్రావణానికి 10 లీటర్లు నీటిని కలిపి పంట పై పిచికారి చేయెుచ్చు.

పేడ్ మూత్ర ద్రావణం వల్ల పురుగు 3-4 రోజులు పాటు పంట వాసనను పురుగు గుర్తు పట్టలేదు. దానితో పంట మీద అది గుడ్డు పెట్టలేదు.

కందిలో మొగ్గ,పూత దశలో శనగపచ్చ పురుగు గుడ్డు పెట్టకుండా చేస్తుంది. వరి నారుమడిలో, నాటిన తరువాత కాండం తొలిచే పురుగు గుడ్డు పెట్టకుండా చేస్తుంది. ఇరి పురుగుల బారి నుండి పంటను కాపాడటమే కాకుండా వరిలో సూక్ష్మ పోషక లోపాలను కూడా సరిదిద్దుతుంది. మిత్ర పురుగులకు,పర్యావరణానికి హానికరం కాదు.

**ఉపయోగాలు :**

చెనుకి బెట్ట రాకుండా వుంటుంది.

తల్లిపురుగులను గుడ్లు పెట్టకుండా చేస్తుంది.

మొక్కకు పోషకాలు అందుతాయి.

గింజ నాణ్యత, బరువు పెరుగుతాయి.

### *4.జీవన ఎరువులు*

గాలిలో 78 శాతం నత్రజని ఉంది. వాయురూపంలో ఉన్న నత్రజనిని మొక్కలు ఉపయోగించుకోలేవు. ప్రకృతిలో కొన్ని రకాల సూక్ష్మజీవులకు, నాచురకాలకు గాలిలోని నత్రజని మొక్కకు ఉపయోగపడే విధంగా స్థిరీకరింపజేసే శక్తి ఉంది. మరికొన్ని రకాల సూక్ష్మజీవులకు,శిలీంధ్రాలకు (నేలలో వుండి కూడా లభ్యం కాని) భాస్వరాన్ని లభ్యమయ్యేవిధంగా మార్పు చేయగల శక్తి ఉంది. ఈ విధంగా మొక్కలకు పోషకాలందించడానికి తోడ్పడే వాటిని జీవన ఎరువులు అంటారు.

జీవన ఎరువులను స్థూలమగా రెండు తరగతులుగా విభజన చేయవచ్చు.

1. నత్రజని స్థిరీకరించేవి (నైట్రోజన్ ఫక్సర్)
2. భాస్వరాన్ని అందుబాటులోకి తెచ్చేవి(ఫాస్వరస్ సాల్యుబులైజర్స్ అండ్ మోబిలైజర్స్)

### *నత్రజని జీవన ఎరువులు*

వేరుశెనగ, వరి, పప్పుధాన్యపు పైర్లకు వీటి వాడకం బాగా అల వాటులో ఉంది. దీనివల్ల రసాయన ఎరువుల వాడకం 20-30 శాతం తగ్గించవచ్చును. పైర్లకు కావాల్సిన ప్రత్యేకమైన కల్చర్లను నేలకు వేసిగాని, విత్తనానికి పట్టించిగాని లేదా కొన్నింటిని రెండు రకాల ంగా కూడా అందజేయవచ్చును. వీటిలో రైజోబియం, అజటోబాక్టరు, అజోస్పైరిల్లం. ఆసిటోబాక్టరు, బ్లూ గ్రీన్ ఆల్గే(నీలి ఆకుపచ్చనాచు) అజోల్లా ముఖ్యమైనవి.

**1. రైజోబియం:** కంది,పెసర,మినుము, శెనగ వంటి పప్పుధాన్యపు పైర్లకు, వేరుశెనగ, సోయాబీన్ వంటి నూనె గింజల పైర్లకు బఠాణీ, చిక్కుడు వంటి కూరగాయల పైర్లకు, పిల్లి పెసర, ఉలవ, బెర్సీమ్ వంటి పశుగ్రాసపు పైర్లకు రైజోబియం కల్చర్లను ఉపయోగించాలి.( ఇవి ఎకరానికి 20 నుండి 80 కిలోల వరకు నత్రజనిని స్థిరీకరించగల వు. 25 నుండి 30 శాతందిగుబడి పెరుగుతుంది. 16 నుండి 32 కిలోల వరకు నత్రజని భూమిలో నిల్వ వుండి, తర్వాత పైరుకు ఉపయోగపడుతుమది), రైజోబియం వాడకం వల్ల వేళ్లుబాగా వృద్ధి చెంది, విస్తరించి వాటిపై ఆరోగ్యకరమైన బుడిపెలు ఏర్పడతాయి. వేర్వేరు పైర్లకు వేర్వేరు రైజోబియం కల్చర్లను వాడాలి.

***వాడేవిధానం:*** ఒక లీటరు నీటిలో 50 గ్రాముల బెల్లం లేదా పంచదారను కరిగించి 15 నిమిషాలు మరిగకాచి చల్లార్చాలి. ఈ ద్రావణానికి 200 గ్రాముల రైజోబియం కల్చరును వేసి బాగా కలిపి జావగా తయారుచేయాలి. దీనిని విత్తనానికి పూర్తిగా, సమానంగా, అంటే విత్తనపు పై పొరకు హానికలుగని విధంగా నెమ్మదిగా కలపాలి. విత్తనాన్ని నీడన ఆరబెట్టిన తర్వాత వెంటనే విత్తాలి.

రైజోబియం కల్చర్ 200 గ్రాముల ప్యాకెట్లలో లభిస్తుంది. ఇది ఒక ఎకరంలో వేయాల్సిన విత్తనానికి పట్టించడానికి సరిపోతుమది. నేలలో తగినంత భాస్వరం లభ్యమవుతున్నపుడే రైజోబియం కల్చరు ఉపయోగం పూర్తిగా, సమర్ధవంతంగా ఉంటుంది.

**2. నీలి ఆకు పచ్చనాచు:** ఇది వరి పైరుకు ఉపయోగించాల్సిన జీవన ఎరువు. దీని వాడకం వల్ల ఎకరాకు 8 - 12 కిలోల నత్రజని పైరుకు అందుతుంది. వరి నాటిన వారం పదిరోజులలో ఎకరానికి 4 కిలోల నాచుపొడిని నీటిపై చల్లాలి. పొలంలో కనీసం ఒక వారం వరకు తగితనంత నీరు వుండేటట్లు పెట్టాలి. వరికి అన్ని సేద్య పద్ధతులలో దీనిని వాడవచ్చు.

నీలి ఆకుపచ్చనాచులో జరుగు కిరణజన్యసంయోగక్రియ ద్వారా శక్తి పొంది నత్రజనిని స్థిరీకరింపజేస్తుంది. మొక్క దిగుబడి 10-12 శాతం పెరుగుతుంది. నీలి ఆకుపచ్చనాచు 3-4 పంట కాలాలకు వరుసగా వేస్తే తర్వాత వేయనవసరం లేదు.

**3. అజోల్లా:** ఇది సాధారణంగా బావులు, చెరువులు, కాలువలు, వరి పొలాలలో నీటిపై తేలియాడుతూ కనిపించే ఫెరను జాతి మొక్క. నత్రజని స్థిరీకరించే నీలిఆకుపచ్చనాచు అజోల్లా మొక్కతోకలసి జీవిస్తుంది. నత్రజనిని అజొల్లా మొక్క ఉపయోగించుకుంటుంది. ఇది నేలలో కలిసిపోయినపుడు వరి పైరుకు నత్రజని ఉపయోగపడుతుంది.

అజోల్లా బాగా వృద్ధి చెందడానికి ఉదజని సూచిక ఇంచుమించు 8.0 ఉండాలి. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే చలికాలం, వర్షాకాలం, తగినంత నీటి వసతి, సాగునీరు నియంత్రించే అవకాశం, భాస్వర పోషకం అందుబాటులో ఉండడం మొదలైనవి అనుకూల అంశాలు.

వరి నాటిన వారం రోజుల్లో ఎకరాకు సుమారు 100 కిలోల అజోల్లా వేయాలి. 2-3 వారాలకు అది పెరిగి చాప వలె అల్లుకొంటుంది. కలుపుతీసే సమయంలో తొక్కడం వల్ల కొంతభాగం నేలలో కలిసిపోతుంది లేదా పొలంలో నీటిని ఒకసారి పూర్తిగా తీసివేయడం వల్ల అజోల్లా నేలకు అంటుకొని కుళ్ళి, స్థిరీకరించిన నత్రజని పైరుకు ఉపయోగపడుతుంది.

**4. అజటోబాక్టర్:** ఇవి స్వతంత్రంగా జీవించే సూక్ష్మజీవులు (నాన్ సింబయాటిక్ బాక్టీరియా). ఇవి మొక్కలపై ఆధారపడకుండా స్వతంత్రంగా నేలలో నివసిస్తూ, గాలి నుండి నత్రజని తీసుకొని స్థిరీకరించే జీవులలో ముఖ్యమైనవి. కొద్దిపాటి క్షారగుణం గల నేలలకు అజటోబాక్టర్ రకం అనువైనది. పప్పుజాతి పైర్లకు చెందినవి కాక మిగిలిన పైర్లు ముఖ్యంగా వరి, చెరకు, జొన్న, సజ్జ, ప్రత్తి,మిరప, పొద్దుతిరుగుడు, కూరగాయల పైర్లకు బాగా పనిచేస్తాయి. ఇవి ఎకరానికి సుమారు 8-16 కిలోల నత్రజని అందిస్తాయి.

200-400 గ్రాముల కల్చర్‌ను ఎకరానికి అవసరమైన విత్తనానికి పట్టించి వాడుకొవాలి. 1 నుండి 2 కిలోల కల్చర్‌ను 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలపై వెదజల్లాలి. చెరకు, ప్రత్తి పైర్లకు పెరుగుదల దశలో 30-40 రోజుల తేడాతో రెండు లేదా మూడు సార్లుగా వేర్ల దగ్గర పడే విధంగా వేయాలి.

**5. అజోస్పైరిల్లం:** ఇవి మొక్కలపై పూర్తిగా ఆధారపడకుండా వేళ్ళ దగ్గర లేదా వేళ్ళమీద జీవిస్తాయి. వీటిని సహవాసి సూక్ష్మజీవులు (అసొసియేటివ్) అంటారు. ఇవి గాలిలోని నత్రజని తీసుకొని, వేళ్ళమీద స్థిరీకరించగలవు. వేళ్ళ దగ్గర అవసరమైన రసాయనాలను విసర్జించడం వల్ల మొక్క చురుగ్గా పెరుగుతుంది. ఇవి ఎకరానికి 8-16 కిలోల నత్రజని స్థిరీకరించగలవు.

పప్పుజాతి పైర్లు కాక మిగిలిన అన్ని పైర్లకు వీటిని సిఫారసు చేస్తున్నారు. ఈ కల్చర్లను అజోటోబక్టర్ వాడే పద్ధతిలోనే అదే మొతాదులో ఉపయోగించాలి.

***2. భాస్వర జీవన ఎరువులు:***

కొన్ని రకాల సూక్ష్మజీవులు, శిలీంద్రాల ద్వారా భూమిలో నిల్వ ఉండి, లభ్యం కాని భాస్వరాన్ని మొక్కలకు అందుబాటులోకి తీసుకొస్తాయి. భాస్వరం అందించడానికి ఫాస్ఫోబాక్టీరియా భాస్వరాన్ని కరిగించి లభ్యతను పెంచే (సాల్యుబులైజర్స్) స్వభావం కలిగినవి. వీటి వాడకం వల్ల సిఫారసు చేసిన మోతాదు నుండి ఎకరానికి 10-12 కిలోల భాస్వర పోషకం తగ్గించవచ్చు. భాస్వరం తక్కువున్న నేలల్లోను, సేంద్రీయ పదార్థం సమృద్ధిగా ఉన్న నేలల్లోను వీటి వాడకం వల్ల మంచి ప్రభావం కనిపిస్తుంది.

**ఫాస్ఫోబాక్టీరియా/ఫంగై:**

ఇవి ఉత్పత్తి చేసిన సేంద్రీయ ఆమ్లముల ద్వారా భాస్వరాన్ని తగ్గిస్తాయి. కనుక వీటిని ఫాస్పరస్ సాల్యుబులైజింగా బాక్టీరియా లేక ఫాస్ఫోబాక్టీరియా అంటారు. (బాసిల్లస్ సుడోమోనాస్) అదే విధంగా భాస్వరాన్ని కరిగించే శిలీంద్రాలలో ఆస్పర్జిల్లస్, పెన్సిలియం ముఖ్యమైనవి.

వీటి నుండి తయారయ్యే సేంద్రీయ అమ్లం వల్ల భూమిలో బిగుసుకుపోయి లభ్యంకాని స్థితిలో ఉన్న భాస్వరాన్ని ట్రైక్యాల్షియం ఫాస్ఫేట్, రాక్ ఫాస్ఫేట్‌లలోని భాస్వరాన్ని సేంద్రీయ రూపంలో ఉన్న భాస్వరాన్ని లభ్యమయ్యే విధంగా మారుస్తాయి. మొక్క వేళ్ళ దగ్గర వీటి చర్య చురుకుగా ఉండి జీవన క్రియకు తోడ్పడతాయి, ఫలితంగా దిగుబడి పెరుగుతుంది.

**జీవన ఎరువుల నాణ్యత:**

మంచి నాణ్యత గల జీవన ఎరువులను నమ్మకమైన సంస్థల నుండి కొనుగోలు చేయాలి. సాధారణంగా ఈ ఎరువులు తయారు చేసిన 6 నెలల వరకు నాణ్యత తగ్గదు. దీనినే గడువు సమయంగా నిర్ణయిస్తారు.





**సర్పంచ్‌లకు సూచనలు :**

- గ్రామపంచాయితీలో గ్రామ సభ జరిగినపుడు తప్పనిసరిగా మండలానికి/గ్రామానికి నిర్ణయించబడిన వ్యవసాయ అధికారి/ విస్తరణ అధికారి తప్పనిసరిగా పాల్గొనేటట్లు చూడాలి. ఎందుకంటే వ్యవసాయ శాఖ వారు వివిధ పంటలకు ఇచ్చే సూచనలు/ రాయితీలు మరియు దిగుబడులను పెంచే యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు తెలియజేయవచ్చు.
- సర్పంచ్‌లు కూడా మండలానికి/గ్రామానికి నిర్ణయించబడిన వ్యవసాయ అధికారి/ విస్తరణ అధికారితో సత్సంబంధాలు కలిగి ఉంటే వ్యవసాయానికి సంబంధించిన అన్ని విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొనవచ్చును.
- సర్పంచ్‌లు వారి గ్రామాలలో తప్పనిసరిగా ఒక చెత్తవేయు స్థలం (డంప్‌యార్డ్) ఉండేటట్లు చూసినట్లయితే గ్రామంలో ఉన్న సేంద్రియ వ్యర్థ పదార్థాలన్నింటిని ఆ డంప్‌యార్డ్‌లో కుళ్ళ బెట్టి ముందు అధ్యాయాలలో చెప్పిన విధంగా కంపోస్టును తయారుచేయవచ్చును.

ఆ కంపోస్టును తయారీలో వ్యర్ధపదార్థాలు వేయునప్పుడు కుళ్ళు స్వభావంగల (బయోడిగ్రేడబుల్) మరియు నాన్ బయోడిగ్రేడబుల్ పదార్థాలుగా విభజించి తప్పనిసరిగా నాన్ బయోడిగ్రేడబుల్ తీసివేసే విధంగా చూడాలి.

- వ్యవసాయశాఖకు సంభందించిన కార్యక్రమాలు ఉదా॥ రైతుచైతన్య యాత్రలు, పొలంబడి, లాంటివి జరిగినప్పుడు అగ్రామ సర్పంచ్, సభ్యులు ప్రజలు తప్పనిసరిగా పాల్గొనే విధంగా ఉండాలి. దానివల్లన ఈ సేంద్రీయ వ్యవసాయాన్నికి సంబంధించిన పథకాలైన......
- వర్మి కంపోస్టు తయారీ మరియు వాడు విధానం
- పచ్చిరోట్ట పైర్ల విత్తనములు రాయితీ మరియు సరఫరా వివరములు.
- జీవన ఎరువులకు సంబంధించిన విషయములు.
- జీవ క్రిమికీటక నాశనులు (బయోపెస్టిసైడ్స్) ఇంకా ఇతర వ్యవసాయశాఖ పథకముల వివరములు తెలుసుకొని పంటల దిగుబడి పెంచడానికి ఉపయోగించుకొని లాభంను పొందవచ్చు.

## గ్రామీణ విత్తనోత్పత్తి

### విత్తనం – ప్రాముఖ్యత

విత్తన స్వచ్ఛత కొనసాగించాలంటే విత్తనాలను మూడు సంవత్సరాలకు ఒకసారి నాణ్యమైన, జన్యు శుద్ధి కలిగిన విత్తనంతో మార్పిడి చేయాలి. నాణ్యమైన విత్తనం పైరు ఉత్పాదకతపై నేరుగా ప్రభావం చూపిస్తుంది. గత నలభై సంవత్సరాలుగా అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను రూపొందించి మరియు వాటిని రైతులకు అందుబాటు ధరలలో అందించడంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వ్యవసాయశాఖ, ఇతర ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు అవిరళంగా కృషి చేస్తున్నాయి. అయినప్పటికీ ప్రస్తుత విత్తన మార్పిడి రేటు 40 శాతం మాత్రమే. మిగతా 60 శాతం విత్తనాలను రైతులు తమ స్వంత పొలాల నుండి పండించిన విత్తనాలే వాడుతున్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తనాల్లోని పూర్తి ఉత్పాదక శక్తిని వినియోగించుకొని ప్రస్తుత ఉత్పత్తులను రెట్టింపు చేయాలన్న ఉద్దేశ్యంతో వ్యవసాయశాఖ రాబోయే మూడు సంవత్సరాలలో విత్తన మార్పిడి రేటును ప్రస్తుత స్థాయి నుండి వంద శాతానికి అధిగమించడానికి లక్ష్యాలను నిర్ణయించింది.

### విత్తనోత్పత్తి – ప్రమాణాలు

పంట అధిక దిగుబడికి మంచి రకం వాడటం మొదటి చర్య. మంచి విత్తనం వాడటం రెండో చర్య. విత్తనం మంచిది కాకపోతే ఆధునిక యాజమాన్య పద్ధతులను పాటించినా, హెచ్చు దిగుబడిని సాధించలేము. మంచి విత్తనాలు కొన్ని ప్రమాణాలు కలిగి ఉంటాయి.

***ఎ) జన్యు శుద్ధత***

ఒక్కొక్క రకం విత్తనాలకు, ఆ విత్తనాల నుంచి పుట్టిన మొక్కలకు ప్రత్యేకమైన స్వరూపాత్మక లక్షణాలు, స్వాభావిక లక్షణాలు ఉంటాయి. ఉదాహరణకు స్వర్ణ వరిరకం విత్తనాలు ఎరుపు రంగులో ఉంటాయి. మొక్క మొలిచింది మొదలు కోత వరకు ఆకులు ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి మనల్ని ఆకర్షిస్తాయి. అవి స్వరూపాత్మక లక్షణాలు. స్వర్ణ వరి మొక్కలు నేలలో లభించే నత్రజనిని ఎక్కువగా తీసుకొంటాయి. నీటి ఎద్దడిని, నీటి ముంపును తట్టుకొంటాయి. ఇవి స్వాభావిక లక్షణాలు. ప్రతి రకపు విత్తనం ఆ రకపు స్వరూపాత్మక, స్వాభావిక లక్షణాలను తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఆ రకం విత్తనం నాటి, ఆ పంట కోసినప్పుడు అదే రకం వడ్లు రావాలి. ఒక స్వచ్ఛమైన రకం నుంచి అదే రకం విత్తనాన్ని పొందటమే స్వచ్ఛతను నిర్ధారిస్తుంది. దీనినే జన్యు శుద్ధత లేక జన్యు స్వచ్ఛత అంటారు.

***బి) భౌతిక శుద్ధత***

విత్తనం రంగు తగ్గకూడదు. పొల్లు (తాలు), సగం నిండిన విత్తనాలు ఉండకూడదు. విత్తనాలలో మట్టిబెడ్డలు, ఇసుక, దుమ్ము, దూగర మొదలైన జడ పదార్థాలు, కలుపు విత్తనాలు, వేరే పంట

విత్తనాలు ఉండకూడదు. జడ పదార్థాలు, కలుపు విత్తనాలు, ఇతర పంట విత్తనాలు ఎంత శాతంలో ఉన్నాయో తెలియజేసినప్పుడు భౌతిక శుద్ధత స్థాయి తెలుస్తుంది. అవేవీ లేకపోతే విత్తనం పూర్తి భౌతిక శుద్ధత కలిగి ఉందని అంటారు.

### సి) తేమ శాతం

విత్తనంలో తేమ శాతం 14 కంటే ఎక్కువగా ఉంటే నిల్వ చేయటానికి పనికి రాదు. తేమ శాతం 11 కంటే తక్కువగా ఉంటే మొలకెత్తదు. 13 శాతం తేమ కలిగిన విత్తనం మంచిది.

### డి) మొలక శాతం

విత్తనం కనీసం 80 మొలక శాతం కలిగి ఉండాలి. నూటికి కనీసం 80 గింజలు మొలకెత్తాలి. 80 శాతం లేదా అంతకంటే ఎక్కువ మొలక శాతం కలిగిఉన్న విత్తనం మంచిది. మొలకశాతం పరీక్షించినప్పుడు 80 శాతం ఉండవచ్చు కాని 8 నెలల తరువాత నుంచి మొలక శాతం తగ్గుతూ ఉంటుంది. అందుచేత మొలకశాతం పరీక్షించిన తేదీ లేదా నెల విత్తనం సంచి మీద రాసి ఉంటుంది. దానిని చూచి విత్తనం కొనాలి. 8 నెలలు మించితే ఆ విత్తనం కొనకూడదు.

## విత్తన తరగతులు

రైతుల ఆదరణ పొందిన విత్తనాలను ఉత్తమ ప్రమాణాలతో ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేస్తున్నారు. విత్తనాలను మూడు (3) స్థాయిలలో ఉత్పత్తి చేస్తున్నారు. కాబట్టి విత్తనాలను 3 తరగతులుగా విభజించారు.

### బ్రీడర్స్ సీడ్

ఈ విత్తనాలు ఆయా వంగడాలు రూపొందించిన వ్యవసాయ పరిశోధనా స్థానాలలో శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్తత్తి చేస్తారు. గనుక ఇవి అత్యుత్తమ ప్రమాణాలు కలిగి ఉంటాయి. బ్రీడర్స్ సీడ్ ఉత్పత్తి తక్కువ విస్తీర్ణంలో మాత్రమే ఉత్పత్తి చేస్తారు. అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన బ్రీడర్స్ సీడ్ అందరికీ సరఫరా చేయటానికి సాధ్యం కాదు. ఈ విత్తనం యొక్క భౌతిక స్వచ్ఛత, మొలకెత్తు శాతం మరియు జన్యు స్వచ్ఛత విధిగా పసుపు వర్ణము ట్యాగ్‌పై చూపించబడి విత్తన సంచికి కుట్టబడి సీలు చేసి యుండవలెను.


### ఫౌండేషన్ సీడ్

బ్రీడర్స్ సీడ్‌ను ఉపయోగించి వ్యవసాయ పరిశోధనా స్థానాలలోను, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తూ ఉన్న విత్తనాభివృద్ధి క్షేత్రాలలో మరియు వ్యవసాయశాఖ రాష్ట్ర విత్తనోత్పత్తి ఫారంలలో ఈ ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి చేస్తారు. ఈ విత్తనాలు కూడా ఉత్తమ ప్రమాణాలు కలిగి ఉంటాయి. కొద్ది పరిమాణంలో వీటిని రైతులకు సరఫరా చేస్తున్నారు మరియు ఎక్కువ పరిమాణంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకం లో సరఫరా చేస్తారు. ఈ తరగతి విత్తనానికి తెల్లవర్ణ ట్యాగ్ విత్తన సంచికి కుట్టి సీలు వేయబడి యుండును.

### సర్టిఫైడ్ సీడ్

ఫౌండేషన్ సీడ్‌ను ఉపయోగించి రైతుల పొలాల్లో సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి చేస్తారు. సీడ్ సర్టిఫికేషన్ ఏజన్సీ వారు ఆ పొలాలను కనీసం రెండుసార్లు తనిఖీ చేస్తారు. కేళీలు లేదా బెరుకులు తీసివేసే ఏర్పాటు చేస్తారు.

విత్తనం ఆరిన తరువాత విత్తన పరీక్షా కేంద్రాలలో పరీక్ష చేయించి, నిర్దేశించిన ప్రమాణాలు కలిగిన విత్తనాలను మాత్రమే లేబిల్స్ ఇస్తారు. సీడ్ సర్టిఫికేషన్ ఏజన్సీ వారు ఇచ్చిన లేబిల్ కలిగిన విత్తనాలను సర్టిఫైడ్ సీడ్ అంటారు. నీలి వర్ణపు ట్యాగ్ సంచికి కుట్టి సీలు వేయబడి యుండును. ఈ విత్తనమును రైతులు పైరు చేయుటకు వాడుకొందురు.



ఈ తరగతులతో పాటు, మార్కెట్టులో మనకు లేబుల్ విత్తనం కూడా లభ్యమవుతుంది. ఈ విత్తనాన్ని ఎవరూ ధృవీకరించడం లేదు. దీనిని సరాసరి విత్తనోత్పత్తి దారులు వారి లేబిల్ (లేత ఆకుపచ్చ రంగు) దానిపై విత్తన ప్రమాణములను ముద్రించి అమ్మడం జరుగుతుంది. దీనిని విత్తనోత్పత్తిదారుల నమ్మకం పైననే కొనవలసి ఉంటుంది.

## విత్తనోత్పత్తిలో ముఖ్యమైన యాజమాన్య పద్ధతులు

విజయవంతంగా హైబ్రిడ్ విత్తనోత్పత్తి జరగాలంటే శాస్త్ర పరిశోధన, సాంకేతిక వ్యవసాయ పద్ధతులు మరియు విత్తనోత్పత్తికి అనుకూలమైన ప్రాంతాలను ఎన్నుకొనుట, నాణ్యమైన మూల విత్తన సేకరణ వంటి అనేక అంశాలను పరిగణనలోనికి తీసుకోవాల్సి వుంటుంది. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటి గూర్చి క్లుప్తంగా చరిచ్దాం.

### హైబ్రిడ్ విత్తనోత్పత్తికి తగిన ప్రాంతాలను ఎన్నుకోవడం

వాతావరణం పొడిగా ఉండి, అత్యధిక లేదా అత్యల్ప ఉష్ణోగ్రతలు కాకుండా మధ్యరకంగా ఉండి గాలిలో తేమ అత్యధికంగా లేని ప్రాంతాలు హైబ్రిడ్ విత్తనోత్పత్తికి అనుకూలమైనవి. ఉదయం పూట వీచేగాలి వల్ల పుప్పొడి సరఫరా జరిగి పరపరాగ సంపర్కం అధికంగా జరగడానికి వీలవుతుంది. తద్వారా దిగుబడి కూడా అధికంగా ఉంటుంది. ముఖ్యంగా జొన్న, సజ్జ పైర్లకు ఇది వర్తిస్తుంది. అలాగే పుష్పించే దశనుండి విత్తనం ఏర్పడి పక్వదశకు వచ్చేవరకు ఆకాశం మేఘావృతం కాకుండా, వర్షాలు లేకుండా ఉండే ప్రాంతాలను ఎన్నుకోవడం కూడా అత్యంత ప్రధాన విషయం. ఆకాశం మేఘావృతం అయి గాలిలో తేమ ఎక్కువ కావడం లేక వర్షాల వల్ల గాని పైన చెప్పిన పంటదశలలో అనేక రకాల పురుగులు,

శిలీంద్రము ఆశించడమే కాకుండా పుప్పొడి నష్టం వల్ల విత్తన నాణ్యత కూడా తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ విషయాలన్నిటినీ దృష్టిలో ఉంచుకుని ఏ ప్రాంతం హైబ్రిడ్ విత్తనోత్పత్తికి అనువైనదో ఎంచుకోవాలి.

### *అధిక హైబ్రిడ్ విత్తన దిగుబడి తేనెటీగల తోడ్పాటు*

తేనెటీగల ద్వారా పుప్పొడి తండ్రి వరుసల పుష్పాల నుండి తల్లి మొక్కల పుష్పాలకు తేలికగా సరఫరా చేయబడుతుంది. దీని ద్వారా దిగుబడి అధికమవడానికి అవకాశాలు ఎక్కువ. కాని పత్తి వంటి పైర్లలో క్రిమి సంహారక మందులు, కీటకనాశకాలను చల్లడం వల్ల వీటి ప్రభావం తొలి దశలోనే తేనెటీగలపైబడి అధిక సంఖ్యలో చనిపోతున్నాయి. కనుక తేనెటీగలపై ప్రభావం లేనివిధంగా సస్యరక్షణ చర్యలు తీసుకుంటే హైబ్రిడ్ విత్తన దిగుబడి అధికంగా ఉంటుంది.

### *హైబ్రిడ్ విత్తనోత్పత్తి చేసే పొలం ఇతర పంటలకు దూరంగా ఉండాలి:*

విత్తనోత్పత్తి పైరుకు చెందిన ఇతర జాతి మొక్కలు, ఇతర పైర్ల పుప్పొడి గాలివల్లగాని, కీటకాల ద్వారాగాని, తల్లివరుసలకు అందనంతదూరం ఉండేట్లు హైబ్రిడ్ విత్తనోత్పత్తి ప్లాటును ఎంపిక చేసుకోవాలి. ఈ విధంగా సంపర్కానికి పరజాతి పైర్ల అంటు సోకకుండా పాటించే కనీస దూరాన్ని ఆంగ్లంలో "ఐసోలేషన్ డిస్టెన్స్" అని చెపుతారు. సెంట్రల్ సీడ్ సర్టిఫైయింగా బోర్డ్ ప్రచురించిన "ది ఇండియన్ మినిమమ్ సీడ్ స్టాండర్డ్స్ " అనే పుస్తకంలో ప్రతి పైరు యొక్క విత్తనోత్పత్తిలో పాటించాల్సిన ఈ కనీస నిర్ణీత ఎడం గూర్చి తెలిపారు. ఉదాహరణకు సజ్జ హైబ్రిడ్ విత్తనోత్పత్తి చేసే ప్లాటుకు ఇతర జాతిపైర్ల నుండి 300 మీటర్లను "కనీస ఎడంగా" పాటించడంవల్ల దాని 'జన్యుశుద్ధత'కు ఎటువంటి లోపం జరుగదని నిర్ణయించారు.

### *ప్లాటు నుండి జబ్బు పడిన మొక్కలు, ఇతర మొక్కలను వేరుచేయడం(రోగింగ్):*

ప్లాటు అంతా తిరిగి జబ్బు మొక్కలు అదే పంటకు చెందిన ఇతర రకాల మొక్కలు, కలుపు మొక్కలు వగైరా ఉన్నాయో లేదో జాగ్రత్తగా పరిశీలించాలి. అటువంటి మొక్కలు ఉంటే వాటిని వేళ్ళతో సహా పీకివేసి ప్లాటుకు దూరంలో తగులబెట్టాలి. ఈ ఏరివేతని తల్లి, తండ్రి వరుసల మొక్కలు పుష్పించకముందే రెండు, మూడుసార్లు చేయడంవల్ల హైబ్రిడ్ విత్తనాల జన్యుశుద్ధతకు ఎటువంటి లోపం వాటిల్లదు.

### *కోత, నూర్పిడి, విత్తనశుద్ధి:*

విత్తనం పరిపక్వదశకు చేరుకునే సమయంలో మాత్రమే పంటకోతకు పూనుకోవాలి. పక్వదశ వచ్చేప్పటికి విత్తనంలో గరిష్ట పరిమాణంలో పిండి పదార్థం వృద్ధి చెందుతుంది. మొక్కలలో వచ్చే కొన్ని బాహ్యామార్పుల ద్వారా ఈ దశను గుర్తించవచ్చు. ఉదాహరణకు సజ్జలో విత్తన పక్వదశ పుష్పించిన 35 నుండి 40 రోజుల తర్వాత వస్తుంది. ఈ దశలో పంటకోత వల్ల విత్తన నాణ్యతకు, దిగుబడికి అధిక మేలు చేకూరుతుందని పరిశోధనలు తెల్పుతున్నాయి. అలాగే ప్రతి పైరుకు గూడా ఈ పక్వ దశ మొక్క పుష్పించిన తర్వాత ఎన్ని రోజులకు వస్తుందో నిర్ధారించారు.

విత్తనానికి వెలుపలకాని, లోపల కాని ఎటువంటి హాని కల్గించినటువంటి నూర్పిడి యంత్రాలను ఎంచుకుని నూర్చడం వల్ల విత్తనదిగుబడికి, నాణ్యతకు నష్టంరాదు.

తర్వాత తేమ లేకుండా విత్తనాలను ఎండబెట్టడంగాని, లేక డ్రయర్స్ (ఆరబెట్టు యంత్రాలను ఉపయోగించి, నిర్ధారించిన దానికంటే అధికంగా ఉన్న తేమను తీసివేయడంవలన ఎటువంటి కీటకాలు ఆశించకుండా నిల్వచేయడం తేలిక. ఉదాహరణకు ధాన్యాల్లో 12%, అపరాల్లో 10%, నూనె గింజలలో 9% తేమకంటే ఎక్కువ ఉండరాదు. ఈ విధంగా తేమ శాతం సరిచేసిన విత్తనాన్ని సిఫారసు చేసిన జల్లెడల ను ఉపయోగించి గ్రేడింగా చేయాలి. శుభ్రపరచిన విత్తనాలను, ఒక కిలో విత్తనాలకు 2గ్రా థైరమ్, లేదా మాంకోజెబ్ 2గ్రా. చొప్పున లేక మరేదైనా సిఫార్సు చేసిన మందునుపయోగించి విత్తనశుద్ధి చేసి గోనెసంచులలో కాని, గుడ్డ సంచులలోకాని భద్రపరచి, గిడ్డంగులలో నిర్ణయించిన ప్రమాణాలలో వాతావరణ పరిస్థితులను కల్పించి, కీటకాలు, ఎలుకలు, పక్షుల వల్ల నష్టం వాటిల్లకుండా ఎక్కువ కాలం చెడిపోకుండా భద్రంగా ఉంచవచ్చు.

పై అంశాలను ముఖ్యంగా పరిగణనలోకి తీసుకుని ఆయా పంటలకు సంబంధించిన పూర్తి శాస్త్రీయ పరిశోధనా వివరాలతో కూడిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలతో హైబ్రిడ్ విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని చేపట్టితే ఆశించిన ఫలితాలు పొందవచ్చు.

## విత్తనాల్లో మొలకశాతం తెలుసుకొనే విధానము

రైతులకు గల కొద్దిపాటి అవగాహనతో తమ పరిధిలోనే కొన్ని పద్ధతుల ద్వారా విత్తన మొలకశాతాన్ని సులభంగా తెలుసుకోవచ్చును.

***ఇసుక పద్ధతి:*** లావు పాటి గింజలుగల ఆముదము, మొక్కజన్న, పత్తి, వేరుశనగ వంటి విత్తనాలలో మొలక శాతం తెలుసుకునేందుకు వాటిని ఇసుకలో విత్తి పరీక్షించాలి. ఎత్తు అంచుగల మట్టి మూకుడుగానీ, ప్లాస్టిక్ ట్రే గానీ ఇసుకతో నింపి దానికి తగు మోతాదులో నీరుపోసి వంద విత్తనాలను లెక్కించి అంగుళం లోతులో పూడ్చి పైన ఇసుకతో కప్పాలి. ప్రతిరోజూ విత్తనానికి సరిపడా నీరు చిలకరిస్తూ ఉండాలి. విత్తన పంట రకాన్ని బట్టి 3-4 రోజులనుంచి 7-8 రోజుల్లో మొలక కనిపిస్తుంది. మొలకెత్తిన విత్తనాలను లెక్కిస్తే మొలకశాతం తెలుస్తుంది. వంద విత్తనాలను నాటినప్పుడు వాటిలో 80 విత్తనాలు మొలకెత్తితే ఆ విత్తనాలలో 80 శాతం మొలకెత్తే శక్తి ఉన్నట్లు గుర్తించాలి.

***పేపరు టవల్ పద్ధతి:*** మొలకశాతం పరీక్షకు ఉపయోగించేకాగితాన్ని (పేపర్ టవల్) తీసుకొని నీటితో తడిపి బల్లపై పరచి దీనిపై వంద విత్తనాలను పరచి దీనిపై నీటితో తడిపిన మరో కాగితాన్ని కప్పాలి.

ఈ రెండింటినీ చాప మాదిరి చుట్టి ఒక పాత్రలో ఏటవాలుగా పెట్టి తడి ఆరిపోకుండా అప్పుడప్పుడు నీటి చల్లుతుండాలి. వరి, జొన్న, పొద్దుతిరుగుతు, సోయాచిక్కుడు, శెనగ, ప్రత్తి మొదలైన విత్తనాల్లో ఈ పద్ధతిద్వారా మొలకశాతం తెలుసుకోవచ్చు.

*గుడ్డ మూట పద్ధతి:* ఒక మందపాటి బట్టను తీసుకొని నీటితో తడిపి అందులో వంద విత్తనాలు వేసి మూటగా కట్టి తడి ఆరిపోకుండా అప్పుడప్పుడు నీటిని చిలకరిస్తూ ఉండాలి. 3-4 రోజులనుంచి 7-8 రోజులలో మొలకలు మొలకలు గమనించి మొలకశాతం తెలుసుకోవచ్చు.

ఈ విధంగా రైతులు తమకు అనుకూలమైన పద్ధతి ద్వారా తాము విత్తుకునే పంట విత్తనాన్ని ముందుగా మొలకశాతం తెలుసుకుని అంతర్జాతీయ విత్తనసంస్థ ప్రమాణాల ప్రకారం వివిధ పంట విత్తనాల్లో ఉండవలసిన కనీస మొలకశాతం వచ్చినపుడు మాత్రమే విత్తనం పూర్తి జీవం కలిగి ఉందని నిర్ధారించుకుని విత్తేందుకు వాడాలి.

*టెట్రాజోలియం పరీక్ష ద్వారా విత్తన జీవ నిర్ధారణ చేయుట:* మోరే (1973) లో టెట్రాజోలియం ద్రావణంను ఉపయోగించి విత్తనము నాణ్యత ను నిర్ధారించుటను మరియు విత్తనవలో ఎంత భాగవ, ఏ యే భాగాలు రంగును కలిగియుంటే జీవమున్నవాటిగా పరిగణించాలో వివరించటం జరిగింది. మొక్కజొన్న, గోధుమ, వరి విత్తనములను టెట్రాజోలియం ద్రావణంతో పరిక్షించినపుడు నాణ్యమై విత్తనములు, వాటి మొలకెత్తు శాతంనకు సమతుల్యంగా ఉన్నట్లు నిర్ధారించబడినది.

## గ్రామీణ విత్తనోత్పత్తి పథకము

పంట యొక్క ఉత్పాదన సామర్థ్యం మరియు ఉత్పత్తికి విత్తనం అతి ముఖ్యమైన ఉపకరణం. నాణ్యమైన విత్తనముల ద్వారా నమ్మకమైన దిగుబడులు (సుమారు 20-25 శాతం వరకు ఎక్కువగా) పొందగలము.

ఇటీవల కాలంలో రైతుకు విత్తనమే ప్రధాన సమస్య అవుతోంది. తాము పండించిన పంట నుంచి తదుపరి పంటకు విత్తనాన్ని జాగ్రత్త చేసుకునే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ నిర్లక్ష్యం చూపే వారికి సమస్యలు తప్పటంలేదు.వీరు తోటి రైతులు నుంచి నారు కొనుక్కోవటమో, విత్తనాలు కొని తెచ్చి నాటడమో చేస్తుంటారు.ఫలితంగా నకిలీ విత్తన వ్యాపారులు అమాయక రైతుల్ని సులభంగా మోసం చేయగలుగుతున్నారు. ఆదిలోనే (నారుమడి దశ) విత్తనాలు కల్తీవని తేలితే ఫర్వాలేదు కానీ పంట పాలు పోసుకునే దశవరకు కల్తీని గుర్తించలేక పోతే రైతులు ఆర్థికంగా నష్టపోవలసి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల నుంచి రైతాంగం బయట పడాలంటే, విత్తనాన్ని స్వయంగా తయారు చేసుకోవటం మంచిది. లేదా తనకు బాగా తెలిసిన రైతునుంచి విత్తనాన్ని సేకరించుకోవాలి.

### *పథకం యొక్క లక్ష్యాలు:*

1. విత్తనాలు సరైన సమయానికి రైతుల ముంగిట ఉండేలా చూడడం.
2. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు విత్తనం లభించడం
3. విత్తన నాణ్యత గురించి రైతులలో నమ్మకం ఏర్పరచడం
4. విత్తన ఉత్పత్తి దారుడు మరియు వినియోగదారుడు ఇద్దరు పరస్పరం లాభం పొందడం
5. విత్తన సాగులోని రకాల గూర్చి పరిజ్ఞానాన్ని అందించడం.
6. దళారులు లేకుండా రైతే తనకు కావలసిన పరిమాణంలో తక్కువ క్షేత్ర విత్తనాన్ని పండించి వినియోగించుకోవడం.

### *పథకం అమలు విధానం:*

నాణ్యమైన విత్తనాలను రైతులే స్వయంగా తయారుచేసేందుకుగాను కేంద్ర ప్రభుత్వం 1995లో గ్రామీణ విత్తభివృద్ధి పథకం (సీడ్ విలేజ్ ప్రోగ్రాం)ను రూపొందించారు. ఈ పథకంలో మూలవిత్తనాన్ని (ఫౌండేషన్ సీడ్) రాష్ట్ర విత్తనానివృద్ధి సంస్థ లేదా వ్యవసాయ పరిశోధనా కేంద్రంవారు సరఫరా చేస్తారు. ఆ ప్రాంతంలో సాగుచేస్తున్న ముఖ్య పంటల, అధిక దిగుబడి రకాల మూలవిత్తనాన్ని వ్యవసాయాధికార్ల ద్వారా సరఫరా చేయాలి. అభ్యుదయ రైతులను ఎంపిక చేసుకుని ముందుగా శిక్షణనిచ్చి మూల విత్తనం తో పాటు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తారు. వ్యవసాయాధికార్లు, శాస్త్రవేత్తలు తరచుగా ఈ విత్తనాభివృద్ధి క్షేత్రాలను సందర్శించి సాంకేతిక విషయాలను తెలియచేస్తారు.

రైతు ఉత్పత్తిచేసిన పంటను కోసి, శుభ్రపరచి తగిన పరీక్షలు చేసి, నిల్వ ఉంచి, స్వయంగాగానీ లేదా సహకార సంఘాల ద్వారా గానీ కల్తీలేని మేలైన విత్తనాలను ఇతర రైతులకు అమ్ముకోవచ్చు. ఉత్సాహవంతులైన రైతులు విత్తనోత్పత్తిని నిర్వహిస్తే సత్ఫలితాలు సాధించి విత్తన కొరతను అధిగమించవచ్చు. గ్రామాలలో ఏ రైతులు మూల విత్తనాలను కొనుగోలుచేసి నాణ్యమైన విత్తనాలు తయారుచేసి ఏ రకంను ఎంత పరిమాణంలో సరఫరా చేస్తారనే వివరాలను వ్యవసాయాధికార్లు పత్రికలలోనూ, గ్రామాలలో ఏర్పాటుచేసిన బ్లాక్‌బోర్డుల ద్వారానూ ప్రకటిస్తారు.

### *ఈ పథకాన్ని జయప్రదంగా అమలు చేయడానికి ఈ క్రింది మార్గదర్శకాలను పాటించాలి:*

**1. రైతుల/ గ్రామముల ఎంపిక:** మండల వ్యవసాయ అధికారి మండలంలోని ఒక గ్రామం నుండి ఎంపిక చేసుకొని ఆ గ్రామంలోని కొంతమంది అభ్యుదయ రైతులను గ్రామీణ విత్తనోత్పత్తి పథకం భాగస్వాములుగా చేయుదురు.

- గ్రామంలోని రైతులలో ఏదైనా ఒక ప్రత్యేక పంటపై సరియైన అవగాహన కలిగి సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులను తీయుటలో అనుభవమున్న రైతులను ఎంపిక చేయును.
- ఎంపిక చేయబడిన గ్రామంలో విత్తనోత్పత్తి చేపట్టబడు పైరుకు అనుకూలమైన నేలలు, మరియు నీటి వసతిని కలిగి ఉండాలి.

- ✭ ఎంపిక చేయబడిన గ్రామంను మరియు విత్తన క్షేత్రములను పర్యవేక్షించుటకు వీలుగా వుండవలెను. సాంప్రదాయ పద్ధతిలో విత్తనోత్పత్తి చేయుచున్న రైతుల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వారికి ప్రాధాన్యతనిచ్చి ముందుగా వారిని ఈ పథకములో చేర్చటం జరుగుతుంది.
- ✭ సాధారణంగా, రైతు మిత్ర సంఘాలను గ్రామీణ విత్తన పథకంలో చేర్చుట ద్వారా ఈ పథకము అమలుతీరు ఆశించదగినదిగా వుంటుంది.
- ✭ ఈ పథకంలో ఒక యూనిట్ విస్తీర్ణము 10 ఎకరాలుగా వుండును. అంతకంటే ఎక్కువగా విత్తనోత్పత్తి చేయాలంటే విస్తీర్ణాన్ని ప్రతిసారి 10 ఎకరాలుగా పెంచుతూ పోవాలి.

### 2. విత్తనోత్పత్తి పైరును మరియు రకమును ఎంపికచేయుట:

- ✭ మండల వ్యవసాయ అధికారి ఆ మండలములో అధిక ప్రాధాన్యత కలిగిన పంటకు చెందిన అధిక దిగుబడి నిచ్చు రకమును గ్రామ పంచాయితీ క్రింద ఎంపిక చేయును.
- ✭ గ్రామీణ విత్తన పథకంలో ఎంపిక చేయబడిన గ్రామం ఆ గ్రామానికి అవసరమైనంత విత్తనాన్ని ఉత్పత్తి చేసి మరియు ఉత్పత్తి చేసిన మొత్తం విత్తనాన్ని ఆ ప్రాంతంలోనే అమ్మివేయాలి. అప్పుడే గ్రామీణ విత్తన పథకం ఉద్దేశ్యం నెరవేరుతుంది.
- ✭ ఎంపిక చేయబడిన పైరు రకము గుర్తింపు పొందినదైవుండి అధికోత్పత్తిని ఇచ్చేదిగా వుండాలి.

### 3. గ్రామ పంచాయితీకి అవసరమైన మూల విత్తనం (ఫౌండేషన్ సీడ్) ను సేకరించుట:

సహాయ వ్యవసాయ సంచాలకులు వారి పర్యవేక్షణలో మండల వ్యవసాయ అధికారి గ్రామ పంచాయితీలో ఎన్నిక చేయబడిన గ్రామంలో చేపట్టదలచిన విత్తనోత్పత్తి రకానికి చెందిన మూల విత్తనాన్ని లెక్కిస్తారు. ఎంతమొత్తంలో మూల విత్తనం కావాలో దానిని కమీషనర్ వ్యవసాయశాఖ, హైదరాబాద్ వారికి తెలియజేస్తారు. కమీషనర్ వారు వివిధ సంస్థల నుండి సేకరించిన మూల విత్తనాన్ని ఆయా జిల్లా కేంద్రాలలో వుంచి అక్కడ నుండి సహాయ వ్యవసాయ సంచాలకులు ద్వారా గ్రామ పంచాయితీలకు మే నెల 15వ తేదీలోపల సరఫరా చేస్తారు. మండల వ్యవసాయ అధికారి గారు మూల విత్తనాన్ని సకాలంలో రైతులకు అందేటట్లు చేసి నిర్ణయింపబడిన సమయంలో విత్తేందుకు సహాయ పడతారు.

### 4. గ్రామ పంచాయితీలో ఎన్నికైన గ్రామాలను తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ ఎజెన్సీ వద్ద నమోదు చేయుట:

- ✭ గ్రామ పంచాయితీలో ఎన్నికైన గ్రామాలను తప్పనిసరిగా తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ ఎజెన్సీ వద్ద నమోదు చేయాలి.
- ✭ విత్తనోత్పత్తి క్షేత్రాలలో విత్తనాన్ని విత్తిన వెంటనే విత్తనోత్పత్తి చేయు గ్రామము, పేర్లు, రైతు పేరు, పంట/ రకము పేరు మొదలగు వివరములతో కూడిన విషయములను తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ ఏజన్సీ, జిల్లా అధికారి గారికి తెలియచేస్తూ ఒక ప్రతిని కమీషనర్ మరియు వ్యవసాయ సంచాలకులు వారికి పంపాలి.
- ✭ మండల వ్యవసాయ అధికారి గ్రామీణ విత్తన పథకంలో ఎంపిక చేయబడిన రైతుల పేర్లను, విత్తనోత్పత్తి చేపట్టు విస్తీర్ణమును అప్లికేషన్ ఫారం నెం. 1లో తెలియజేస్తూ వారి సంతకములను సేకరించాలి.
- ✭ మండల వ్యవసాయ అధికారి తన పరిధిలో పూర్తి చేసిన అప్లికేషన్ ఫారములన్నింటిని ఫారం. నెం. 1 లో నింపి తెలుపు రంగు లేబుల్ (మూల విత్తనానికి సంబంధించినది) జతపరిచి తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ ఎజెన్సీ అధికారికి మరియు కమీషనర్ మరియు వ్యవసాయ సంచాలకులు వారికి పంటవేసిన 30 రోజులలో తెలియపరచవలెను. ఇట్లు చేయుటవలన పంట వివిధ దశలలో చేయవలసిన తనిలను సకాలంలో చేయుటకు వీలు కలుగును.
- ✭ మండల వ్యవసాయ అధికారి తెలుపురంగు లేబుల్ ప్రాముఖ్యతను రైతులకు తెలియజేయవలెను.

### 5. సంఘటిత చర్య (గ్రూపు ఆక్టివిటీ ) :

గ్రామీణ విత్తన పథకంను గ్రామ పంచాయితీ ఒక సమిష్టి బాధ్యతగా స్వీకరించినపుడు మాత్రమే ఆశించిన మేర అధిక మొత్తంలో విత్తనోత్పత్తిని చాలా కాలం వరకు కొనసాగించే అవకాశం వుంటుంది. అంతేకాక ఉత్పత్తి చేసిన ధృవీకరణ విత్తనాన్ని సహకార బ్యాంకుల ద్వారా గాని, వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా గాని రైతు సోదరులకు విక్రయించుటకు మరియు విత్తనోత్పత్తికి కావలసిన పెట్టుబడి పొందుటకు వీలు కలుగును.

### 6. విత్తన శుద్ధి:

ప్రతి డివిజన్‌లో కూడా మొబైల్ సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయుట వల్లన గ్రామీణ విత్తన పథకం ద్వారా ఉత్పత్తి చేయబడిన విత్తనమును ఆ గ్రామంలోనే శుద్ధి చేసే వీలు కలుగుతుంది.

### 7. విత్తనోత్పత్తి చేయు రైతులకు ప్రోత్సాహకాలను కల్పించుట:

- ✭ అన్ని పంటలకు చెందిన మూల విత్తనమును 50 శాతము తగ్గింపుధరకు సరఫరా చేయుట.
- ✭ రాష్ట్ర విత్తన ధృవీకరణ ఏజన్సీ వారికి చెల్లించాల్సిన సర్టిఫికేషన్, రిజిస్ట్రేషన్, క్షేత్రతనిలు, విత్తన పరీక్ష చేయుటకు చెల్లించాల్సిన రుసుము, విత్తన ధృవీకరణ సమయంలో యిచ్చే లేబుల్/ చీటీ) చార్జీలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ వారు భరించాలి.
- ✭ విత్తన క్షేత్రంలో నాణ్యమైన విత్తనోత్పత్తి కోసం చేయు కలుపు తీయుటకు అంతరకృషి చేయుటకు అవసరమైన పరికరముల ను 50 శాతము తగ్గింపు ధరతో సరఫరా చేయుట (ఈ తగ్గింపు మొత్తం రు 1000.00 ఒక యూనిట్‌కు మించరాదు).

### *8. విత్తనోత్పత్తిలో తీసుకోవలసిన మెళుకువలు గూర్చి రైతులకు శిక్షణనిచ్చుట:*

గ్రామ విత్తన పథకంలో ఎన్నుకోబడిన రైతులను విత్తనోత్పత్తి దారుడుగా పిలవబడతాడు. ఈ విత్తనోత్పత్తి దారుడు నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తి చేయటంలో అనుభవం కలిగి ఉండాలి.

సహాయ వ్యవసాయ సంచాలకులు/మండల వ్యవసాయ అధికారి గారు విత్తనోత్పత్తిదారులకు విత్తనోత్పత్తిలో తీసుకోవలసిన మెళకువలైన నాణ్యమైన విత్తనోత్పత్తికి, క్షేత్ర పరిధిలో చేయు కేళీలు ఏరివేత, పంట సస్యరక్షణ, పంటకోత, పంటనూర్పిడి, విత్తనంను ఎండబెట్టుట, శుభ్రపరుచుట, లేబుల్ కట్టుట మొదలగు వాటిమీద సరియైన అవగాహన కలుగజేయటానికి కావలసిన శిక్షణను ప్రొ॥జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వాస్త్రవేత్తల ద్వారా మరియు రైతు శిక్షణా కేంద్రంలోని అధికారుల ద్వారా "మధ్యంతర శిక్షణను" ఏర్పాటు చేయుటకు వీలు కలుగజేస్తారు.



*గ్రామీణ విత్తన పథకం విఫలమగుటకు దారితీసిన కొన్ని కారణాలు:*

- ★ పథకం గురించి రైతులకు సరైన అవగాహన లేకపోవుట.
- ★ వ్యవసాయాధికారులు గ్రామాల ఎంపిక, రైతుల (విత్తన ఉత్పత్తిదారులు) ఎంపిక చేయడంతోపాటు పంట సాగులో శిక్షణ, సూచనలివ్వడంలో ఆలస్యం చేయడం.
- ★ పథకానికి విస్తృత ప్రచారం కొరవడటంతో ఇతర రైతులెవరూ ఉత్పత్తిదారుల నుంచి విత్తనాలు కొనుగోలు చేయలేకపోవటం.
- ★ విత్తనోత్పత్తి చేసే రైతులను ప్రోత్సహించకపోవడం,
- ★ పలు పంటలలో క్రితం సంవత్సరం అల్ప దిగుబడినిచ్చిన విత్తనాన్ని ఉత్పత్తి చేసేందుకు రైతులెవరూ ముందుకు రాకపోవటం.
- ★ ఉత్పత్తి చేసిన విత్తనంను వెంటనే అమ్ముకోలేక పోవటం (బై బాక్ సౌకర్యం లేకపోవుట)
- ★ శుద్ధి చేసే ప్లాంట్స్ అందుబాటులో లేకపోవుట.
- ★ పండించిన విత్తనాన్ని సక్రమమైన పద్ధతులలో నిలవ చేయు సౌకర్యాలు లేకపోవుట.

గ్రామసర్పంచ్ చేపట్టవలసిన అంశాలు

- ★ గ్రామంలో ఏ విత్తనం అధికంగా పండిస్తున్నారో తెలుసుకొని, ఆ విత్తనముకు సంబంధించిన వ్యవసాయ శాస్త్రవేత్తలను గ్రామానికి ఆహ్వానించి ఆ విత్తన ఉత్పత్తిలో రైతులకు మెళకువలు తెలియజేయుట.
- ★ మిగతా విత్తనాల గూర్చి కూడా శాస్త్రవేత్తలను గ్రామానికి ఆహ్వానించి లేక రైతులనే సంబంధిత పరిశోధనా స్థానానికి తీసుకువెళ్ళి ఆ విత్తన ఉత్పత్తి గురించి అవగాహన కల్పించుట.
- ★ విత్తన పరిశోధనా సంస్థలతో మరియు జిల్లాలో వ్యవసాయ అధికారులతో విత్తన ఉత్పత్తి గురించి సంప్రదించుట.

## గ్రామీణ విత్తనోత్పత్తి

*విత్తనం – ప్రాముఖ్యత:*

విత్తన స్వచ్ఛత కొనసాగించాలంటే విత్తనాలను మూడు సంవత్సరాలకు ఒకసారి నాణ్యమైన, జన్యు శుద్ధి కలిగిన విత్తనంతో మార్పిడి చేయాలి. నాణ్యమైన విత్తనం పైరు ఉత్పాదకతపై నేరుగా ప్రభావం చూపిస్తుంది. గత నలభై సంవత్సరాలుగా అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను రూపొందించి మరియు వాటిని రైతులకు అందుబాటు ధరలలో అందించడంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వ్యవసాయశాఖ, ఇతర ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు అవిరళంగా కృషి చేస్తున్నాయి. అయినప్పటికీ ప్రస్తుత విత్తన మార్పిడి రేటు 40 శాతం మాత్రమే. మిగతా 60 శాతం విత్తనాలను రైతులు తమ స్వంత పొలాల నుండి పండించిన విత్తనాలే వాడుతున్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తనాల్లోని పూర్తి ఉత్పాదక శక్తిని వినియోగించుకొని ప్రస్తుత ఉత్పత్తులను రెట్టింపు చేయాలన్న ఉద్దేశ్యంతో వ్యవసాయశాఖ రాబోయే మూడు సంవత్సరాలలో విత్తన మార్పిడి రేటును ప్రస్తుత స్థాయి నుండి వంద శాతానికి అధిగమించడానికి లక్ష్యాలను నిర్ణయించింది.

## విత్తనోత్పత్తి – ప్రమాణాలు

పంట అధిక దిగుబడికి మంచి రకం వాడటం మొదటి చర్య. మంచి విత్తనం వాడటం రెండో చర్య. విత్తనం మంచిది కాకపోతే ఆధునిక యాజమాన్య పద్ధతులను పాటించినా, హెచ్చు దిగుబడిని సాధించలేము. మంచి విత్తనాలు కొన్ని ప్రమాణాలు కలిగి ఉంటాయి.

*ఎ) జన్యు శుద్ధత :*

ఒక్కొక్క రకం విత్తనాలకు, ఆ విత్తనాల నుంచి పుట్టిన మొక్కలకు ప్రత్యేకమైన స్వరూపాత్మక లక్షణాలు, స్వాభావిక లక్షణాలు ఉంటాయి. ఉదాహరణకు స్వర్ణ వరిరకం విత్తనాలు ఎరుపు రంగులో ఉంటాయి. మొక్క మొలిచింది మొదలు కోత వరకు ఆకులు ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి మనల్ని ఆకర్షిస్తాయి. అవి స్వరూపాత్మక

లక్షణాలు. స్వర్ణ వరి మొక్కలు నేలలో లభించు నత్రజనిని ఎక్కువగా తీసుకొంటాయి.

నీటి ఎద్దడిని, నీటి ముంపును తట్టుకొంటాయి. ఇవి స్వాభావిక లక్షణాలు. ప్రతి రకపు విత్తనం ఆ రకపు స్వరూపాత్మక, స్వాభావిక లక్షణాలను తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఆ రకం విత్తనం నాటి, ఆ పంట కోసినప్పుడు అదే రకం వడ్లు రావాలి. ఒక స్వచ్ఛమైన రకం నుంచి అదే రకం విత్తనాన్ని పొందటమే స్వచ్ఛతను నిర్ధారిస్తుంది. దీనినే జన్యు శుద్ధత లేక జన్యు స్వచ్ఛత అంటారు.

*బి) భౌతిక శుద్ధత :*

విత్తనం రంగు తగ్గకూడదు. పొల్లు (తాలు), సగం నిండిన విత్తనాలు ఉండకూడదు. విత్తనాలలో మట్టిబెడ్డలు, ఇసుక, దుమ్ము, దూగర మొదలైన జడ పదార్థాలు, కలుపు విత్తనాలు, వేరే పంట విత్తనాలు ఉండకూడదు. జడ పదార్థాలు, కలుపు విత్తనాలు, ఇతర పంట విత్తనాలు ఎంత శాతంలో ఉన్నాయో తెలియజేసినప్పుడు భౌతిక శుద్ధత స్థాయి తెలుస్తుంది. అవేవీ లేకపోతో విత్తనం పూర్తి భౌతిక శుద్ధత కలిగి ఉందని అంటారు.

*సి) తేమ శాతం :*

విత్తనంలో తేమ శాతం 14 కంటే ఎక్కువగా ఉంటే నిల్వ చేయటానికి పనికి రాదు. తేమ శాతం 11 కంటే తక్కువగా ఉంటే మొలకెత్తదు. 13 శాతం తేమ కలిగిన విత్తనం మంచిది.

*డి) మొలక శాతం :*

విత్తనం కనీసం 80 మొలక శాతం కలిగి ఉండాలి. నూటికి కనీసం 80 గింజలు మొలకెత్తాలి. 80 శాతం లేదా అంతకంటే ఎక్కువ మొలక శాతం కలిగిఉన్న విత్తనం మంచిది. మొలకశాతం పరీక్షించినప్పుడు 80 శాతం ఉండవచ్చు కాని 8 నెలల తరువాత నుంచి మొలక శాతం తగ్గుతూ ఉంటుంది. అందుచేత మొలకశాతం పరీక్షించిన తేదీ లేదా నెల విత్తనం సంచి మీద రాసి ఉంటుంది. దానిని చూచి విత్తనం కొనాలి. 8 నెలలు మించితే ఆ విత్తనం కొనకూడదు.

## విత్తన తరగతులు

రైతుల ఆదరణ పొందిన విత్తనాలను ఉత్తమ ప్రమాణాలతో ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేస్తున్నారు. విత్తనాలను మూడు (3) స్థాయిలలో ఉత్పత్తి చేస్తున్నారు. కాబట్టి విత్తనాలను 3 తరగతులుగా విభజించారు.

## బ్రీడర్స్ సీడ్

ఈ విత్తనాలు ఆయా వంగడాలు రూపొందించిన వ్యవసాయ పరిశోధనా స్థానాలలో శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్తత్తి చేస్తారు. గనుక ఇవి అత్యుత్తమ ప్రమాణాలు కలిగి ఉంటాయి. బ్రీడర్స్ సీడ్ ఉత్పత్తి తక్కువ విస్తీర్ణంలో మాత్రమే ఉత్పత్తి చేస్తారు. అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన బ్రీడర్స్ సీడ్ అందరికీ సరఫరా చేయటానికి సాధ్యం కాదు. ఈ విత్తనం యొక్క భౌతిక స్వచ్ఛత, మొలకెత్తు శాతం మరియు జన్యు స్వచ్ఛత విధిగా పసుపు వర్ణము ట్యాగ్‌పై చూపించబడి విత్తన సంచికి కుట్టబడి సీలు చేసి ఉండాలి.

## ఫౌండేషన్ సీడ్

బ్రీడర్స్ సీడ్‌ను ఉపయోగించి వ్యవసాయ పరిశోధనా స్థానాలలోను, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తూ ఉన్న విత్తనాభివృద్ధి క్షేత్రాలలో మరియు వ్యవసాయశాఖ రాష్ట్ర విత్తనోత్పత్తి ఫారంలలో ఈ పౌండేషన్ సీడ్ ఉత్పత్తి చేస్తారు. ఈ విత్తనాలు కూడా ఉత్తమ ప్రమాణాలు కలిగి ఉంటాయి. కొద్ది పరిమాణంలో వీటిని రైతులకు సరఫరా చేస్తన్నారు మరియు ఎక్కువ పరిమాణంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో సరఫరా చేస్తారు. ఈ తరగతి విత్తనమునకు తెల్లవర్ణ ట్యాగ్ విత్తన సంచికి కుట్టి సీలు వేయబడి యుండును.

## సర్టిఫైడ్ సీడ్

ఫౌండేషన్ సీడ్‌ను ఉపయోగించి రైతుల పొలాల్లో సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి చేస్తారు. సీడ్ సర్టిఫికేషన్ ఏజన్సీ వారు ఆ పొలాలను కనీసం రెండుసార్లు తనిఖీ చేస్తారు. కేడీలు లేదా బెరుకులు తీసివేసే ఏర్పాటు చేస్తారు.

విత్తనం ఆరిన తరువాత విత్తన పరీక్షా కేంద్రాలలో పరీక్ష చేయించి, నిర్దేశించిన ప్రమాణాలు కలిగిన విత్తనాలను మాత్రమే లేబిల్స్ ఇస్తారు. సీడ్ సర్టిఫికేషన్ ఏజన్సీ వారు ఇచ్చిన లేబిల్ కలిగిన విత్తనాలను సర్టిఫైడ్ సీడ్ అంటారు. నీలి వర్ణపు ట్యాగ్ సంచికి కుట్టి సీలు వేయబడి యుండును. ఈ విత్తనమును రైతులు పైరు చేయుటకు వాడుకొందురు.

ఈ తరగతులతో పాటు, మార్కెట్టులో మనకు లేబుల్ విత్తనం కూడా లభ్యమవుతుంది. ఈ విత్తనాన్ని ఎవరూ ధృవీకరించడం లేదు. దీనిని సరాసరి విత్తనోత్పత్తి దారులు వారి లేబిల్ (లేత ఆకుపచ్చ రంగు) దానిపై విత్తన ప్రమాణాను ముద్రించి అమ్మడం జరుగుతుంది. దీనిని విత్తనోత్పత్తిదారుల నమ్మకం పైననే కొనవలసి ఉంటుంది.

## వ్యవసాయాభివృద్ధి ప్రణాళిక

వ్యవసాయం గ్రామీణ ప్రాంతాలలోని 70 శాతం పైగా ప్రజల జీవనాధారం. వ్యవసాయం దాని అనుబంధ పరిశ్రమలైన పాడిపరిశ్రమ, పశుపోషణ, పండ్లు, కూరగాయులు, పూలపెంపకం, మల్బరీసాగు, చేపలు మరియు కోళ్ళ పెంపకం లాంటి వివిధ వృత్తులు అత్యధిక జనావళికి జీవనోపాధి కల్పిస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆయా పరిశ్రమల అభివృద్ధిపై శ్రద్ధ వహించి అనేక రాయితీలు, ప్రోత్సాహాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ క్రిషివికాస్ యోజన అనే కార్యక్రమాన్ని 2007 వ సంవత్సరం నుండి అమలుచేస్తు వుంది.

*పథకం ఉద్ధేశ్యము :*

1. 11వ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ మరియు అనుబంధ పరిశ్రమల ద్వారా 4 శాతం వార్షిక అభివృద్ధిని సాధించి తద్వారా 9 శాతం నికర జాతీయ ఉత్పత్తి (జి.డి.పి.)ని సాధించడం.
2. జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో క్రమపద్ధతిలో ప్రణాళికల రూపకల్పన.
3. ప్రధానమయిన మరియు ముఖ్యమయిన పంటలలో ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం.
4. వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ వృత్తులలో అత్యధిక దిగుబడులు సాధించుటలో రైతులకు సహకరించడం.
5. సమగ్ర దృక్పధముతో వివిధ వ్యవసాయ ఉత్పత్తుల యొక్క దిగుబడులు పెంచడం అలాగే వాటి నాణ్యతను పెంపొందించడం.
6. వ్యవసాయ మరియు అనుబంధ పరిశ్రమలలో ప్రజల భాగస్వామ్యాన్ని మరియు పెట్టుబడులను పెంచడం.

***ఈ పథకానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రింది పథకాలను అమలుచేస్తుంది.***

1. పొలంబడి
2. మిషన్ ప్రాజెక్టు
3. మాడల్ ప్రదర్శనా క్షేత్రాలు
4. గ్రామ విత్తనోత్పత్తి కార్యక్రమం
5. రైతుబాట
6. రాయితీపై విత్తనం, ఎరువులు మరియు పురుగు, తెగుళ్ళ మందుల సరఫరా
7. ప్రకృతి విపత్తులు సంభవిస్తే పంటనష్ట పరిహారం
8. పంటల భీమా
9. ఆధునిక వ్యవసాయ పనిముట్లు సరఫరా
10. పనిముట్ల రిపేరు కేంద్రాలు
11. శ్రీవరిసాగు
12. వరిలో నేరుగా విత్తయం వేయు పద్ధతి
13. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు

వ్యవసాయ శాఖ పై కార్యక్రమాలను జిల్లా వారీగా, మండల వారీగా, గ్రామాల వారీగా విభజించి అవసరమయిశ్రీన ప్రాంతాలకు అవసరమైన పథకాలను అందించే ఏర్పాటు చేసియున్నారు. కావున గ్రామసర్పంచ్ మరియు సభ్యులు ఎప్పటికప్పుడు గ్రామ, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి అవసరమయిన రైతు సోదరులకు తగిన సమయంలో ఆయా సదుపాయాలు అందించుటకు కృషి చేయవలసిన అవసరం వుంది.



*తొందరగా పూర్తిచేయగలుగుతారు.*

★ గిరిజన తాండాలలో శ్మశాన వాటికల నిర్మాణం కోసం సరిపడ స్థలంను గుర్తించాలి.

★ గిరిజన తాండాలలో శ్మశాన వాటికల కోసం స్థలం లేనిచో స్థలం ఏర్పరచుట కొరకు తహసిల్‌దార్‌వారిని కోరవలెను.

★ గిరిజన తాండాలలో శ్మశాన వాటికలను చదును చేసి అవసరమైన సదుపాయాలు కల్పించుటకు కృషి చేయాలి.

★ గిరిజన తాండాలలో పౌరులందరు శ్మశాన వాటికను ఉమ్మడి ఆస్తిగా గుర్తించుటకు ప్రోత్సహించాలి.

★ సూర్యోదయం తరువాత వీధిదీపాలు వెలిగితే విద్యుత్ వృధా అవుతుంది. వీధిదీపాలు రాత్రి పూట మాత్రమే వెలిగేలా చూడాలి.

★ తక్కువ విద్యుత్ వాడుకతో వెలిగే బల్బులు అనగా సి.ఎఫ్.ఎల్./ ఎల్.ఇ.డి. బల్బులను గ్రామంలో అన్ని ఇండ్లలో వాడేటట్లు అవగాహన కల్పించాలి.

★ అవసరమైతే సౌరవిద్యుత్ దీపాలు ఏర్పాటు తచేయాలి.

★ గ్రామ పంచాయతీ కొనుగోలు చేసిన వీధిదీపాలు సక్రమంగా వాడేటట్లు చూడాలి.

★ వీధిదీపాలు దొంగిలించుటను అరికట్టాలి.

★ గ్రామపంచాయతీలో పగటిపూట వీధిదీపాలు వెలుగుచున్నట్లయితే 3వ వైరు ఏర్పాటు చేసి వీధిదీపాలు వెలుగుట/బందుచేయుటకు వీలు కల్పించాలి.

★ విద్యుత్ చౌర్యాన్ని మరియు అధిక బిల్లులను అరికట్టుటకు వీధిదీపాలకు మీటర్లను బిగించాలి.

★ ప్రజలకు సౌకర్యంగా ఉండేలా కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేలా చూడాలి.

★ గ్రామ ప్రజలు విద్యుత్ పొదుపు గురించి తెలిపి విద్యుత్ పొదుపు చేయు ఉపకరణాలు వాడుటకు అవగాహన కల్పించాలి.

★ గ్రామంలోని పౌరులందరు శ్మశాన వాటికను ఉమ్మడి ఆస్తిగా గుర్తించుటకు ప్రోత్సహించాలి.

***– జి.జయపాల్ రెడ్డి,*** *టిసిపార్డ్*

# సహజ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటి

**సహజవనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ క్రింది వారితో కూడి ఉంటుంది.**

- ✭ సర్పంచుగారు ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉంటారు.
- ✭ ఒకరు లేక ఇద్దరు లేక ముగ్గురు పంచాయతీ వార్డు (సభ్యుల సంఖ్యను బట్టి) సభ్యులుగా ఉంటారు.
- ✭ స్వయం సహాయక సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ✭ స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధి లేక కుల సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ✭ సహజ వనరుల యాజమాన్య విషయములో నిష్ణాతులైన విశ్రాంత అధికారి ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ✭ పంచాయతీ లోని ఉపాధిహామి కార్యక్రమ క్షేత్ర సహాయకులు సభ్య సమావేశకర్తగా ఉంటారు.

- ✳ ఇంతకు ముందు చెప్పబడిన విధంగా సభ్యులతో సర్పంచుగారు ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉంటారు.
- ✳ భద్రతా పరమైన పర్యావరణవ కల్పించటానికి అవసరమైన సహజ వనరులపై ఈ కమిటీ దృష్టి సారించాలి. సుస్థిరమైన వ్యవసాయానికి మరియు జీవనోపాధికి సహజ వనరులను సరైన పద్దతిలో నిర్వహించుట చాలా అవసరం. ప్రకృతి వనరులను ఇష్టం వచ్చిన రీతిలో వినియోగించుకోవటం వలన భూ సారము తగ్గిపోవడం, భూగర్భ జలాల స్థాయిలు పడిపోవడం, అడవులు అంతరించిపోవడం ఫలితంగా చివరకు వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. అందుకనే ప్రకృతిని పూర్వ స్థాయికి తీసుకు రావడానికి, ప్రస్తుతం సహజ వనరుల నిర్వహణ సరైన పద్ధతిలో జరగాలి.



- ✳ నేల మరియు నీటి సంరక్షణ కొరకు తీసుకోవలసిన చర్యలను మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం MGNREGS మరియు ఏకీకృత నీటి యాజమాన్య కార్యక్రమం IWMP క్రింద చేయు పనులలో చేర్చాలి.
- ✳ MGNREGS పథకం సహాయ ప్రోగ్రాము అధికారితో మరియు IWMP పథకం ప్రోగ్రాం అధికారితో, క్షేత్ర సహాయకులతో మరియు వాటర్ షెడ్ సహాయకులతో ఈ కమిటీ విస్తారమైన సమన్వయంతో పనిచేయాలి.

***సహజ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ లక్ష్యాలు :***

- ✳ తెలంగాణాకు హరిత హారంలో 100 శాతం మొక్కలు నాటుట.
- ✳ గ్రామీణ ఉపాధి హామీ పథకం శ్రామిక బడ్జెట్‌ను 100 శాతం వినియోగం అయ్యేలా చూచుట.

***తెలంగాణాకు హరిత హారంలో 100 శాతం మొక్కలు నాటుట కొరకు చేయవలసిన కార్యక్రమాలు***

- హరిత హారంలో మొక్కలు నాటుటకు కావలసిన స్థలాలను గుర్తించుట.
- కావలసిన మొక్కల రకాలను మరియు సంఖ్యను అంచనా వేయాలి.
- ఏ రకం మొక్కలు ఏ నర్సరీలో దొరుకుతాయో గుర్తించాలి.
- మనకు కావలసిన మొక్కలను దగ్గరలోని నర్సరీ నుంచి తెచ్చుకొనుటకు ప్రయత్నించాలి.
- మొక్కల సంఖ్యల ప్రకారం గుంతలు తవ్వించాలి.
- నర్సరీ నుంచి గ్రామాలకు మొక్కలను తరలించుటకు కావలసిన ప్రణాళిక వేయాలి.
- ప్రతి గృహస్తు తన ఇంటి ఆవరణలో ఒక పండ్ల చెట్టును నాటేలా అవగాహన పెంచాలి.
- వర్షాకాలంలో వర్షాలు పడు సమయంలో మొక్కలు నాటాలి.
- నాటిన మొక్కలు ఎక్కువ శాతం జీవించేలా నీటిని పొయ్యాలి.
- మొక్క చుట్టు అవసరమైతే రక్షణ కోసం కంచె వేయించాలి.
- ప్రతి సమావేశంలో నాటిన మొక్కల వివరాలపై సమీక్ష చేయాలి.

***గ్రామీణ ఉపాధి హామీ పథకం శ్రామిక బడ్జెట్‌ను 100 శాతం వినియోగం అయ్యేలా చూచుటకు చేయవలసిన కార్యక్రమాలు***

- ✳ గ్రామంలో ఉపాధి హామీలో పనిచేసేవారందరికీ కార్డులు జారీ అయ్యేలా చూడాలి.

| క్రమ సంఖ్య | కార్యక్రమము | ఆశించు ఫలితం లేక పరిణామం |
|---|---|---|
| 1 | నేల సంరక్షణ పనులు చేపట్టుట | నేల కోతకు గురికాకుండా అడ్డుకోగలగడం |
| 2 | బావుల మరియు బోరుబావుల చుట్టు నీటి సంరక్షణ పనులు చేపట్టుట | భూ గర్భజలాల స్థాయిలను మరియు నేలలో తేమను పెంచగలగడం |
| 3 | తెలంగాణాకు హరిత హారము ద్వారా రాబోవు మూడు సంవత్సరాలకు, యేటా 40 వేల మొక్కలను నాటి, అవి ఎక్కువగా జీవించి ఉండేలా చూడడం | హరిత గ్రామంగా మారి మంచి పర్యావరణమును సాధించ గలగడం |
| 4 | సహజ వనరుల నిర్వహణకు దోహద పడి కలకాలం ఉండే ఆస్తుల పనుల జాబితాతో ప్రజలకు మరియు పంచాయతీకి ఉపయోగ పడతాయి | కలకాలం ఉండే ఆస్తుల నిర్మాణంతో బాటు ఉపాధి కల్పన పొందగలగడం. |
| 5 | గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ కూలీలకు తొందరగా వేతనాలు చెల్లించేలా చూచుట | వేతనాలు తొందరగా చెల్లింపులలో సహకరించ గలగడం. |
| 6 | ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుట | గ్రామంలో ద్రవ వ్యర్థాలను తొలగించుట |
| 7 | మరుగు దొడ్లు మరియు స్నానాల గదుల నిర్మాణం చేపట్టుట. | మంచి ఆరోగ్యకర మరుగదొడ్ల వాడకం |

* గ్రామంలో ఉపాధి హామీ కార్డు దారులలో కోరిన వారికి పని కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేయాలి.
* కోరిన వారికి పని కల్పించేందుకు ఉపాధి హామీ పథకంలో తగినన్ని పనుల జాబితా సిద్ధంగా ఉంచుకోవాలి.
* ఉపాధి హామీ పథకంలో పని చేసిన వారికందరికీ సరైన సమయంలో వేతనాలు చెల్లించుటకు చర్యలు తీసుకోవాలి.
* ఉపాధి హామీ పథకంలో కలకాలం నిలిచే పనులను చేపట్టటం ద్వారా కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించేలా ఏర్పాట్లు చేయాలి.



* మొక్కలకు నీరు పోయటం మరియు సంరక్షణ వలన ఎక్కువ బ్రతికించటానికి చర్యలు చేపట్టాలి.
* పొలాలలోను, గట్లపైన, సామాజిక భూమిలో మరియు చెరువు తీరాల వెంట మొక్కలన నాటాలి.
* అడవుల పెంపకం, రోడ్ల వెంట పండ్ల చెట్లను నాటడం.
* వాటర్ షెడ్ నిర్వహణ పనులు - MGNREGS మరియు IWMP పథకాలలో నేల మరియు నీటి సంరక్షణ పనులు (శిఖరము నుండి పల్లం వరకు) చేపట్టాలి.
* మిషన్ కాకతీయ కార్యక్రమలో భాగంగా పూడిక తీసిన చెరువులను రక్షించుట
* సాంప్రదాయ నీటి వనరులైన చెరువులకు పూర్వవైభవమును తీసుకు వచ్చుటకు మిషన్ కాకతీయ కార్యక్రమానికి ఈ పనులను సమర్థవంతంగా జతచేయవచ్చును.
* MGNREGS కార్యక్రమములో పనుల జాబితా తయారు చేయునపుడు సహజ వనరుల నిర్వహణ పనులను ఎక్కువగా తీసుకొనుటలో దృష్టి సారించాలి.

*- లింబగిరి స్వామి, సిడిపిఒ, టి.సిపార్డ్*

# ఇందిర జలప్రభ

## ముఖ్య ఉద్దేశ్యము

ఈ పథకం నందు పంచాయితీలలో మిగులు భూములు సీలింగ్ చట్టం ద్వారా సేకరించిన భూమికి భూమి లేని పేద, దళిత గిరిజన కుటుంబాలకు పంపిణీ చేయుట జరిగినది. అందరికీ బ్రతుకుమీద క్రొత్త భరోసాను కలిగించి సమాజంలో గుర్తింపును ఇచ్చే ప్రయత్నం చేయుట జరిగినది. కేవలం భూమి ఇస్తే సరిపోదు.

సాగుకు అనుకూలంగా లేని భూమిలో ఎంత కష్టపడి పనిచేసినా ఫలితం ఏమి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పించి, పని ద్వారా ఉపాధి కల్పిస్తూ పేద రైతుల పొలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. దీనిలో భాగంగా బీడు భూములకు సాగు నీరు అందించే ఉద్దేశ్యంతో ఇందిర జలప్రభ పథకాన్ని రూపొందించి అమలు చేస్తున్నారు.

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజల సంక్షేమానికి ఉద్దేశించి నాబార్డు మరియు 156 ఉమ్మడి నిధులలో బడ్జెట్‌తో ఇందిర జల ప్రభ పథకానికి శ్రీకారం చుట్టింది. అక్టోబర్ 20 న ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం జంగాల పల్లిలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రీల జయంతి రోజున ప్రారంభం కావటం జరిగింది. ఈ పథకం నందు 2.65 లక్షల ఎకరాలకు నీరందించడం ద్వారా 1.43 లక్షల ఎస్.సి/ఎస్.టి కుటుంబాలకు లబ్ధి చేకూర్చుటకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది.

ఇందిర జలప్రభ పథకం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 5.65 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొనిరావలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. తొలివిడతగా ఇందిర జలప్రభ పథకం క్రింద 2.65 లక్షల ఎకరాలు 9 జిల్లాలలో అభివృద్ధి చేయటం జరుగుతుంది.

ఇందిర ప్రభ అమలులోని లోపాలు ఈ పథకంలో మళ్ళీ దొర్లకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. కేవలం భూ పంపిణీ మాత్రమే కాకుండా పంపిణీ చేసిన భూములను సేద్యానికి అనువైనవిగా మార్చుటానికి అవసరమయిన అన్నివసతులనూ ఈ కార్యక్రమం క్రింద సమకూర్చటానికి నిబంధనలు రూపొందించారు.



ఇందిర జలప్రభ పథకం క్రింద సాగునీటి వసతితో పాటు బిందు సేద్య పరికరాలను రైతులకు సమకూర్చటానికే సుమారు 30% ఇ.జి.యస్ నిధులు మరియు 70% వారి సబ్సిడీ వ్యయం కాగల వని ఒక అంచనా. ఇందిర జలప్రభ కార్యక్రమంలో అభివృద్ధి చేసే భూములకు నీటి వసతి కలిగించటానికి ఎకరానికి రూ. 16000/- లు ఖర్చు చేయనున్నారు. ప్రతి 10.250 ఎకరాలను ఒక బ్లాకుగా తీసుకుని అభివృద్ధిపరుస్తారు. ప్రతీ పది ఎకరాలకు ఒక బోరు బావిని త్రవ్వుతారు. ఈ బావికి విద్యుత్ సౌకర్యం కల్పించి, మోటారు పంప్ సెట్ అమర్చుటానకి అవసరమయిన నిధులను ప్రభుత్వం సమకూర్చుతుంది.

ప్రతీ బ్లాకులో లేదా బోర్ వెబ పరిధిలో కనీసం ఇద్దరు లబ్ధిదారులు ఉండేలా చూడటంతో పాటు ఎంపిక చేయబడిన బ్లాకులోని లబ్ధిదారులతో ఒక కామ్‌లో ఇంట్రస్ట్ గ్రూప్‌ను ఏర్పరుస్తారు. ప్రతి బోర్ వెబ్‌కు ఒక బోర్‌వెల్ యూజర్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తారు. ఏదేని బోర్‌వెల్ వైఫల్యం చెందినట్లయితే ఆ బోర్‌వెల్ యూజర్ గ్రూపును ఇతర బోర్‌వెల్ యూజర్ గ్రూపులతో అనుసంధానించి రైతుకు నీటి వసతి కల్పించబడేలా చర్యలు తీసుకుంటారు.

ప్రతి యూజర్ గ్రూపుకు ఒక లీడల్ ఉండేలా శ్రద్ధవహిస్తారు. బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే సత్సంకల్పంతో ప్రభుత్వమే సాగునీటి వసతితో పాటు, బిందు సేద్య పరికరాలు, విద్యుత్ కనెక్షన్ సౌకర్యం కల్పిస్తుండటంతో లబ్ధిదారులు తమ భూములను ఇతరులకు అమ్మకుండా లబ్ధిదారులే ఆ ఫలాలను అనుభవించాలని ప్రభుత్వం ఆశిస్తుంది.

ఇందిర జలప్రభ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తారు. లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం అత్యంత జాగ్రత్తతో వ్యవహరి స్తోంది. ముందస్తు ప్రణాళికలో పథకం అమలు జరిగే ప్రదేశాలలోని షెడ్యూల్డు, కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజలకు చెందిన భూమి వినియోగవివరాలను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేకంగా సేకరించి, మొత్తం సమాచారాన్ని కంప్యూటరీకరించారు. గతంలో అమలు చేసిన ఆర్.ఐ.డి.ఎఫ్ 13, ఆర్.ఐ.డి.ఎఫ్ 14 ఇందిర జలప్రభలలో అభివృద్ధి పరిచిన భూములను ఈ ఇందిర జలప్రభ ప్రాజెక్టు అమలుకు లబ్ధిదారుల ఎంపికకు ప్రాధాన్యతలను కూడా ప్రభుత్వం నిర్దేశించింది.

### లబ్ధిదారుల భూముల ఎంపికను ప్రాధాన్యతలు

* ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.యస్ భూ వినియోగ సమాచార సర్వే ఆధారంగా ఇప్పటికే పనులు పూర్తి చేసి అభివృద్ధి పరచిన ఎస్సీ, ఎస్టీ రైతుల భూములు
* సర్వేలో గుర్తించబడిన వ్యవసాయయోగ్యమైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల భూములు

* మెట్ట ప్రాంత ఉద్యానవన పంటలు, ఇరిగేటెడ్ డ్రై క్రాప్స్ వేయటానికి అనువుగా అభివృద్ధి పరచబడిన ఎస్సీ, ఎస్టీల భూములు
* ఐ.టి.డి.ఎ పరిధిలో విద్యుత్ సౌకర్యం కల్పించటానికి అనుకూల యోగ్యమైన గిరిజనుల భూములు
* ఆర్.ఓ.ఎఫ్.ఆర్ అటవీ భూములు

ఇందిర జలప్రభ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో వేగవంతంగా, సమర్ధవంతంగా అమలు చేయటానికి కూడా ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేయటానికి కూడా ప్రభుత్వం, క్షేత్రస్థాయి అధికారులకు ప్రత్యేక అధికారాలు ఇచ్చింది. భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నదీ లేనిదీ తెలుసుకోవటానికి సమగ్ర సర్వే జరపటానికి జియాల జిస్టుల సేవలు వినియోగించుకోవటానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థలకు అనుమతి ఇచ్చింది. భూగర్భజలాలు అందుబాటులో ఉన్నదీ లేనిదీ తెలుసుకోవటానికి సమగ్ర సర్వే జరపటానికి జియాలజిస్టులు సేవలు వినియోగించుకోవటానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థలకు అనుమతి ఇచ్చింది.

డిసెంబర్ 15 నాటికి ఎంపిక చేయబడిన బ్లాకులలో ఈ జియో హైడ్రలాజికల్ సర్వేలను పూర్తి చేయటానికి కసరత్తు ఇప్పటికే మొదలు అయింది. సర్వే జరిగే సమయంలో కూడా లబ్దిదారులతో కూడిన కనీసం 2 కామన్ ఇంట్రస్టు గ్రూపుల భాగస్వామ్యం తప్పనిసరి చేసింది. బోర్‌వెల్సు నిర్మాణంతో పాటే భూగర్భ జలాల రీచార్జి నిర్మాణాలను కూడా తప్పనిసరిగా చేపట్టాలి. అందువల్ల వినియోగిస్తున్న భూగర్భ జలాలను ఎంతో కొంత మళ్ళీ పునరుత్పాదన చేయవచ్చు.

***ఇందిర జలప్రభ ద్వారా అభివృద్ధి చేయబడిన భూములలో సుస్థిర వ్యవసాయం***

ఈ ఇందిర జలప్రభ పథకంలో అభివృద్ధి పరచబడిన భూములలో సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటించే విధంగా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. అదే విధంగా ప్రతీ బోర్‌వెల్ పరిధిలో కనీసం అర ఎకరం విస్తీర్ణంలో కూరగాయలు పెంపకం తప్పనిసరిగా చేపట్టాలి. గ్రీన్ హౌస్, డ్రిప్ ఇరిగేషన్, వంటి వసతుల కోసం ఎం.జి. ఎన్. ఆర్.ఇ.జి.యస్ నిధులను జోడించి రైతులకు సకల సౌకర్యాలు కల్పించటానికి ప్రభుత్వం ప్రయత్నం మొదలు పెట్టింది.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టం స్ఫూర్తికి అనుగుణంగా పేదలకు మన్నికైన, నాణ్యమైన ఆస్తుల కల్పన ద్వారా వారి జీవనోపాధులు మెరుగుపర్చటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన బృహత్తర కార్యక్రమం "ఇందిర జలప్రభ" విజయవంతమయ్యి, పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాలలో ఆనందం నింపుతుందని ఆశిద్దాం.

***ఇందిర జలప్రభ కార్యక్రమ అమలులో వివిధ స్థాయిలలో అధికారులు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యాంశాలు***

1. నిబంధనలమేరకు లబ్ధిదారుల ఎంపిక జరిగినది. లేనిది చూసుకోవాలి (లబ్ధిదారులు ఎస్సీ, ఎస్టీలు మాత్రమే)

**2. బోరు వినియోగదారుల/హక్కుదారురుల సంఘం**

ఎ) బోరుబావి వినియోగదారులు ఒక సంఘంగా ఏర్పడి, జిల్లా నీటి యాజమాన్య సంస్థకు ఒప్పంద పత్రమును వ్రాసి ఇచ్చారో లేదో చూసుకోవాలి.

బి) బోరుబావి త్రవ్వకం (డ్రిల్లింగ్) జరుగుతున్న సమయంలో కనీసం జెపిస్త్ర లోని ఇద్దరు లబ్దిదారులైనా ఉండునట్లు చూసుకోవాలి. అలాగే జియాలజిస్ట్ నివేదికలోను, మరియు కొలతల పుస్తకంలోను లబ్ధిదారుల సంతకాలు చేయించారో లేదో చూసుకోవాలి.

సి) బోరు డ్రిల్లింగ్ (త్రవ్వుచున్న) జరుగుచున్న సమయంలో లబ్ధిదారులతో సహా ఫోటో తీసి ఇ-ఎంఎంఎస్ ద్వారా బ్లూఫ్రాగ్ సర్వర్‌కు అప్‌లోడ్ చేశారో లేదో చూసుకోవాలి.

## జియాలజిస్ట్ పాత్ర

1. బోరు డ్రిల్లింగ్‌కు మునుపే క్షేత్ర స్థాయి పరిశీలన జరిగిందా? లేదా? బోరు డ్రిల్లింగ్ తర్వాత బోరుబావిలోతు మరియు నీటి యొక్క గాఢతను పరీక్షించారో లేదో చూసుకోవాలి.
2. జియాలజిస్ట్ ద్వారా బోరు బావిలోతు, మోటారు ఎంపికకొరకై ధృవీకరణ పత్రము అందిందా? లేదా? చూసుకోవాలి.

***ఇందిర జలప్రభ చెల్లింపులలో గుర్తుంచుకోవాల్సిన అంశాలు***

1. బోరు యజమాని బిల్లులు సమర్పించునపుడు 3 ఫోటలు అనగా బోరు డ్రిల్లింగ్‌కు మునుపు జరుగుచున్నప్పుడు మరియు ఎన్ని ఇంచుల నీళ్ళు అని అంచనా వేయు సందర్భాలలో తీశారో లేదో చూసుకొవాలి.
2. వేసిన బోరులలో కేసింగ్ పైపులు వినియోగానికి ముందు ఒకసారి తప్పనిసరిగా పరీక్షించి పూర్తి బిల్లులు చెల్లించాలి.

## మోటారు కొనుగోలులో

1. ఐ.ఎస్.ఐ మార్కు ఉన్నదో? లేదో? చూడాలి.
2. లబ్ధిదారులు తమ ఆమోదమును ఒప్పందములో వ్రాశారో? లేదో చూసుకోవాలి.
3. వేర్వేరు కంపెనీల విడిభాగాలలో తయారైన వాటిని ఏమైనా వినియోగించారేమో చూసుకోవాలి.
4. జియాలజిస్ట్ ధృవీకరణను కూడా పరిగణనలోనికి తీసుకోవాలి.
5. మోటారు మీదనున ఒక తెల్లటి పేపరు మీద హెచ్‌బి పెన్సిల్ ద్వారా వచ్చునట్లు తీసుకోవాలి. అలాగే బిల్లు మరియు ఓచర్‌నందు ఉందో? లేదో చూడాలి.
6. కెపాసిటరు ఖచ్చితంగా అమర్చునట్లు చూసుకోవాలి.
7. ఆయిల్ ఇంజన్ మోటార్ల ఏర్పాటుకు ఎట్టి పరిస్థితులలోను అనుమతించరాదు

***– టి.యం.కె. గాంధీ, టిసిపార్డ్***

# సమిష్టి కృషితో నీటి సంరక్షణ

**నదులు ఎండిపోతున్నాయి. చెరువులు కుంగిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. సమిష్టి కృషితో జలగండాన్ని అధిగమించకపోతే భవిష్యత్తులో ఎవరూ మనల్ని కాపాడలేరు.**

**మనిషి, జాతి మనుగడ మొత్తం నీటి మీదే ఆధారపడి ఉంది. మానవ మనుగడకు అతి ముఖ్యమయిన నీటి లభ్యత రోజు రోజుకూ తగ్గిపోతుంది.**

గతి తప్పుతున్న ఋతుపవనాలు, నానాటికి పెరుగుతున్న జనాభా, నగరీకరణ, వర్షాభావ పరిస్థితులు వల్ల నీటి కొరత ఏర్పడుతుంది. సామాజిక అవసరాలకు, పారిశ్రామిక అవసరాలకు, ప్రజల నిత్యావసరాలకు నీరు అందుబాటులో లేకుండా పోతుంది. ఈ పరిస్థితులు ఇలాగే ఉంటే రాబోయే కాలంలో గుక్కెడు నీటికోసం అనేక కష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ప్రజలకు మంచి నీరు అందించడం చాలా దేశాల్లో పెను సవాలుగా మారింది.

నీటి పరిరక్షణ లేనట్లయితే దేశం ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మొదలయిన రంగాలలో అభివృద్ధి కుంటుపడుతుంది. వాస్తవంగా తలసరి నీటి లభ్యత 6500 Cubic మీటర్ల నుండి 2500 Cubic Meters కు పడిపోయినట్లు టాటా ఎనర్జి రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థలు సర్వే ద్వారా తెలియజేస్తున్నాయి. దేశంలో ఈ రెండు దశాబ్దాల కాలంలో దాదాపు 300 జిల్లాల్లో నాలుగు మీటర్లకు పైగా భూగర్భ జలమట్టాలే పడిపోయినట్లు వివిధ సర్వేలు వెల్లడిస్తున్నాయి.

కొత్తగా నీటి వనరులను అభివృద్ధి పరచుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుంది. నీటి సరఫరాకు అధిక వ్యయం, వినియోగంలో దుబారా, సాగునీటి ప్రాంతాలలో భూసారక్షత, విచక్షణారహితంగా నీటి వినియోగంతో భూగర్భ జలమట్టం తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. నీటి వనరుల పరిరక్షణకు సమీకృత ప్రక్రియలు చాలా అవసరం. నీటి అవసరాలు నిర్వహణతో పాటు నీటి నాణ్యత, భూ ఉపరితల, భూగర్భజలాల సమయుక్త యాజమాన్య విధానాలు ముఖ్యమయినవి. సాగునీటి పునర్వినియోగం, పరిశ్రమల నుండి వెలువడే నీటిని శుద్ధి చేయడం, నీటి వినియోగంపై సమాజపరంగా స్పృహ చాలా అవసరం. శుద్ధమయిన నీరు కావాల్సినంత పరిమాణంలో లభించకుంటే అనారోగ్యం ప్రబలి పలు రంగాల్లో క్షీణతకు కారణమవుతుంది.



## ముంచుకొస్తున్న నీటి ఎద్దడి

నీటిని సమర్థంగా, పొదుపుగా వాడాలంటే, జల వినియోగంపై రైతులకు శిక్షణ ఇవ్వాలి. సాగునీటి ఇంజనీర్లు, రైతుల మధ్య పరస్పర సహకారముండాలి. అవసరాలు అపారం. అందుబాటులోని నీరు పరిమితం. దాన్ని ఎంతమాత్రం వృధా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవడానికి, అన్ని దశల్లోను సాగునీరు, తాగునీరు పొదుపు విధానాలను, ఇంజనీర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు, సంబంధిత అధికారులు తెలియజేయాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

దేశంలో సరాసరి వర్షపాతం 1170 మి.మీటర్లు అత్యల్ప సగటు వర్షపాతం – 100. మి.మీటర్లు (రాజస్థాన్, థార్ ఎడారి) అత్యధిక సగటు వర్షపాతం –11,000 మి.మీటర్లు (మేఘాలయ, చిరపుంజి) దేశం మొత్తం విస్తీర్ణం 32.80 కోట్ల చదరపు కిలో మీటర్లు. ఈ ప్రాతిపదికన వర్షం ద్వారా ఏడాదికి 3.838 ఘనపు కి.మీటర్ల నీరు లభిస్తుంది. దీనిలో ఆవిరి రూపంలో 40% కాలువలు, నదుల ద్వారా ప్రవహించే నీరు 49%. ఇది ఎక్కువ శాతం సముద్రంలో కలుస్తుంది. మిగిలిన 11% మాత్రమే భూగర్భ జలంగా మారుతుంది.

మరో దశాబ్ద కాలంలో పెరగనున్న జనాభా, తగ్గుతున్న తలసరి వార్షిక నీటి లభ్యత వంటి వాటిని పరిగణలోనికి తీసుకుంటే, దేశం భారీ నీటి ఒత్తిడిని ఎదుర్కోబోతున్నది సుస్పష్టం. ఆమార ఉత్పత్తుల పైనా ప్రతికూల ప్రభావం తప్పదు.


భూమి మీద ఉన్న మొత్తం నీటిలో 70% వరకూ ఉప్పునీరు మిగిలిన 3% మంచినీరు. దీనిలో మంచుగడ్డల రూపంలో 2% మిగిలిన 1% శాతంలో మనం కొంత భాగాన్ని మాత్రమే ఉపయోగించుకుంటున్నాము. మనిషికి రోజుకి సుమారు 60–70 లీటర్లు నీరు అవసరమౌతుంది. ఇదికాక పశువులకు, ఫ్యాక్టరీలకు ఇంకా అనేక అవసరాలకు నీరు ఎంతో అవసరం. భూగర్భ జలాలు వేగంగా తగ్గుముఖం పడుతున్నాయి.

అంతరించిపోతున్న నీటి వనరులు ఆందోళకరంగా పరిణమించాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జల మట్టాలు గరిష్ఠస్థాయిలో పతనం కావడం వల్ల సాగునీరు, త్రాగునీరు అవసరాలు కోసం ప్రజలు అల్లాడిపోయే పరిస్థితి దాపురించింది. ఇంతటి అమూల్యమైన వనరును మనం కాపాడుకోకపోతే భవిష్యత్తు అంధకారమైపోతుంది. కాబట్టి ప్రతి నీటిబొట్టును తగు పద్ధతుల ద్వారా కాపాడుకోగలగాలి.

ప్రతి వర్షాకాలంలో ప్రకృతి మనకు సరిపడు నీటిని ఇస్తుంది. కొంత ముందుచూపుతో ఆ నీటిని ఒక పద్ధతి ప్రకారం వాడుకుంటే సమస్యను కొంతవరకూ అధిగమించవచ్చు. అంటే వర్షపునీటిని సాధ్యమైనంత వరకూ భూగర్భజలంగా మార్చుకోవాలి. వర్షాకాలంలో పడే వాననీటిని భూగర్భంలోకి మరియు చెరువుల్లో, కుంటల్లోకి మళ్లించాలి. అందుకు గ్రామ పంచాయితీలు ముందుకు వచ్చి కృషి చేయాలి. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టం గ్రామ పంచాయితీలు ప్రజలకు త్రాగునీరు సౌకర్యాలు విధిగా కల్పించుటకు నిర్దేశించినది. అందుకు గ్రామ పంచాయితీలు ప్రజల్లో చైతన్యాన్ని నింపి తరిగిపోతున్న భూగర్భ జల వనరులను పెంపొందించడానికి మరియు సహజసిద్దంగా ఉన్న వనరులను కాపాడుకోవడానికి ప్రతి పంచాయితీ పాలకవర్గంతో పాటు ప్రతి పౌరుడు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలి.

## తీసుకోవాల్సిన చర్యలు

- నీటి సంరక్షణకై తగు విధి, విధానాలు మార్గదర్శకాలు తయారుచేయాలి.
- ప్రజలకు నీటి సంరక్షణపై పూర్తి అవగాహన కల్పించాలి.
- నీటిని నిల్వ చేసుకోవడం, సంరక్షించుకోవడంపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది.
- వాటర్ షెడ్లను, నీటి గుంతలు, చెక్‌డ్యాంలు, విరివిగా నిరిర్మించుకోవాలి.
- డాబామీద, పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లలో కురిసే వర్షపునీటిని నిలువ చేసుకోవడానికి ఓ ట్యాంకు ఏర్పాటు చేసుకోవాలి. శుద్ధి చేసుకుని అవసరాలకు వాడాలి.
- మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళలలో మాత్రమే నీరు పోసినట్లయితే అవిరయ్యే సమస్య ఉండదు.
- నీరు అవసరం మేరకు వాడుకుని కుళాయిలను ఆపేయాలి.
- పైపుల లీకేజీ, మరమ్మత్తులు ఉన్నట్లయితే తక్షణమే బాగు చేయించాలి.
- నగరాల నుంచి వెలువడే నీటిని శుద్ధిచేసి తిరిగి వాడేటట్లు చూడాలి.
- కాలువలు, చెరువులు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి. కాలువలు, చెరువుల్లో పూడిక తీయాలి.
- వాల్టా చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు పరచాలి.
- వ్యవసాయానికి బిందు, తుంపర సేద్యాలను అనుసరించాలి.
- వర్షపాతం పెంచేందుకు భారీగా సామాజిక వనాలను ప్రోత్సహించాలి.




- (ప్రధానంగా మనదేశంలో నీటి ఆధారం, ఈశాన్య మరియు నైరుతి రుతుపవనాలు.) వాననీటి / ఉపరితల ప్రవాహ వేగాన్ని అరికట్టాలి. నీటినిల్వ స్టోరేజీల ద్వారా నిల్వ ఉంచాలి.

ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ (చెరువుల పునరుద్ధరణ) కార్యక్రమం అమలును పంచాయితీలు చేపట్టాలి. ప్రజలు ఈ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలి. త్రాగునీటి మరియు వ్యవసాయ చెరువులు, కుంటలలో పూడికతీయడంలో ప్రముఖ పాత్ర పంచాయితీలు పోషించాలి. వాటిలో మల, మూత్ర విసర్జన జరగకుండా మురికి నీటితో కలుషితం కాకుండా పంచాయితీలు చొరవ తీసుకోవాలి.

చెరువులు, కుంటలు కొన్ని సంవత్సరాల తరబడి నిరాదరణకు గురై పూడిక పేరుకుపోయి ఎండి, బీటలు వారిన పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ఖర్చుతో దాదాపు 46 వేల చెరువులను పూడికతీతతో పునరుద్ధరణ చర్చలు చేపట్టింది. అంతేకాక ప్రభుత్వ సహాయంతో గ్రామాలకు కావాల్సిన నూతన చెరువులు ఏర్పాటు చేసుకోవాలి.

ఈ విధంగా మిషన్ కాకతీయకు ప్రజల్లో విశేష స్పందన, ఆదరణ వచ్చింది. దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. ఇందులో భాగంగా ప్రతి పౌరుడు సమిష్టి కార్యచరణతో, సహకార స్ఫూర్తితో నీటి సమస్యను అధికమించాలి. సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులు ద్వారా సంఘటితంగా నీటి సంరక్షణా పద్ధతుల్ని పాటించాలి.

ఈ గ్రామం మన గ్రామం. ఈ చెరువు మన చెరువు అని గ్రామంలో జల వనరుల్ని కలుషితం కాకుండా చూసుకుంటాం. వర్షపునీరు ద్వారా మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తాం. వృధాగా నీరు పోకుండా కాపాడుకుంటాం. పరిగెత్తే నీటిని నిలబెడతాం. అని ప్రతి ఒక్కరూ దృఢ సంకల్పంతో ఉన్నప్పుడే నీటికి కటకటలాడే పరిస్థితి నుండి ఆరోగ్యకరమైన ఒక మంచి అడుగు ముందుకు పడి గ్రామాలు నవ చైతన్యంతో వెల్లివిరుస్తాయని సాహసంగా చెప్పగలం.


**– కె. యాదయ్య**
*సంయుక్త సంచాలకులు (పరిపాలన), టి.సిపార్డ్*



# మౌళిక వసతుల కార్యాచరణ కమిటీ

**మౌళిక వసతుల కార్యాచరణ కమిటీ గ్రామంలోని మౌళిక వసతుల అభివృద్ధికి కావలసిన ప్రణాళిక తయారు చేయాలి. గ్రామంలోని అంతర్గత రోడ్ల, మురుగు కాలువల, వీధి దీపాల మరియు ఇతర సామాజిక ఆస్తుల నిర్వహణపై శ్రద్ధ వహించాలి. గ్రామ పంచాయతీలో ఉన్న వనరులతో అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలి. ఈ కమిటీ పంచాయితీ రాజ్ శాఖ సహాయ ఇంజనీర్, గ్రామీణ నీటి సరఫరా శాఖ సహాయ ఇంజనీర్ మరియు విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్‌ల సహాయ సహకారాలతో, సమన్వయంతో గ్రామంలో సరైన, సమగ్రమైన మౌళిక వసతులను సాధించటానికి కృషి చేయాలి.**

**మౌళిక వసతుల కల్పన కమిటీ**
**క్రిందివారితో కూడి ఉంటుంది**

- ✭ సర్పంచ్ గారు ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉంటారు.
- ✭ ఒకరు లేక ఇద్దరు లేక ముగ్గురు పంచాయతీ వార్డు (సభ్యుల సంఖ్యను బట్టి) సభ్యులుగా ఉంటారు.
- ✭ స్వయం సహాయక సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ✭ స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధి లేక కుల సంఘాల నాయకులలో ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ✭ మౌళిక వసతుల కల్పన విషయములో నిష్ణాతులైన విశ్రాంత అధికారి ఒకరు సభ్యులుగా ఉంటారు.
- ✭ పంచాయతీ కార్యదర్శి సభ్య సమావేశ కర్తగా ఉంటారు.

1. ఈ కమిటీకి ఇతర సభ్యులతో పాటు సర్పంచు అధ్యక్షులుగా ఉంటారు.
2. ఈ కమిటీ ఈ క్రింది విషయాలను సాధించుటకు కృషి చేయాలి.

- ❊ పంచాయతీరాజ్ శాఖ నిధుల అనుసందానముతో గ్రామములోని అంతర్గత రోడ్లు మంచి స్థితిలో ఉండేలా చూడాలి.
- ❊ నిరంతం గ్రామంలోని రోడ్డు ప్రక్కల పెరుగు పిచ్చి మొక్కలను తీసివేస్తూ గుంతలను పూడ్చటానికి ఏర్పాట్లు చేయాలి.
- ❊ SCSP మరియు TSP ద్వారా కేటాయించి నిధులతో SC మరియు ST కాలనీలో రోడ్లు మరియు మురుగు కాలువలను నిర్మించేలా కృషి చేయాలి.
- ❊ మురుగు కాలువలను తరుచుగా శుభ్రం చేయించాలి.
- ❊ ఇంకుడు గుంతలు నిర్మించేలా చూడాలి.
- ❊ గ్రామంలో తగినన్ని వీధి దీపాలు వెలుగునట్లు చూడాలి.
- ❊ గ్రామపంచాయతీకి, వీధి దీపాలకు మరియు నీటి సరఫరా పథకాలకు అనివార్యమైన బిల్లులు రాకుండా నిరోధించటానికి గాను విద్యుత్తు మీటర్లను బిగించాలి.
- ❊ విద్యుత్తు వినియోగాన్ని తగ్గించటానికి గాను తక్కువ విద్యుత్తు వినియోగించే CFL మరియు LED బల్బులు వాడుటను ప్రోత్సహించాలి. వీలైతే సోలార్ బల్బులు పెట్టించేందుకు ప్రయత్నించాలి.

| క్రమ సంఖ్య | కార్యక్రమము | ఆశించు ఫలితం లేక పరిణామం |
|---|---|---|
| 1 | రోడ్లు, మురుగుకాలువల, వీధిదీపముల నిర్వహణ. | ప్రజలకు మెరుగైన వసతులను కల్పించగలగడం. |
| 2 | పన్నులు మరియు పన్నేతరములు వసూలు | పౌరులకు మంచి సేవలను అందించగలగడం, సిబ్బందికి వేతనాలు సకాలంలో చెల్లించడం. |
| 3 | వీధి దీపాలను తగిన రీతిలో నిర్వహించడం. | ప్రజలకు సౌకర్యాలతో పాటు విధ్యుచ్ఛక్తిని సంరక్షించి (ఆదాచేయ) గలగడం. |
| 4 | దళితుల వాడలలో మౌళిక సదుపాయాల ప్రణాళిక– సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, నీటి సరఫరా, సామాజిక భవనాలు నిర్మించుట | షెడ్యూలు కులాల ఉప ప్రణాళికలో ప్రాథమిక సౌకర్యాలను మెరుగు చేయగలగడం. |
| 5 | తండాల , గిరిజన ఆవాసాల అభివృద్ధి ప్రణాళిక– సిమెంటురోడ్లు, మురుగు కాలువలు, నీటి సరఫరా, సామాజిక భవనాలు నిర్మించుట. | షెడ్యూలు తెగల ఉప ప్రణాళికలో ప్రాథమిక సౌకర్యాలను మెరుగు చేయగలగడం. |

*ఈ కార్యాచరణ కమిటీ యొక్క ముఖ్యమైన లక్ష్యాలు :*

- గ్రామంలో మంచి రోడ్లు ఉండేలా చూడాలి.
- గ్రామంలో విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలి.
- పన్నులు 100 శాతం వసూలయ్యేలా చూడాలి.
- గ్రామంలో మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి.
- శ్మశాన వాటికలను గుర్తించి నిర్వహించుట.
- దళిత వాడల ప్రణాళికలు



*గ్రామంలో పౌర సౌకర్యాల మెరుగుకోసం రోడ్లు మంచి స్థితిలో ఉండేందుకు చేపట్టవలసిన కార్యక్రమాలు :*

- గ్రామంలో రోడ్లన్నిటి పరిస్థితిని అంచనా వేయాలి.
- మంచిగా లేని రోడ్లను బాగుచేయటాని&ఇ కావలసిన అంచనా తయారుచేయాలి.
- పనులు చేయుటకు కావలసిన నిధులను సమీకరించి సమన్వయపరచాలి.
- పనులు నాణ్యతగా జరిగేలా చూడాలి.

*గ్రామంలో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలిగేలా చూచుటకు చేయవలసిన కార్యక్రమాలు :*

- సూర్యోదయం తరువాత వీధిదీపాలు వెలిగితే విద్యుత్ వృధా అవుతుంది. వీధిదీపాలు రాత్రి పూట మాత్రమే వెలిగేలా చూడాలి.
- తక్కువ విద్యుత్ వాడుకతో వెలిగే బల్బులు అనగా సి.ఎఫ్.ఎల్./ ఎల్.ఇ.డి. బల్బులను గ్రామంలో అన్ని ఇండ్లలో వాడేటట్లు అవగాహన కల్పించాలి.
- అవసరమైతే సౌరవిద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.
- గ్రామ పంచాయతీ కొనుగోలు చేసిన వీధిదీపాలు సక్రమంగా వాడేటట్లు చూడాలి.

- వీధిదీపాలు దొంగిలించటం అరికట్టాలి.
- గ్రామపంచాయతీలో పగటి పూట వీధి దీపాలు వెలుగు చున్నట్లయితే 3వ వైరు ఏర్పాటు చేసి వీధిదీపాలు వెలుగుట/బందుచేయుటకు వీలు కల్పించాలి.
- విద్యుత్ చౌర్యాన్ని మరియు అధిక బిల్లులను అరికట్టుటకు వీధిదీపాలకు మీటర్లను బిగించాలి.
- ప్రజలకు సౌకర్యంగా ఉండేలా కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేలా చూడాలి.
- గ్రామ ప్రజలు విద్యుత్ పొదుపు గురించి తెలిపి విద్యుత్ పొదుపు చేయు ఉపకరణాలు వాడుటకు అవగాహన కల్పించాలి.

***గ్రామాభివృద్ధి కోసం పన్నులు 100 శాతం వసూలు లక్ష్యాన్ని సాధించటానికి తీసుకోవలసిన చర్యలు :***

- గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి వారు పన్నులు చెల్లించేలా ప్రోత్సహించాలి.
- గ్రామపంచాయతీలో పన్నులు సక్రమంగా మధింపు జరిగేలా చూడాలి.
- గ్రామపంచాయతీలో అన్ని రకాల పన్నులు 100 శాతం విధించేలా చర్యలు తీసుకోవాలి.
- గ్రామపంచాయతీలో వసూలు అయిన ప్రతి పన్నుకు రసీదు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.
- పన్నుల వసూలుకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలి.
- వసూలైన ప్రతి పైసా ఆలస్యం లేకుండా ప్రభుత్వ ఖజానాలో జమ చేయునట్లు చూడాలి.
- వసూలు పద్ధతులు మెరుగుపరచుటకు చర్యలు తీసుకోవాలి.
- పంచాయతీ ఆదాయం పెంచుటకు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి.





- శ్మశాన వాటికలను నిర్వహించుట ద్వారా మరియు చెత్తను వేలం వేయుట ద్వారా ఆదాయం పెంచుటకు చర్యలు తీసుకోవాలి.
- గ్రామపంచాయతీలో సేవల ద్వారా యూజర్ చార్జీలు వసూలు చేయుట ద్వారా ఆదాయం పెంచుటకు కృషి చేయాలి.

***గ్రామంలో మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చేయుటకు తీసుకోవలసిన చర్యలు :***

- గ్రామంలోని మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుటకు పూడికను తీయుటకు చర్యలు తీసుకోవాలి.
- గ్రామపంచాయతీలో చెడిపోయిన మురికి కాలువలను రిపేర్ చేయించాలి.
- వీలైనంత నిధులున్నచో గ్రామపంచాయతీలో భూగర్భ కాలువలను నిర్మించుటకు చర్యలు తీసుకోవాలి.
- గ్రామంలో నీరు నిలుచు స్థలాలలను గుర్తించి అక్కడ ఇంకుడు గుంతలను నిర్మించాలి.

***శ్మశాన వాటికలను ఏర్పరచి నిర్వహించుటకు తీసుకోవలసిన చర్యలు :***

- శ్మశాన వాటికల నిర్మాణం కోసం సరిపడ స్థలాన్ని గుర్తించాలి.
- శ్మశాన వాటికల కోసం స్థలం లేనిచో స్థలం ఏర్పరచుట కొరకు తహసిల్‌దార్‌వారిని కోరవలెను.
- శ్మశాన వాటికలను చదును చేసి అవసరమైన సదుపాయాలు కల్పించుటకు కృషి చేయాలి.
- గ్రామంలోని పౌరులందరు శ్మశాన వాటికను ఉమ్మడి ఆస్తిగా గుర్తించటానికి ప్రోత్సహించాలి.

*– లింబగిరి స్వామి, సిడిపిఏ, టి.సిపార్డ్*



# దళిత వాడల అభివృద్ధి ప్రణాళికలు

- గ్రామపంచాయతీలోని దళిత వాడలలో పౌర సదుపాయాలైన సి.సి.రడ్, డ్రైన్, నీటిసరఫరా, ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ హాలు, ఇంటింటికి మరుగుదొడ్డి, శ్మశాన వాటికల సదుపాయం, వీధిదీపాలు కల్పించుటకు ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.
- దళిత వాడలో రోడ్ల పరిస్థితిని అంచనా వేసి మరమ్మత్తులు చేయుటకు అంచనాలు తయారుచేయాలి.
- దళిత వాడలో రోడ్ల నిర్మాణానికి అంచనాలు వేయించాలి.
- అవసరమున్నచోట కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలి.
- దళిత వాడలోని మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి పూడిక తీత పనులను చేపట్టాలి.
- దళిత వాడలో చెడిపోయి మురుగు కాలువలకు మరమ్మత్తులు చేపట్టాలి.
- షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక నిధులను పై పనులకు అనుసంధానం చేయాలి.
- నిధుల లభ్యత ఉన్న చోట భూగర్భ మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలి.
- నీరు నిల్వ ఉన్న స్థలాలను గుర్తించి నీరు ఇంకి పోవుటకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి.
- నీటిసరఫరా పథకం రిజర్వాయర్ లేక ట్యాంక్‌ను తరచుగా శుభ్రం చేస్తూ ఉండాలి.
- నీటి సరఫరా పథకంలో రోజూ క్లోరినేషన్ చెయ్యాలి.
- దళిత వాడలో కమ్యూనిటీ హాలు(సామాజిక భవనం) నిర్మాణం కోసం రెవెన్యూ వర్గాలు వారిని సంప్రదించి స్థలం కేటాయింపు కొరకు కోరాలి.
- దళిత వాడలో కమ్యూనిటీ హాలు (సామాజిక భవనం) నిర్మాణం కోసం ప్రణాళికను సిద్ధం చెయ్యాలి.
- కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళికలో నిధుల కేటాయింపు కోరాలి.
- నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం ప్రారంభించాలి.
- నిర్మించిన కమ్యూనిటీ హాలు అందరూ ఉపయోగించుకొనేలా చూడాలి.
- దళిత వాడలో మరుగు దొడ్లు లేని ఇండ్లను గుర్తించాలి.
- మరుగు దొడ్లు నిర్మించడం కోసం ఇంటి యజమానులను ప్రోత్సహించాలి.
- నిర్మించిన మరుగు దొడ్లను వాడుకొనేలా అవగాహన కల్పించాలి.
- మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచేలా ప్రోత్సహించాలి.
- మరుగు దొడ్డి వాడిన తరువాత చేతులను శుభ్రంగా కడుగుకొనేలా అవగాహన కల్పించాలి.
- మరుగు దొడ్ల నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని సమిష్టిగా కొనుగోలు చేయుటకు ప్రోత్సహించాలి.
- మరుగు దొడ్ల నిర్మాణమునకు కావలసిన తాపీ మేస్త్రీలను గుర్తించినచో మరుగు దొడ్ల నిర్మాణం తొందరగా పూర్తిచేయ గలుగుతారు.
- దళిత వాడలలో శ్మశాన వాటికల నిర్మాణం కోసం సరిపడ స్థలంను గుర్తించాలి.
- దళిత వాడలలో శ్మశాన వాటికల కోసం స్థలం లేనిచో స్థలం ఏర్పరచుట కొరకు తహసిల్‌దార్‌వారిని కోరవలెను.
- దళిత వాడలలో శ్మశాన వాటికలను చదును చేసి అవసరమైన సదుపాయాలు కల్పించుటకు కృషి చేయాలి.
- దళిత వాడలలో పౌరులందరు శ్మశాన వాటికను ఉమ్మడి ఆస్తిగా గుర్తించుటకు ప్రోత్సహించాలి.
- సూర్యోదయం తరువాత వీధిదీపాలు వెలిగితే విద్యుత్ వృధా అవుతుంది. వీధిదీపాలు రాత్రి పూట మాత్రమే వెలిగేలా చూడాలి.
- తక్కువ విద్యుత్ వాడుకతో వెలిగే బల్బులు అనగా సి.ఎఫ్.ఎల్./ ఎల్.ఇ.డి. బల్బులను గ్రామంలో అన్ని ఇండ్లలో వాడేటట్లు అవగాహన కల్పించాలి.
- అవసరమైతే సౌరవిద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాలి.
- గ్రామ పంచాయతీ కొనుగోలు చేసిన వీధిదీపాలు సక్రమంగా వాడేటట్లు చూడాలి.
- వీధిదీపాలు దొంగిలించుటను అరికట్టాలి.
- గ్రామపంచాయతీలో పగటిపూట వీధిదీపాలు వెలుగుచున్నట్లయితే 3వ వైరు ఏర్పాటు చేసి వీధిదీపాలు వెలుగుట/బందుచేయుటకు వీలు కల్పించాలి.
- విద్యుత్ చౌర్యాన్ని మరియు అధిక బిల్లులను అరికట్టుటకు వీధిదీపాలకు మీటర్లను బిగించాలి.
- ప్రజలకు సౌకర్యంగా ఉండేలా కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేలా చూడాలి.
- గ్రామ ప్రజలు విద్యుత్ పొదుపు గురించి తెలిపి విద్యుత్ పొదుపు చేయు ఉపకరణాలు వాడుటకు అవగాహన కల్పించాలి.
- గ్రామంలోని పౌరులందరు శ్మశాన వాటికను ఉమ్మడి ఆస్తిగా గుర్తించుటకు ప్రోత్సహించాలి.

*– సిడిపిఎ*

# గిరిజన తాండాల అభివృద్ధి ప్రణాళికలు

- గ్రామపంచాయతీలోని గిరిజన తాండాలలో పౌర సదుపాయాలైన సి.సి.రడ్, డ్రైన్, నీటిసరఫరా, ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ హాలు, ఇంటింటికి మరుగుదొడ్డి, శ్మశాన వాటికల సదుపాయం, వీధిదీపాలు కల్పించుటకు ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.
- గిరిజన తాండాలలో రోడ్ల పరిస్థితిని అంచనా వేసి మరమ్మత్తులు చేయుటకు అంచనాలు తయారుచేయాలి.
- గిరిజన తాండాలలోరోడ్ల నిర్మాణానికి అంచనాలు వేయించాలి.
- అవసరమున్నచోట కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలి.
- గిరిజన తాండాలలోని మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి పూడిక తీత పనులను చేపట్టాలి.



- గిరిజన తాండాలలో చెడిపోయి మురుగు కాలువలకు మరమ్మత్తులు చేపట్టాలి.
- గిరిజన తాండాలల అభివృద్ధి నిధులను పై పనులకు అనుసంధానం చేయాలి.
- నిధుల లభ్యత ఉన్న చోట భూగర్భ మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలి.
- నీరు నిల్వ ఉన్న స్థలాలను గుర్తించి నీరు ఇంకి పోవుటకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి.
- నీటిసరఫరా పథకం రిజర్వాయర్ లేక ట్యాంక్‌ను తరచుగా శుభ్రం చేస్తూ ఉండాలి.
- నీటి సరఫరా పథకంలో రోజూ క్లోరినేషన్ చెయ్యాలి.
- గిరిజన తాండాలలో కమ్యూనిటీ హాలు(సామాజిక భవనం) నిర్మాణం కోసం రెవెన్యూ వర్గాలు వారిని సంప్రదించి స్థలం కేటాయింపు కొరకు కోరాలి.
- గిరిజన తాండాలలో కమ్యూనిటీ హాలు(సామాజిక భవనం) నిర్మాణం కోసం ప్రణాళికను సిద్ధం చెయ్యాలి.
- కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం గిరిజన తాండాల ప్రణాళిక నిధుల కేటాయింపు కోరాలి.
- నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం ప్రారంభించాలి.
- నిర్మించిన కమ్యూనిటీ హాలు అందరూ ఉపయోగించుకొనేలా చూడాలి.
- గిరిజన తాండాలలోమరుగు దొడ్లు లేని ఇండ్లను గుర్తించాలి.
- మరుగు దొడ్లు నిర్మించడం కోసం ఇంటి యజమానులను ప్రోత్సహించాలి.
- నిర్మించిన మరుగు దొడ్లను వాడుకొనేలా అవగాహన కల్పించాలి.
- మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచేలా ప్రోత్సహించాలి.
- మరుగు దొడ్డి వాడిన తరువాత చేతులను శుభ్రంగా కడుగుకొనేలా అవగాహన కల్పించాలి.
- మరుగు దొడ్ల నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని సమిష్టిగా కొనుగోలు చేయుటకు ప్రోత్సహించాలి.
- మరుగు దొడ్ల నిర్మాణమునకు కావలసిన తాపీ మేస్త్రీలను గుర్తించినచో మరుగు దొడ్ల నిర్మాణము తొందరగా పూర్తిచేయ గలుగుతారు.
- గిరిజన తాండాలలోశ్మశాన వాటికల నిర్మాణం కోసం సరిపడ స్థలంను గుర్తించాలి.
- గిరిజన తాండాలలో శ్మశాన వాటికల కోసం స్థలం లేనిచో స్థలం ఏర్పరచుట కొరకు తహసిల్‌దార్‌వారిని కోరవలెను.
- గిరిజన తాండాలలో శ్మశాన వాటికలను చదును చేసి అవసరమైన సదుపాయాలు కల్పించుటకు కృషి చేయాలి.
- గిరిజన తాండాలలో పౌరులందరు శ్మశాన వాటికను ఉమ్మడి ఆస్తిగా గుర్తించుటకు ప్రోత్సహించాలి.
- సూర్యోదయం తరువాత వీధిదీపాలు వెలిగితే విద్యుత్ వృధా అవుతుంది. వీధిదీపాలు రాత్రి పూట మాత్రమే వెలిగేలా చూడాలి.
- తక్కువ విద్యుత్ వాడకతో వెలిగే బల్బులు అనగా సి.ఎఫ్.ఎల్./ ఎల్.ఇ.డి. బల్బులను గ్రామంలో అన్ని ఇండ్లలో వాడేటట్లు అవగాహన కల్పించాలి.
- అవసరమైతే సౌరవిద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాలి.
- గ్రామ పంచాయతీ కొనుగోలు చేసిన వీధిదీపాలు సక్రమంగా వాడేటట్లు చూడాలి.
- వీధిదీపాలు దొంగిలించుటను అరికట్టాలి.
- గ్రామపంచాయతీలో పగటిపూట వీధిదీపాలు వెలుగుచున్నట్లయితే 3వ వైరు ఏర్పాటు చేసి వీధిదీపాలు వెలుగుట/బందుచేయుటకు వీలు కల్పించాలి.
- విద్యుత్ చౌర్యాన్ని మరియు అధిక బిల్లులను అరికట్టటానికి వీధిదీపాలకు మీటర్లను బిగించాలి.
- ప్రజలకు సౌకర్యంగా ఉండేలా కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేలా చూడాలి.
- గ్రామ ప్రజలు విద్యుత్ పొదుపు గురించి తెలిపి విద్యుత్ పొదుపు చేయు ఉపకరణాలు వాడుటకు అవగాహన కల్పించాలి.
- గ్రామంలోని పౌరులందరు శ్మశాన వాటికను ఉమ్మడి ఆస్తిగా గుర్తించుటకు ప్రోత్సహించాలి.

**– సిడిపిఏ**

# గ్రామాల సమగ్రాభివృద్ధే గ్రామజ్యోతి లక్ష్యం

**రాష్ట్ర ప్రభుత్వం మరో వినూత్న పథకాన్ని ఆవిష్కరించింది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం. అభివృద్ధిలో గ్రామ పంచాయతీలను క్షియాశీలకం చేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి శ్రీ చంద్రశేఖరరావు గ్రామజ్యోతి కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 8,685 గ్రామ పంచాయతీల పరిధిలోని 87,838 వార్డుల్లో రూ.25 వేల కోట్లతో అమలుపర్చడానికి కార్యాచరణ రూపొందించడం జరుగుతుంది.**

అందుకుగాను విధి విధానాలు రూపొందించడానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ కె.టి. రామారావు నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఆర్థిక మంత్రి శ్రీ ఈటెల రాజేందర్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ టి.హరీష్‌రావు, అటవీ శాఖ మంత్రి శ్రీ జోగు రామన్న సభ్యులుగా ఉన్నారు.

రాష్ట్రంలోని ప్రతి గ్రామం అవసాలను తీర్చడం ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. తమ తమ గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలో పంచాయతీల ఆధ్వర్యంలో ప్రణాళికలను సిద్ధం చేస్తూ, వాటికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ఈ కార్యక్రమం కింద జనాభా ప్రాతిపదకగా ఒక్కో పంచాయతీ పరిధిలో రూ. 2 కోట్ల నుండి రూ. 6 కోట్ల వరకు వ్యయం చేయడం జరుగుతుంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, గ్రామ పంచాయతీలను క్రియాశీలకం చేయడం, గ్రామీణ స్థాయిలో ఎవరికి



వారే తమ ప్రణాళికలను తయారు చేసుకొని అభివృద్ధి చేసుకోవడం గ్రామజ్యోతి లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం మరో కీలక పరిణామం.

'గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి' అనే గాంధీజీ ఆశయానికి నిజ రూపం ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించుకుంటుంది. విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటుంది. గ్రామాల్లో ముందుగా పారిశుధ్యం, తాగునీరు, ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య వైద్యం, సామాజిక భద్రత, పేదరిక నిర్మూలన, సహజ వనరుల నిర్వహణ, వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది.

దాదాపు 26 శాఖల సమన్వయంతో గ్రామజ్యోతి కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. గ్రామజ్యోతి కింద ఎంపిక చేసిన పనులను చేపట్టడానికి 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 3,375 కోట్లతో పాటుగా పన్నుల రూపంలో వచ్చే రూ. 400 కోట్లు, ఎంజిన్ఆర్ఈజీఎస్ నుండి రూ. 2,800 కోట్లు, ఎసీపీ, టిఎస్‌పి మ్యాచింగ్ గ్రాంటుగా రూ. 1000 కోట్లు సమకూర్చడం జరుగుతుంది. దీనికి తోడు పన్నేతర ఆదాయం, కేంద్ర ప్రభుత్వ పథకాలు, గ్రాంట్లు వినియోగించనున్నారు.

2014-15 సంవత్సర కాలంలో 2,200 గ్రామ పంచాయతీలు 100 శాతం పన్ను వసూలు చేశాయి. ఈ మొత్తం సుమారు రూ. 294 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. తెలంగాణలోని 8,685 గ్రామ పంచాయతీల పరిధిలోని 87,838 వార్డుల్లో 2,26,88,576 మంది జీవిస్తున్నారు. మొత్తం గ్రామీణ జనాభాలో షెడ్యూల్డు కులాల వారే 42,12,900 మంది కాగా, షెడ్యూల్డు తెగలకు చెందిన వారు 29,01,266 మంది వరకు ఉన్నారు. వారందరిలో ముందుగా పరిసరాల పరిశుభ్రతపై చైతన్యం తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తుంది. ఆ తర్వాత వ్యవసాయంపై దృష్టి పెట్టింది ప్రత్యామ్నాయ పంటలు, వాణిజ్య పంటల పైకి రైతుల దృష్టి మళ్లించేందుకు చర్యలు చేట్టింది.

యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించడం, ఉద్యోగావకాశాలు కల్పించడంపై కార్యాచరణ రూపొందించడంలో నిమజ్ఞమైంది. కుల వృత్తులను ప్రోత్సహిచడం, పాడి పరిశ్రమను విస్తృత పర్చడంపై కూడా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ప్రతి చేతికి పని, ప్రతి గ్రామంలో ప్రగతి అనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగుతుది. గ్రామాల్లోని ప్రతి ఒక్క కుటుంబానికి పరిశుభ్రమైన మంచినీటిని అందించడానికి పూనుకుంది. విద్య, వైద్యం గ్రామాలకు చేరువ చేయబోతుంది.



ఉపాధి అవకాశాలను గ్రామీణ యువతకు చేరువ చేసేందుకు సిద్ధమైంది. గ్రామీణ పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రణాళికా బద్ధంగా చర్యలకు శ్రీకారం చుడుతోంది. ప్రజలు తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు సొంత ప్రణాళికలు రూపొందించుకునే వెసులుబాటు ఇవ్వబోతుంది. వేల కోట్లు ఖర్చు చేసి గ్రామీణ ప్రజలకు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేరువ చేయబోతుంది.గ్రామాభివృద్ధే దేశాభివృద్ధిగా భావించి చర్యలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గ్రామ జ్యోతి కార్యక్రమానికి రూపకల్పన చేసింది.

గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆగస్టు 17న గ్రామసభ నిర్వహించారు. ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించడం, గ్రామం చుట్టూ తిరిగి చేపట్టాల్సిన పనులను గుర్తించటం, అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడం, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమ చేపట్టారు. 18న గ్రామాలలోని వీధులను శుభ్రపరచడం, చెత్తాచెదారం తొలగించడం డంపింగ్ యార్డులు గుర్తించడం, 19న ప్రభుత్వ కార్యాలయాలు, పిహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రం చేయటం జరిగింది.

20న గ్రామాలు, పట్టణాల్లోని మురికి కాల్వలను శుభ్రం చేయడం, నీరు నిల్వ ఉన్న గుంతల్లో కాలిన ఆయిల్ స్ప్రే చేయటం, ఇంకుడు గుంతల నిర్మాణం చేయడం. 21న తాగునీరు వనరులను శుభ్రపర్చుట, ట్యాంకులలో క్లోరినేషన్ చేయుట, చేతిపంపులు, పబ్లిక్ ట్యాప్‌ల చుట్టూ ప్లాట్‌ఫారంలను నిర్మించుట, ఫిట్ ట్యాప్‌లను మూసివేయుట, ప్రభుత్వ సంస్థలకు నీటి సౌకర్యం కల్పించడం 22న వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక. పబ్లిక్ హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ సెంటర్లలో మరుగుదొడ్లు అందుబాటులో లేనట్లైతే నిర్మాణం చేపట్టడం. 23న గ్రామ సభలను నిర్వహించడం, పంచాయతీల్లో చేపట్టిన పనులను గ్రామజ్యోతి తుది ప్రణాళిక తయారు చేయడం జరిగింది.

రాష్ట్ర స్థాయిలో ప్రణాళికలు తయారై క్షేత్ర స్థాయిలో వాటిని అమలు చేయడం కాకుండా, ఎవరి అవసరాలకు తగినట్లు వారి ప్రణాళికలు తయారు చేసుకొని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వారే బాటలు వేసుకోవడం ఉత్తమమైన మార్గమని ప్రభుత్వం భావించింది. ఇప్పటికే తెలంగాణలో 'మన ఊరు–మన ప్రణాళిక' కార్యక్రమం నిర్వహించడం వల్ల గ్రామజ్యోతికి ఒక మంచి భూమిక ఏర్పడింది. ఫలానా గ్రామం ప్రత్యేకం అని కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతీ గ్రామం అవసరాలను తీర్చాలనేది ప్రభుత్వ సంకల్పంగా ప్రకటించింది. ఇందుకోసం నిధులు సమీకరించడం, వాటిని ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయడం కోసం గ్రామాల వారిగా ప్రణాళికలు రూపొందించడం జరుగుతుంది.

గ్రామాల్లో రోడ్లు, మంచినీరు, మురుగునీటి సారుదల, పారిశుధ్యం, ఇంటింటికి మరుగుదొడ్లు, వీధి దీపాలు, హరితహారం. మెరుగైన విద్యుత్ వ్యవస్థ, విద్య, వైద్యం, స్మశాన వాటికల ఏర్పాటు, గృహ నిర్మాణం, ఉపాధి అవకాశాల కల్పన తదితర రంగాల్లోని ప్రాధాన్యతల మేరకు పంచాయతీలు ప్రణాళికలు సిద్ధం చేసుకొని వివిధ పథకాల కింద ప్రభుత్వం నుండి నిధులు పొందడం ఈ పథకం పరిధిలో సులభం అవుతుంది.

పాఠశాలల నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, సాగునీటి వనరులను మెరుగుపర్చుకోవడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడం కూడా ఈ పథకంతో సాధ్యమనే అభిప్రాయంతో ప్రభుత్వం గ్రామ జ్యోతి కార్యక్రమాన్ని రూపొందిసుకతంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్. రోడ్లు, భవనాలు, వ్యవసాయం, నీటిపారుదల, అటవీ, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల సమన్వయంతో నిధులను సమీకరించి గ్రామ జ్యోతి ప్రణాళికలను అమలు పర్చడం జరుగుతుంది.

ఇప్పటికే వాటర్‌గ్రిడ్ కార్యక్రమాన్ని ప్రకటించి త్వరలో పనులు ప్రారంభించడానికి చర్యలు వేగవంతం చేసింది. కాకతీయ మిషన్ పేరుతో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పెంచడానికి చర్యలు తీసుకుంది. ప్రతిపాదిత గ్రామజ్యోతి కార్యక్రమం గ్రామాల సమగ్రాభివృద్ధికి శ్రీకారం చుట్టేదిగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు అభిప్రాయపడ్డారు.

ప్రజలు తమ గ్రామాభివృద్ధికి తామే ప్రణాళికలు రూపొందించుకోవడం, ప్రభుత్వ సహకారంతో వాటిని అమలు పర్చుకోవడానికి ఇదో మహాదావకాశంగా భావిస్తున్నారు.

ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామజ్యోతి పథకం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. సుదీర్ఘకాలంగా వివిధ కారణాల వల్ల అభివృద్ధికి నోచుకోని గ్రామాలు, మారుమూల పల్లెల ఈ పథకంతో అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడబోతుంది. తెలంగాణ గ్రామాల్లో ఇప్పటికే అనేక సమస్యలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను రూపొందించి వేల కోట్ల నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు కాని కారణంగా గ్రామాల్లోని కోట్లాది మంది ప్రజలు దుర్భర జీవితాలు గడుపుతున్నారు. నిధులు సరిపోవడం లేదనే సాకుతో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్న గ్రామాల సంఖ్య కూడా వేలల్లో ఉంది.

కాలేదు. తెలంగాణలో సంపూర్ణ అక్షరాస్యతకు ప్రభుత్వ ఇప్పటికే చర్యలు చేపట్టింది. విద్యారంగాన్ని బలోపేతం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. అందులో భాగంగా కులాలు లేని గురుకులాలను ఏర్పాటు చేయడానికి సిద్ధమయింది. సిబిఎస్‌సీ పాఠ్య ప్రణాళిక ప్రవేశపెట్టబోతుంది.

కొత్తగా 522 గురుకులాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. తెలంగాణలో కేజీ టూ పీజీ ఉచిత విద్యకు శ్రీకారం చుడుతోంది. గ్రామాల్లోని చిన్న పిల్లలను పాఠశాలలో చేర్పించడం, అర్హులైన పేద విద్యార్థులను వసతి గృహాల్లో చేర్పించడం, వారికి కడుపునిండా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. నిరక్షరాస్యులైన వయోజనులకు విద్యను పున:ప్రారంభించడానికి చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయలు కల్పిస్తుంది.






తెలంగాణ ప్రభుత్వ గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకొని గ్రామ జ్యోతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతుంది. ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్‌రావు ఈ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లి నుండి ప్రారంభించడానికి సిద్ధమయ్యారు.

రాష్ట్రంలో సుమారు 8701 గ్రామాలున్నాయి. అందులో 656 గ్రామాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. ఈ ఏకగ్రీవంతో గ్రామ ప్రజల్లో సమగ్రాభివృద్ధి ఆకాంక్ష వ్యక్తమయింది. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడం మౌలిక సదుపాయాలు కల్పించుకోవడం ద్వారా ప్రజల కష్టాలు తీర్చేందుకు గ్రామజ్యోతి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి పేర్కొనడం గమనార్హం.

రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచి, ప్రజలను అభివృద్ధిలో భాగస్వాములను చేయడం ద్వారా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు ఈ కార్యాచరణ దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణలో అక్షరాస్యత 66.46 శాతంగా నమోదైంది. ఇందులో దళిత, గిరిజనుల అక్షరాస్యత ఆశించిన మేరకు నమోదు

ఇప్పటికే అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లను ఏర్పాటు చేసింది. మంచినీటి సరఫరా, ఆటస్థలాల ఏర్పాటుపై దృష్టి కేంద్రీకరించింది. వైద్య, ఆరోగ్య రంగాలను పటిష్టం చేయడానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతోంది. గ్రామాల్లో అంగన్‌వాడీల ద్వారా నూరుశాతం గర్భిణుల నమోదు, వారికి పౌష్టికాహారం పంపిణీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడటానికి ప్రాధాన్యమిస్తుంది. మాతాశిశు సంరక్షణ, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, కుటుంబ నియంత్రణ వంటి అంశాలకు ప్రాధాన్యం కల్పించింది.

జూనియర్ డాక్టర్ల సేవలు గ్రామీణ ప్రాంతాల్లో వినియోగించుకుని, ప్రజారోగ్యాన్ని కాపాడడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంది. గ్రామాల్లో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. గ్రామీణ ప్రజల్లో చైతన్యం నింపి శ్రమదానం ద్వారా తమ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రోత్సాహకాలను కల్పిస్తోంది. 'పచ్చదనం-పరిశుభ్రత' కోసం భారీ మొత్తంలో నిధులు ఖర్చుచేస్తుంది. ప్రతి గ్రామంలో హరిత వనం కావాలనే ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు మొక్కలు నాటే కార్యక్రమాలకు సర్పంచులను బాధ్యులను

చేస్తుంది. గ్రామాల్లో రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించడానికి వాటర్ గ్రిడ్ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖరరావు శ్రీకారం చుట్టారు. ఫ్లోరోసిస్ బారినపడిన పల్లె ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడానికి కంకణబద్ధమైన క్రియాశీలక కార్యాచరణ ప్రటించారు.

ఇక మీదట ప్రతి గడపకు ప్రభుత్వం నల్లా నీరు అందించనుండి. జనాభా పెరిగిపోవడం, దానికి అనుగుణంగా గతంలో పక్కా ప్రణాళిక లేకపోవడ, ఇంజనీర్ల నిర్లక్ష్యం కారణంగా తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. కానీ తెలంగాణ ప్రభుత్వం నలభై వేల కోట్ల రూపాయలతో రక్షిత మంచినీటి కార్యక్రమాన్ని అమలు చేసి తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నది.

గ్రామాల్లో సరైన మురుగునీటి కాలువ నిర్మాణాలు లేకపోవడం వల్ల వర్షాకాలంలో మురుగనీటి ప్రవాహం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ అనారోగ్యాలకు గురౌతున్నారు. వందశాతం మురుగునీటి కాలువలు పూర్తి చేయాలనేది ప్రభుత్వ సంకల్పం. అనేక గ్రామాలకు ఇప్పటికీ విద్యుత్ సరఫరాలేదు. మారుమూల పల్లెలకు విద్యుత్ సౌకర్యం కల్పించనున్నది. రానున్న రెండు, మూడేళ్ల పూర్తి స్థాయిలో కరెంటు లోటును తీర్చనుంది. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడుతోంది. ప్రతి నియోజకవర్గానికి తారురోడ్ల నిర్మాణానికి రెండుకోట్లు కేటాయించింది. అన్ని గ్రామాల్లో తారురోడ్ల నిర్మాణానికి, బీటీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.







గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న నేపథ్యంలో వాటిని గుర్తించి ఆ స్థలాల్లో ఆటస్థలాలు, పార్కుల నిర్మాణం కోసం ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రభుత్వ భూముల పరిరక్షణ, వినియోగంలో జవాబుదారీతనం కల్పించింది. ముఖ్యంగా గ్రామాలు – మండల కేంద్రాలు – జిల్లా కేంద్రాలను అనుసంధానం చేసే విధంగా రోడ్డు మార్గాలను ఏర్పాటు చేస్తుది. ఆదాయం, కులం, నివాస ధృవీకరణ పత్రాలను గ్రామాల్లోనే పొందే వెసులుపాటు కల్పించబోతుంది. సంబంధిత శాఖలను గ్రామ పంచాయతీలకు అనుసంధాన చేస్తూ పాల నాపరంగా ఎలాంటి ఇబ్బదులు రాకుండా ప్రజలకు అందుబాటులో సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది.

ప్రతి పల్లెను డిజిటల్ గ్రామంగా తీర్చిదిద్దబోతుంది. ఇక మీదట ప్రజలు తమ సౌకర్యాలను గ్రామ పంచాయతీ కార్యాలయం ద్వారా పొందే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు, స్థానిక సంస్థల ప్రతినిధులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి పాలనాపరంగా అవగాహన కల్పిస్తోంది. పంచాయతీల ద్వారా ఉపాధి హామీ పథకం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయనున్నారు.

మెరుగైన ప్రజా పంపిణీ వ్యవస్థతోపాటు రైతులకు వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖల ద్వారా సేవలందించేందుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ ఆస్తులు ప్రజల భూముల సంరక్షణ వనరుల పరి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నది ప్రభుత్వం. గ్రామాల్లో జరగనున్న అభి వృద్ధి పనులను సమీక్షించుకోవడం ప్రజలను భాగస్వాములను చేయడం కోసం ప్రతి రెండు నెలలకోసారి గ్రామ సభలు ప్రజల సమక్షంలో నిర్వహించనున్నారు. దీని ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెరగనుంది. ప్రభుత్వం సంకల్పించిన గ్రామజ్యోతి పథకానికి ప్రజా సహకారం, తోడ్పాటు అందినట్లయితే తెలంగాణాలోని అన్ని గ్రామాలు ఆదర్శ గ్రామాలుగా మారడానికి ఎంతో సమయం పట్టదు.


*– పతంగి శంకర్,*
*సీనియర్ జర్నలిస్టు*



మంగళవారం, 25 ఆగస్టు 2015, హైదరాబాద్ | నమస్తే తెలంగాణ | 13

# కదిలించిన కర్మయోగి..

గడ్డ పారతో తవ్వి, పనులను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

మట్టిని ఎత్తుతున్న సీఎం కేసీఆర్

- చిన్నముల్కనూర్ గ్రామస్తులతో చేయీచేయీ కలిపి.. ■ శ్రమదానంతో ఎందరికో స్ఫూర్తి నింపి.. ■ వీధివీధి తిరుగుతూ.. సమస్యలు తెలుసుకుంటూ..
- అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేస్తూ..
- ఎనిమిదిన్నర గంటలు దత్తత గ్రామంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్..

బహిరంగ సభలో పాల్గొన్న మహిళలు

ముల్కనూర్‌లో తిరుగుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

జెండా ఊపి పనులను ప్రారంభిస్తున్న సీఎం

**కరీంనగర్ జిల్లా** చిగురుమామిడి మండలంలో తాను దత్తత తీసుకున్న చిన్నముల్కనూర్ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి శ్రామికుడయ్యారు.. సోమవారం ముచ్చటగా మూడోసారి గ్రామంలో అడుగుపెట్టిన ఆయన, పార పట్టి, మట్టి ఎత్తి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.. ఉదయం 11:15 గంటలకు బస్టాండ్ వద్ద జెండా ఊపి, శ్రమదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, ఎనిమిదిన్నర గంటల పాటు చెమటోడ్చారు.. వీధివీధి తిరుగుతూ, ప్రజలను చిరునవ్వుతో పలకరిస్తూ, సమస్యలు అడిగితెలుసుకున్నారు.. పరిష్కారానికి హామీ ఇస్తూనే, బాధ్యతలనూ గుర్తు చేశారు.. కలిసిమెలిసి జీవిస్తూ, కష్టపడి పనిచేసి గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలని సూచించారు.. పనిలోపనిగా ప్రజాప్రతినిధులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు..

- కరీంనగర్ ప్రతినిధి, నమస్తేతెలంగాణ

కొబ్బరికాయ కొట్టి శ్రమదాన పనులను ప్రారంభిస్తున్న సీఎం

పాత ఇళ్లను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

గ్రామ సమస్యలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి

అధికారుల సమావేశంలో సీఎం కేసీఆర్

శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు



ఎర్రవల్లి గ్రామంలో పర్యటిస్తున్న సీఎం కేసీఆర్

# ఎర్రవల్లి కావాలె..
# బంగారువల్లి

'ఆరు నెలల్లో స్వరూపం మారాలె. ఎర్రవల్లి నా సొంత ఊరు. ముఖ్యమంత్రిని అయినా నా ఊరిని బాగుచేసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. వెయ్యి మందిమి కలిసి రెండువేల చేతులతో బంగారువల్లిగా నిర్మిద్దాం. నేను నావంతు పనిచేస్తా. పది తట్టలు మోస్తా. మోరీలు సాఫ్‌జేస్తా. మన ఊరిని మనమే బాగుచేసుకుందాం. సంఘటితంగా శ్రమిస్తే సాధ్యం కానిది ఏమీలేదు. కుల, మత, రాజకీయ వైషమ్యాలను విడిచి అభివృద్ధి గ్రామజ్యోతిని వెలిగిద్దాం.' అని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు ఎర్రవల్లి గ్రామస్తులకు పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఎర్రవల్లిలో గురువారం సీఎం కేసీఆర్ పాదయాత్ర నిర్వహించిన అనంతరం గ్రామచావిడి వద్ద ఏర్పాటు చేసిన గ్రామజ్యోతి సభలో ప్రసంగించారు. రాష్ట్రంలోనే ఎర్రవల్లి ఆదర్శంగా నిలువాలన్నారు.

– గజ్వేల్/జగదేవ్‌పూర్, నమస్తే తెలంగాణ

కూలేటట్లున్నది.. ఎట్లుంటాండ్లు గీ గుడిసెల..

సీఎంకు తిలకం దిద్దుతున్న ఎర్రవల్లి మహిళలు..

'అగో అగో సీఎం సార్..' దాబా పైనుంచి చూస్తున్న గ్రామస్తులు..

శిథిలావస్థలో ఉన్న బావిని పరిశీలిస్తూ..

గ్రామజ్యోతి కార్యక్రమానికి హాజరైన ఎర్రవల్లి గ్రామస్తులు

'ఇక్కడ మొత్తం శుభ్రంగా ఉండాలె..' పరిసరాలను చూపిస్తున్న సీఎం..

'ఊరు స్వరూపం మారాలె..' గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

గ్రామజ్యోతి కార్యక్రమంలో..




# గ్రామజ్యోతి స్ఫూర్తితో ఆదర్శగ్రామాలు

**గ్రామీణ ప్రజలు జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ నేటికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన విద్య, వైద్యం, ఆరోగ్యం, త్రాగునీరు పారిశుద్ధ్యం, గృహవసతి, పౌష్టికాహారం మొదలగు పలు అంశాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు నానాటికి దిగజారుతున్నాయి ఇటువంటి పరిస్థితులు మధ్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రణాళిక బద్ధంగా గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా శ్రీకారం చుట్టింది.**

ఈ కార్యక్రమం కోసం వేలకోట్లు ఖర్చుచేసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్ళనుంది. ఇందులో భాగంగా ప్రజలు తమ తమ గ్రామాలను వారే అభివృద్ధి చేసుకునేందుకు సొంత ప్రణాళికలు రూపొందించుకునే అవకాశం గ్రామజ్యోతి కార్యక్రమం కల్పించింది.

రాష్ట్రంలో ఉన్న ప్రతి గ్రామం ఆదర్శగ్రామంగా రూపొంతం చెందడానికి గ్రామజ్యోతి కార్యక్రమం ఒక వరంగా భావించాలి. ఈ కార్య క్రమంలో భాగంగా ప్రతి గ్రామపంచాయితీ నూతన ఒరవడుల ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల్లో మెరుగుదల తీసుకురావడానికి ప్రతి గ్రామ పంచాయితీ నిర్మాణాత్మకంగా పనిచేయవలసి ఉంటుంది.

సమస్యలు పరిష్కారానికి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేసుకుని ఐక్యతతోపాటు బహుముఖ నాయకత్వాన్ని పెంపొందిస్తూ ప్రజల సంపూర్ణ భాగస్వామ్యంతో గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా అడుగులు ముందుకేస్తూ ప్రగతికి బాటలు వేయాలి. గ్రామంలో నివసించే ప్రజలు వారి సదుపాయాలు కోసం ఎదురుచూసే స్వభావం నుండి దూరం చెయ్యాలి. అందుకు గ్రామజ్యోతి కార్యాచరణ కమిటీలు ప్రముఖ పాత్ర పోషించి ప్రతి గ్రామాన్ని ఆదర్శంతమైన గ్రామంగా రూపదిద్దుకునేందుకు కృషిచేయవలసివుంటుంది అందుకు కొన్ని నియమాలతో ప్రతి కమిటి ముందుకెళ్ళాలి.



కుల మతాలకు అతీతంగా రాజకీయాలకు సంబంధం లేకుండా గ్రామప్రజలందరూ ఒకే కుటుంబంలా కలసి మెలిసి **ఐకమత్యంతో** ఉండాలి గ్రామంలో వివిధ రాజకీయ పార్టీలు ప్రభావం ఉన్నప్పటికీ ఈ ప్రమేయం కేవలం ఎన్నికల వరకే పరిమితమయ్యి ఎన్నికలు

తరువాత గ్రామ అభివృద్ధికి సమిష్టిగా పాటుపడాలి. **ఐకమత్యం**తో ప్రణాళికలు రూపొందించుకుని ముందుకెళ్ళాలి. గ్రామజ్యోతి కార్యాచరణ కమిటీలు **ఐకమత్యం**తో పనిచేసినప్పుడే విజయాలు ముందుకొస్తుంటాయి.

గ్రామంలోని అన్ని వర్గాల వారిని ముఖ్యంగా బలహీన వర్గాలు ఎస్సీ,ఎస్టీలు, మహిళలు మొదలగు వర్గాల వారిని ప్రణాళికల్లో రూపొందించడంలో భాగస్వాములు చెయ్యాలి. అప్పుడే ఈ కార్యక్రమానికి ఒక అర్థం వస్తుంది.

గ్రామజ్యోతి కార్యక్రమంలో ప్రతి గ్రామము అభివృద్ధి చెందాలంటే గ్రామంలో బలమైన కార్యచరణ కమిటీలు అవసరంతోపాటు ఆ కమిటీలు యొక్క పనితీరు చాలా ముఖ్యం. ప్రతి కార్యాచరణ కమిటి ఎటువంటి తారతమ్యాలు లేకుండా రాగద్వేశాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించగలగాలి అందుకు కమిటీలకు నాయకత్వం వహించే వ్యక్తులు చాలా ముఖ్యం ఆ వ్యక్తులు **విశ్వసనీయత**తో పనిచేయవలసి వుంటుంది. కమిటీలోని సభ్యులందర్నీ కలుపుకుంటూ వారితో అపారమైన నమ్మకంతో పనిచేయవలసి ఉంటుంది.

గ్రామజ్యోతి కార్యక్రమంలో **నిస్వార్థం**తో ఏ విధమైన లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవ చేయుటకు ప్రభుత్వం అందించే పథకాలు ప్రజలకు సమానంగా అందేందుకు కృషి చేయవలసి ఉంటుంది. అందుకోసం ప్రతి కమిటీ దృఢనిశ్చయంతో పని చేయవలసివుంటుంది.

ప్రతి గ్రామ కార్యాచరణ కమిటీ **పారదర్శకత**తో పనిచేయాలి గ్రామజ్యోతిలో వచ్చే నిధులను సక్రమంగా ఖర్చు చేసేందుకు కృషి చేయాలి. ఆర్థిక లావాదేవిల్లో మరియు ఇతర కార్యకలాపాల్లో ఎటువంటి దాపరికం లేకుండా సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియపర్చాలి. గ్రామజ్యోతిలో వచ్చే వనరుల్ని ప్రజలకు సద్వినియోగమయ్యేలా కృషి చేసి జవాబుదారి తనంతో కమిటీ వ్యవహరించాలి.




రాష్ట్ర స్థాయిలో ప్రణాళికలు తయారై క్షేత్ర స్థాయిలో వాటిని అమలు చేయడమే కాకుండా ఎవరి అవసరాలకు తగినట్లు వారే అంటే ఏ గ్రామ అవసరాలు ఆ గ్రామ ప్రజలే గుర్తించి **ప్రణాళికలు** తయారుచేసుకోవాలి. ఆగ్రామ అభివృద్ధికి వారే బాటుల వేసుకోవాలి. గ్రామ సమగ్ర అభివృద్ధికి ఏం చెయ్యవచ్చు ఎవరి సహకారంతో చెయ్యాలి. ఎంత సమయం పడుతుంది నిధులు ఎక్కడి నుండి సేకరించవచ్చు ఉన్న అవసరాల్లో ఏది ముఖ్యమైనది. మొదలైన అంశాలన్నింటిని పరిగణలోకి తీసుకుని **ప్రణాళికలు** తయారుచేసుకోవాలి.

గ్రామజ్యోతి కార్యక్రమంలో గ్రామ కార్యాచరణ కమిటీ గుర్తించవలసిన మరొక ముఖ్యమైన అంశం ఏమిటంటే ఏ ఏ అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామంలో ఉన్న ఏ ఏ వనరులు ఉపయోగించుకోవచ్చు అనే అంశాన్ని తప్పకుండా గుర్తించుకోవాలి. వాటిపట్ల సమగ్రమైన అవగాహన కలిగి ఆ వనరులు సద్వినియోగానికి సుస్థిరమైన పద్ధతుల ద్వారా గ్రామ అభివృద్ధికి పాటుపడాలి.

గ్రామజ్యోతి కార్యక్రమంలో గ్రామాల అభివృద్ధికోసం ఒక **లక్ష్యాన్ని** ఏర్పరుచుకోవాలి ప్రభుత్వ నిధులను వినియోగించి ప్రజలకు సక్రమంగా సేవలు అందజేయడంలో గ్రామజ్యోతి కమిటీ నిర్దేంచిన **లక్ష్యం** కొరకు పనిచేయాలి.

గ్రామ కార్యచరణ కమిటీలు క్రమం తప్పకుండా సమావేశం కావాలి. గ్రామ సభలు క్రమం తప్పకుండా నిర్వహించుకొని నిర్దేశించిన లక్ష్యాల సాధ్యాసాధ్యాలను సమావేశంలో చర్చించుకోవాలి.

కార్యచరణ కమిటీ సభ్యులు తమ తమ విషయ పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం నిర్వహించే అన్ని ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాలకు తప్పక హాజరవుతూ నూతన పద్ధతులు/ పరిజ్ఞానం తెలుసుకుంటుండాలి.



ఇలా ప్రతి గ్రామం మంచి నాయకత్వం, భాగస్వామ్యం, పారదర్శకత, సమానత్వం, ప్రభుత్వ పథకాలపై అవగాహన, నిర్దేశించిన లక్ష్యం, అక్షరాస్యత, ప్రజలకు నిస్వార్థమైన సేవ చేయాలనే తపన, నిర్వహణా సామర్థ్యం మొదలైన లక్షణాలన్నింటితో ముందుకెళ్తే తెలంగాణా రాష్ట్రంలో ఉన్న ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా రూపొందుకోగలుగుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

***– ఎం. ప్రదీప్‌కుమార్,*** *రిసెర్చ్ అసోసియేట్, టి.సిపార్డ్*



# బ్రతుకు బాగుకు భరోస గ్రామీణ ఉపాధి హామీ పథకం

**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ 2005లో ప్రవేశపెట్టడం జరిగింది.**

ఇట్టి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశాలు 2 రకాలుగా చెప్పటం జరిగినది. అవి 1. నైపుణ్యత లేని 100 రోజుల పని. 2. సుస్థిర ఆస్థుల కల్పన.

వలసల నివారణ కొరకై జాబ్‌కార్డు కలిగి పని చేయటానికి ఆసక్తి ఉన్న ప్రతి కుటుంబానికి ఆర్థిక సంIIలో (ఏప్రిల్ 1 నుండి మార్చి 31) 100 రోజుల పని కల్పించవలసిన బాధ్యత గ్రామ పంచాయతీకి ఉన్నది. ఇట్టి పనుల ద్వారా వ్యక్తిగత ఆస్థులను, ఉమ్మడి ఆస్తులను సృష్టించటం మరియు సుస్థిర పరచటానికై చేయబడును.

గత సంవత్సరం నూతనంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తెలియపరిచిన పై ఉద్దేశాలకు అదనంగా పంచాయతీరాజ్ సంస్థల భాగస్వామ్యం పెంపొందించి సంస్థలను బలోపేతం చేస్తూ జవాబుదారితనాన్ని పెంపొందించటం అనే అంశాలు చేర్చటం జరిగింది.

గ్రామస్థాయిలో పథకం అమలు కొరకై గ్రామ పంచాయతీకి



బాధ్యతలు ఇచ్చుట జరిగింది. గత 9 సంవత్సరాలు గా ఇట్టి బాధ్యతలలో భాగంగా గ్రామ పంచాయతీ భాగస్వామ్యం పనులను తీర్మాణాలు ఇచ్చుట వరకే ఉంటుంది. గ్రామపంచాయతీ పథకం అమలులో ముఖ్యపాత్ర వహించాలని చట్టంలో చెప్పినప్పటికీ అన్ని పనులు ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా చేయిస్తూ ఇతర బాధ్యతలను ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అప్పగిస్తూ గ్రామ పంచాయతీ నామమాత్రంగా ఉండుట జరుగుచున్నది. ప్రస్తుతం కార్యాలయం నుండి ఎప్పుడు వత్తిడి చేస్తున్నారో అప్పుడు మాత్రమే నామమాత్రంగా పనులు ప్రారంభించుట జరుగుతుంది. దీని వలన పథకం అమలు గ్రామస్థాయిలో ఆశించన స్థాయిలో జరగటం లేదు. ఇట్టి పథకం గ్రామాలలో పటిష్టంగా అమలు చేయుటకు గ్రామ పంచాయతీ బాధ్యతలు తీసుకుని పథకంలో ఏ పనులు చేయవచ్చో గ్రామంలోని ప్రజలకు తెలియపరచాలి. దీని కొరకై క్రింది పద్ధతులు అమలు చేయాలి.

1. ఫ్లెక్సీల ద్వారా కాని గోడ రాతల ద్వారా పథకంలో ఏయే పనులు చేయవచ్చో గ్రామస్థులకు తెలియపరచాలి.
2. జిల్లా స్థాయిలో గానీ, మండల స్థాయిలో గానీ ప్రతి నెలా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామజ్యోతిలో గుర్తించబడిన కమిటీలకు పథకంపై పూర్తి అవగాహన కల్పించుటకు తగు శిక్షణలు ఇప్పించాలి.
3. గ్రామ పంచాయతీలోని ఎస్.ఎస్.ఎస్ గ్రూపుల నుండి పని కొరకై దరఖాస్తులు స్వీకరణ తప్పనిసరిగా గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి స్వీకరించి రశీదు ఇప్పించాలి. దీని వలన పనికి దరఖాస్తులు తీసుకునేవారు మరియు పనులు కల్పించేవారు వేర్వేరుగా ఉంటారు. ప్రస్తుతం దరఖాస్తు, పని కల్పించే వారు ఒక్కరే (ఫీల్డ్ అసిస్టెంట్) ఉండుట వలన అతనికి

వీలు అయితే పని కల్పించటము లేకుంటే పని లేదని చెప్పటం జరుగుతుంది. ఇట్టి కారణంగా వలసలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. దరఖాస్తు తీసుకునేవారు, పనులు ప్రారంభించేవారు వేర్వేరుగా ఉన్నట్లయితే పథకం అమలు సక్రమంగా సాగుతుంది. దరఖాస్తు తీసుకుని గ్రామ పంచాయతీ కార్యదర్శి రశీదు ఇచ్చే బాధ్యత, పనులు కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్ తీసుకోవాలి.

4. కరువు పరిస్థితులు ఉన్నప్పుడు 100 రోజులతో పాటు అదనంగా ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించాలి. దీనికి అనుగుణంగా గ్రామ పంచాయతీ ముందస్తుగా పనులు గుర్తింపు చేసుకోవాలి.
5. గ్రామ పంచాయతీ తన పరిధిలోనే అన్ని గ్రామాలలో పేదల కుటుంబాలను గుర్తించి వారికి తప్పనిసరిగా పనులు కల్పించాలి.
6. నిస్సహాయత కుటుంబాలకు (భూమిలేని నిరుపేదలు, ఎస్.సి/ఎస్.టి. కుటుంబాలు, స్త్రీ ఆధారిత కుటుంబాలు, వికలాంగుల కుటుంబాలు, అడవులలో నివసించే జాతులు) 100 రోజుల నిబంధన ఉండకుండా ఉండి ఏ సమయంలో అయినా పని చేసుకునే వెసులుబాటు కల్పించాలి.
7. పనులు చేసిన వారికి ఖచ్చితంగా వారంలోపు డబ్బులు అందించాలని ఇట్టి పని పోస్ట్ఆఫీస్, బ్యాంకు, ఇంకో ఇతర ఏ పద్ధతులు అవలంబించైనా ఇట్టి పని సకాలంలో పూర్తి చేయించాలి. ఇటి బాధ్యతను గ్రామ పంచాయతీ కమిటీ వేసి వేతనాల చెల్లింపులు పరిశీలించాలి.

ప్రస్తుతము తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఇట్టి కరువు నివారణ కొరకై మరియు వలసలు నివారించుట ఉపాధి హామీ పథకంలో అనేక అవకాశాలు ఉన్నాయి.

## కరువును ఎదుర్కొను పనులు

గ్రామ పంచాయతీ వలసల నివారణకు, కరువు పరిస్థితులు ఎదుర్కొనేందుకు గ్రామ పంచాయతీ పూర్తి బాధ్యతలు తీసుకుని గ్రామంలోని రైతుల భూమిపై పడ్డ ప్రతి నీటి బొట్టును భూమిలో ఇంకింపచేయుటకు పనులు గుర్తింపు చేయాలి. ఇట్టి పనులు చేయుట ద్వారా భవిష్యత్తులో భూగర్భ జలాలను పెంపొందించవచ్చును. దీని వలన భవిష్యత్తులో వలస నివారణ కొంత వరకు తగ్గించవచ్చు. అలాగే ఇట్టి పనులు వెంటనే ప్రారంభించి ప్రస్తుత వలసలు నివారించవచ్చు.

**పనులు:**

1. వాలుకు అడ్డుగా కందకాలు త్రవ్వటం (ప్రభుత్వ భూములు, రైతుల భూములు)
2. ప్రతి రైతు వాలులో ఒక ఇంకుడు గుంత (ఫారంపాండ్, డగౌట్‌ఫాండ్) నిర్మించుకొనుట.



3. చిన్న ఊట కుంటల నిర్మాణం.
4. భూమి సరిహద్దులకు చెట్ల పెంపకము (బండ్ పాంటేషన్).

పైన తెలియపరిచిన పనులు చేయుట ద్వారా గుర్తింపులో రైతులు కొంత భూమి కోల్పోతున్నాము అనే భావన ఉండి ఒప్పుకొనుట జరుగుటలేదు. ఇట్టి అపోహలు తొలగించుటకు ఇట్టి రైతులకు భవిష్యత్తులో కలిగే లాభాలు వివరించాలి. (గత 25 సంవత్సరాల క్రితం భూగర్భజలాలు 50 ఫీట్ల వరకు అందుబాటులో ఉండి ఆరోగ్యకరమైన, త్రాగుటకు వీలుగా ఉండే నీరు లభ్యం అయ్యేది.

ప్రస్తుతం 300 ఫీట్లలో నీరుఅందుబాటులో ఉన్నది. ఇది విషతుల్యంగా మారి ఆరోగ్యాలకు హాని చేస్తున్నాయి. భవిష్యత్తులో 1000 ఫీట్ల వరకు నీరు అందుబాటులో లేకుండా ఉండే పరిస్థితులు వస్తాయి. అనే విషయం అట్టి రైతుకు తెలియచెప్పి రైతును ఒప్పించాలి).

పైన తెలియచెప్పిన పనులు ప్రస్తుతం గ్రామ పంచాయతీ ప్రజల భాగస్వామ్యంతో గ్రామజ్యోతిలో వేసిన గ్రామ పంచాయతీ సహజ వనరుల కమిటీ మరియు ఉపాధి సిబ్బంది ద్వారా ఇట్టి పనులు గుర్తించి ఇట్టి సమాచారం గ్రామ పంచాయతీ తీర్మానంతో మండలంలో ఉపాధి హామీ పథకం అమలు చేయు / దృష్టికి తీసుకెళ్లవలసిన బాధ్యత అట్టి గ్రామ సర్పంచ్/కార్యదర్శి/పీల్డ్ అసిస్టెంట్ వెంటనే తీసుకోవాలి. ఇట్టి పనులకు సంబంధించిన అంచనాలు వెంటనే కంప్యూటర్ సెంటర్‌లో నమోదు చేసి పరిపాలన అనుమతికై పథక సంచాలకులు (PDDWMA) పంపించి అనుమతి తీసుకోవాలి. ఇట్టి విషయంలో గ్రామ పంచాయతి గ్రామ సహజ వనరుల కమిటీ తమ గ్రామాలలో వలసలు నివారణకు మరియు గ్రామంలోనే పనులు కల్పించుటకు ఉత్సాహంగా ముందుకు రావాలి. గ్రామంలో పేదరికంతో బాధపడే కుటుంబాలకు తనవంతు సహాయంగా ఇట్టి పనులు చేపట్టినట్లయితే వెంటనే వలసలు నివారించవచ్చు. ఇట్టి పనులు చేసి తెలంగాణలో భవిష్యత్తులో నీటి సౌకర్యాలు పెంపొందించి వలసలు నివారించవచ్చు.

*– అబేద్ అబ్దుల్ వదూద్ ఖాన్*
*– కె. గోపాల్ రెడ్డి*
*సిఆర్‌డి*

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. Telangana, Published at TSIPARD, Rajendranagar, Hyderabad-500 030 **Editor : Anita Ramachandran**



గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా గంగదేవ్‌పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు




టిసిపార్డులో జరిగిన తెలంగాణ స్టేట్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్
సోసైటి ప్రిన్సిపల్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న విద్యా శాఖ మంత్రి శ్రీ కడియం శ్రీహరి



వాటర్ గ్రిడ్ కార్యక్రమంపై టిసిపార్డులో జరిగిన సమీక్షా సమావేశంలో అధికారులను ఉద్దేశించి
మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి శ్రీ కె. తారకరామరావు





టిసిపార్డులో జరిగిన తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ప్రిన్సిపల్స్ సమావేశంలో పాల్గొని
మాట్లాడుతున్న పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ జె. రేమండ్ పీటర్, ఐ.ఏ.ఎస్.



టిసిపార్డులో జరిగిన 69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



టిసిపార్డులో జరిగిన డి.డబ్ల్యు.ఎమ్.ఏ. సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పంచాయితీరాజ్ మరియు
గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్., ఐ.ఏ.ఎస్.



StanikaCov_SEP_2015.indd 2
16/09/15 1:14 PM